అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
శనివారం 01-4-2023
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 | సంచిక : 90 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50



హంగామా మొదలైంది

ఇండియన్ ప్రీమియర్ లీగ్ హంగామా మొదలైంది. అహ్మదాబాద్‌లోని మోతెరా స్టేడియంలో ఐపీఎల్ 16వ సీజన్ అట్టహాసంగా ఆరంభమైంది. రష్మిక మందన, తమన్నా భాటియా నృత్య ప్రదర్శనలు.. అరిజిత్ సింగ్ బాణీలతో కూడిన ఆరంభ వేడుకులు అభిమానుల్లో జోష్ తీసుకొచ్చాయి. ఐపీఎల్ 16 ఆరంభ మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ తలపడ్డాయి.

వివరాలు ఆటలులో..

కార్మిక హక్కులపై దాడికి వ్యతిరేకంగా నిరసన దినం

ఏప్రిల్ 28న రక్షణ రంగ ఉద్యోగుల ఆందోళన : ఆలిండియా డిఫెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్

నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

రక్షణ పరిశ్రమలో ట్రేడ్ యూనియన్ హక్కులు, కార్మికుల హక్కులపై పెరుగుతున్న దాడికి వ్యతిరేకంగా ఏప్రిల్ 28న అఖిల భారత నిరసన దినంగా పాటించాలని ఆలిండియా డిఫెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఏఐడీఈఎఫ్) పిలుపు ఇచ్చింది. రక్షణ రంగంలో ఇప్పటికే అనేక ఆందోళనలు జరిగిన నేపథ్యంలో ఏఐడీఈఎఫ్ జాతీయ కార్యవర్గ సమావేశం ఈ నెల 29, 30 తేదీల్లో తమిళనాడులోని అరువంకాడులో జరిగింది. ఈ సందర్భంగా ఏఐడీఈఎఫ్ జాతీయ అధ్యక్షుడు ఎస్.ఎన్ పాఠక్ అధ్యక్షతన జరిగిన ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం పలు తీర్మానాలను ఆమోదించింది. రక్షణ మంత్రిత్వ శాఖ కింద పనిచేస్తున్న 4 లక్షల మంది డిఫెన్స్ సివిలియన్ ఉద్యోగులు ఆందోళనలో ఉన్నారని తెలిపింది. ఇప్పటికే 41 ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు కార్పొరేటీకరించారని, ఇప్పుడు ...5లో



డిగ్రీ చూపించమంటే..జరిమానా?

- గుజరాత్ హైకోర్టు తీర్పుపై ట్విట్టర్‌లో కేజ్రీవాల్

ప్రధాని విద్యార్హతలు తెలుసుకునే హక్కు ప్రజలకు లేదా..?

న్యూఢిల్లీ : సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కింద ప్రధాని మోడీ విద్యార్హతలను కోరినందుకు తనకు గుజరాత్ హైకోర్టు రూ. 25,000 జరిమానా విధించడంపై ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. ఈ మేరకు హైకోర్టు తీర్పుపై ఓ వెబ్‌సైట్ కథనాన్ని షేర్ చేస్తూ కేజ్రీవాల్ ట్విట్టర్ వేదికగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ప్రధాని ఎంతవరకు చదువుకున్నారని తెలుసుకునే హక్కు కూడా దేశానికి (ప్రజలకు) లేదా అని కేజ్రీవాల్ ప్రశ్నించారు. " వారి డిగ్రీని చూడాలని డిమాండ్ చేసే వారికి జరిమానా విధించడం ఏంటి..?, అసలేం జరుగుతున్నది. నిరక్షరాస్యుడు, తక్కువ చదువుకున్న ప్రధాని దేశానికి చాలా ప్రమాదకరం" అని ఆయన ట్విట్టర్‌లో రాసుకొచ్చారు. కాగా, ప్రధాని డిగ్రీ పత్రాలను చూపించాల్సిన అవసరం లేదని గుజరాత్ హైకోర్టు అంతకముందు స్పష్టం చేసింది. దీనికి స్పందనగానే ...5లో





ఏప్రిల్ 3న ప్రతిపక్ష పార్టీల సమావేశం

- సోషల్ జస్టిస్-ది రోడ్ ఎహెడ్ పేరుతో డీఎంకే మెగా సమావేశం
- హాజరుకానున్న 20 పార్టీల నేతలు

5లో



కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించండి

- ఉత్తర్వులు జారీ చేసేలా ఆదేశాలివ్వాలి : సీఎం కేసీఆర్‌కు తమ్మినేని లేఖ

5లో

ఎంసెట్ పరీక్ష తేదీల్లో మార్పు

మే 12 నుంచి 14వరకు ఇంజినీరింగ్ విభాగం 3లో

తొవ్వేయడమే

రిజర్వు ఫారెస్టుల్లో కమర్షియల్ మైనింగ్



- క్యాప్టివ్ బ్లాకుల నుంచి తవ్వకాలకు కేంద్రం ఓకే
- గతనెల 17నే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు సర్క్యులర్
- 2021లోనే సంబంధిత చట్టాన్ని సవరించిన మోడీ సర్కారు
- తాజాగా కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ క్లియరెన్సులు
- ఇది ఆదివాసీల హక్కులను హరించడమే : పర్యావరణవేత్తలు, సామాజిక కార్యకర్తల ఆగ్రహం

దేశంలోని మోడీ సర్కారు ప్రకృతి వనరులను ప్రయివేటు మైనింగ్ కంపెనీలకు కట్టబెడుతున్నది. సదరు కంపెనీల ప్రయోజనాలే ధ్యేయంగా పని చేస్తున్నది. ఇందుకు పర్యావరణ పరిస్థితులను సైతం లెక్క చేయడం లేదు. ముఖ్యంగా, అటవీ ప్రాంతాలకు సమీపంలో నివసించే పలు తెగల ప్రజలు, రిజర్వ్ ఫారెస్టుల్లో ఉండే జంతువుల మనుగడను కూడా పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నది. తాజాగా రిజర్వు ఫారెస్టుల్లోని క్యాప్టివ్ బ్లాకుల నుంచి కమర్షియల్ మైనింగ్‌కు మోడీ ప్రభుత్వం అనుమతించింది. ఈ ఏకపక్ష నిర్ణయం అక్కడుండే ఆదివాసీలకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను ఉల్లంఘించడమేనని పర్యావరణవేత్తలు, సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు.

న్యూఢిల్లీ : కమర్షియల్ మైనింగ్‌కు సంబంధించి గతనెల (మార్చి) 17నే కేంద్రం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు సర్క్యులర్‌ను సైతం జారీ చేసింది. పరిమితులకు లోబడి ఒక ఏడాదిలో వెలికితీసిన మొత్తం మినరల్స్‌లో 50 శాతం వరకు అమ్ముకునేలా రిజర్వు ఫారెస్టుల్లోని మైన్‌లకు చెందిన లీజుదారులకు అనుమతులు ఇవ్వాలనీ రాష్ట్రాలోను అందులో ఆదేశించింది. ఫారెస్ట్ అడ్వైజరీ కమిటీ (ఎఫ్ఏసీ) సిఫారసులపై ఆధారపడి కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు (ఎంఓఈఎఫ్ఏసీసీ) ఈ సర్క్యులర్‌ను జారీ చేసింది. రిజర్వ్ ఫారెస్టులోని క్యాప్టివ్ బ్లాకుల మైనింగ్ నుంచి సేకరించిన ఖనిజాల వాణిజ్య విక్రయంపై గతంలో ఉన్న పరిమితులను అందులో సడలించింది.

గతంలోనే చట్ట సవరణ

ఈ సర్క్యులర్‌కు ముందే మోడీ ప్రభుత్వం మైనింగ్ కంపెనీలకు అనుకూలంగా క్షేత్రస్థాయిలో అంతా సిద్ధం చేసి ఉంచింది. తవ్వకాలు మరియు ఖనిజాలు (అభివృద్ధి మరియు నియంత్రణలు) నిబంధనలు, 1957 చట్టాన్ని 2021 మార్చిలో మోడీ ప్రభుత్వం ఇప్పటికే ...5లో



ఛీ...

దొరకని పట్టు.. అటకెక్కిన చేరికలు

- రాష్ట్ర పర్యటనకు మొహం చాటేస్తున్న బీజేపీ అగ్రనేతలు
- పలుమార్లు ప్రధాని, అమిత్‌షా, నడ్డా పర్యటనలు రద్దు
- రాష్ట్ర నాయకత్వం తీరు వల్లనే అంటూ ప్రచారం
- చేరికలు లేకపోవడంపైనా గుస్సా
- 80కిపైగా సీట్లల్లో అభ్యర్థులు కరువు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దక్షిణాదిలో కర్నాటకలో మాదిరిగా చాపకింద నీరులా తెలంగాణలో విస్తరించాలని చూస్తున్న బీజేపీకి ఇక్కడ పప్పులుడకట్లేదు. పట్టు దొరకట్లేదు. భారీ చేరికలంటూ ఆ పార్టీ చేసిన హడావిడి తోకపటాకులాగా తుస్సుమంది. కొద్దికాలం ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు ఏదో చేద్దామని చేసిన పర్యటనలు అక్కరకు రాకుండా పోయాయి. దీంతో ఇప్పుడు రాష్ట్రంలో పర్యటించేందుకే బీజేపీ అగ్రనేతలు మొహం చాటేస్తున్నారు. ఏదో ఒక సాకు చెప్పి తప్పించుకుంటున్నారు. పట్టులేని కాడ పాకులాడి పరువు తీసుకోవడం కంటే ఇక్కడకు రాకపోవడమే ఉత్తమం అనే ధోరణిలో నేతలు వ్యవహరిస్తున్నారు. వరుసగా ప్రధాని మోడీ, అమిత్‌షా, జేపీ నడ్డా పర్యటనల రద్దే దీనికి ఉదాహరణ. రెండు, మూడు నెలలుగా రాష్ట్రంలో ప్రధాని మోడీ పర్యటన ఉంటుందనీ, భారీ బహిరంగ సభ ఉంటుందని రాష్ట్ర నాయకులు చెబుతున్నప్పటికీ అది ఎంతకీ ఖరారు కావటంలేదు. సికింద్రాబాద్‌లో వందేభారత్ రైలును ప్రధాని మోడీ స్వయంగా హాజరై ప్రారంభించాల్సి ఉండగా..ఆయన రాలేదు. వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. నెలకోసారి రాష్ట్రంలో పర్యటిస్తానన్న అమిత్‌షా ఊసేలేదు. ఇటీవల పర్యటించినా ఆయన అధికారిక కార్యక్రమాలకే పరిమితం అయ్యారు. వాస్తవానికి ...5లో

15 ప్రశ్నాపత్రాలు లీక్ !

టీఎస్‌పీఎస్సీ సభ్యుల విచారణకు కసరత్తు

- బోర్డు సభ్యుల స్టేట్‌మెంట్ రికార్డు చేయనున్న అధికారులు
- విచారణకు హాజరు కావాలంటూ నోటీసులు!



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపుతున్న టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజ్ కేసులో కీలక పలుపు తిరిగింది. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకాల ప్రక్రియ ఎలా చేపట్టారన్న దానిపై సిట్ అధికారులు దృష్టి సారించారు. ఉద్యోగ నియామక పరీక్షల్లో సభ్యుల సలహాలు, సూచనలు ఎంతమేరకు ఉంటాయి, ప్రశ్నాపత్రాల భద్రత, కమిషన్ సభ్యులు తీసుకునే చర్యలపై ఆరా తీయనున్నారు. ఈ క్రమంలో టీఎస్‌పీఎస్సీ సెక్రెటరీతోపాటు బోర్డు సభ్యులను విచారించాలని ఓ నిర్ణయానికొచ్చిన సిట్ అధికారులు.. హాజరు కావాలంటూ టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్, సభ్యులు బండి లింగారెడ్డి, సైలు చింత, రమావత్ ధాన్‌సింగ్, కోట్ల అరుణ కుమారి, సుమిత్రా ఆనంద్, కె.రవీందర్‌రెడ్డి, ఏ.చంద్రశేఖర్‌రావుకు నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది. అలాగే, చైర్మెన్ బి.జనార్ధన్‌రెడ్డికి సైతం నోటీసులు జారీ చేసే అవకాశం ఉందని సమాచారం. సిట్ అధికారులు అన్ని కోణాల్లో విచారించి 8 మంది బోర్డు సభ్యుల స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయనున్నారు. ఇప్పటికే పేపర్ లీకేజీ కేసులో సిట్ దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. 16మందిపై కేసులు నమోదు చేసిన సిట్ మొత్తం 6 రకాల పరీక్షలకు చెందిన 15 ప్రశ్నాపత్రాలు లీక్ అయినట్టు గుర్తించింది. గ్రూప్1 పేపర్ ఐదుగురికి చేరగా, ఏఈ పేపర్ ఎక్కువ మందికి లీక్ అయిందని సిట్ గుర్తించిన విషయం తెలిసిందే. ప్రధాన ...5లో

తెలంగాణకు శత్రువు బీజేపీ

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కంటే అభివృద్ధిలో మనమే టాప్

- దీనిపై చర్చకు బీజేపీ నాయకులు సిద్ధమా..?: ఐటీ శాఖ మంత్రి కేటీఆర్
- గ్రామపంచాయతీలకు అవార్డుల ప్రదానం



నవతెలంగాణ-రాజేంద్రనగర్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని పూర్తిగా శత్రుదేశంగా చూస్తోందని రాష్ట్ర అభివృద్ధికి ఏ మాత్రం సహకరించకుండా అడ్డంకులు సృష్టిస్తున్నదని ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. శుక్రవారం రంగారెడ్డి ...5లో

విద్యుత్ సంస్థల్లో సమ్మె సైరన్

యాజమాన్యానికి నోటీసు ఇచ్చిన యూనియన్లు

- 17 ఉదయం 8 గంటల నుంచి సమ్మెలోకి...


(ఫైల్)

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ విద్యుత్ సంస్థల్లో సమ్మె సైరన్ మోగింది. వేతన సవరణతో పాటు ఇతర సమస్యల పరిష్కారంలో యాజమాన్యం, ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యానికి నిరసనగా తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీఎస్‌పీఈజేఏసీ) శుక్రవారం సమ్మె నోటీసు ఇచ్చింది. టీఎస్ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకరరావు కార్యాలయంతో పాటు విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కంలు) ఇన్‌వార్డ్ సెక్షన్‌లో జేఏసీ నేతలు సమ్మె నోటీసులు ఇచ్చారు. ఈనెల 17వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్టు ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. మొత్తం 24 విద్యుత్ ఉద్యోగ సంఘాల నేతృత్వంలోని జేఏసీ ఈ నోటీసులు ఇచ్చింది. 2022 ఏప్రిల్ 1వ తేదీ నుంచి విద్యుత్ ఉద్యోగులకు నూతన వేతన సవరణ (పీఆర్సీ) అమల్లోకి రావల్సి ఉందనీ, ఏడాది పూర్తయినా, ఇప్పటికీ దానిపై పూర్తి స్పష్టత ఇవ్వలేదని జేఏసీ చైర్మెన్ సాయిబాబు, కన్వీనర్ పీ రత్నాకరరావు, జాయింగ్ సెక్రటరీ వీ గోవర్ధన్ తెలిపారు. అలాగే ఆర్టిజన్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ కన్వర్షన్ చేయాలనీ, 1999 నుంచి 2002 వరకు ఉద్యోగాల్లో చేరిన వారికి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో పెన్షన్, జీపీఎఫ్ సౌకర్యాలు కల్పించాలనే పలు డిమాండ్లను యాజమాన్యం ఎదుట ఉంచినట్టు తెలిపారు. పలుదఫాలుగా ...5లో

రెండో దశ రైతాంగ పోరాటానికి రెడీ

కనీస మద్దతు ధరల గ్యారంటీ చట్టం తెచ్చేదాకా మోడీ సర్కారును వదలం

ముఖాముఖి

'మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో చేపట్టిన రైతాంగ పోరాటం మోడీ సర్కారు గుండెల్లో భయాన్ని పుట్టించింది. వాటిని అనివార్యంగా వెనక్కి తీసుకునేలా చేసింది. ఉత్పత్తి వ్యయంతో కలిసి 50 శాతం అదనంగా కలిపి మద్దతు ధర ఇచ్చేలా చట్టం చేస్తామని చెప్పి మాట తప్పింది. ఆ చట్టాన్ని చేసేదాకా మోడీ సర్కారును వదలబోం. రైతులకు రుణమాఫీ చేయాల్సిందే. కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా కూలీలు దొరికేలా చేసేందుకే కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నది. మోడీ సర్కారు ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేం దుకు సేవ్ ఇండియా నినాదంతో ముందుకెళ్తున్నాం. కేరళలోని వామపక్ష ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ముమ్మాటికీ దేశానికి ప్రత్యామ్నా యమే. అక్కడికెళ్లి చూస్తే వాస్తవాలేంటో తెలుస్తాయి. కేంద్ర ప్రభుత్వం ఎన్ని ఆటంకాలు సృష్టించినా ఏప్రిల్ ఐదో తేదీన ఢిల్లీలో తలపెట్టిన మజ్దూర్, కిసాన్ సంఘర్ష్ ర్యాలీని విజయ వంతం చేస్తాం. ఆ ర్యాలీలో కార్మి కులు, రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొ నాలని పిలుపునిస్తున్నాం' అని ఆలిండియా కిసాన్ సభ(ఏఐకేఎస్) అఖిల భారత ప్రధాన కార్యదర్శి విజ్జూ కృష్ణన్ చెప్పారు. ఏప్రిల్ ఐదో తేదీన ఢిల్లీలో తలపెట్టిన మజ్దూర్, కిసాన్ సంఘర్ష్ ర్యాలీ నేపథ్యంలో నవతెలంగాణ ప్రతినిధి అచ్చిన ప్రశాంత్‌కు ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే...

ఏప్రిల్ 5న మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీని విజయవంతం చేస్తాం

- కేరళ వామపక్ష ప్రభుత్వం దేశానికి ప్రత్యామ్నాయమే
- నవతెలంగాణతో ఏఐకేఎస్ అఖిల భారత ప్రధాన కార్యదర్శి విజ్జూ కృష్ణన్

మూడు వ్యవసాయక నల్లచట్టాలను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకున్నా పోరాటం కొనసాగుతున్నదని చెబుతున్నరు. దేని కోసం మీ పోరాటం?

ఢిల్లీ రైతాంగ పోరాటాన్ని అణచడానికి ఎన్ని చేయాలో అన్ని చేసినా రైతులు తలొగ్గకుండా పోరాటం చేశారు. చివరకు మోడీ సర్కారు క్షమాపణ చెప్పి మూడు వ్యవసాయ నల్ల చట్టాలను వెనక్కి తీసుకున్నది. 750 మందికిపైగా రైతులు చనిపోయారు. అది శత్రువుల హృద యంలో భయం పుట్టించిన పోరాటం. రైతుల విజయం. ఎమ్ఎస్. స్వామినాథన్ కమిటీ ...2లో



పెగాసస్ తర్వాత ఏంటి ?

కొత్త స్పైవేర్ కోసం మోడీ ప్రభుత్వ ప్రయత్నాలు !

- ఫైనాన్షియల్ టైమ్స్ కథనం



వివరాలు 2లో..

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

కార్పొరేట్ల గుత్తాధిపత్యాన్ని బద్దలు కొట్టాలి

హెచ్చు ధరలకు ఆ ఐదు గ్రూపులే కారణం

- ద్రవ్యోల్బణాన్ని ఎగదోస్తున్నాయి
- చిన్న సంస్థలను మింగేస్తున్నాయ్.. :

ఆర్‌బిఐ మాజీ డిప్యూటీ గవర్నర్ విమర్శలు



న్యూఢిల్లీ : భారత్‌లో అధిక ధరలకు ఐదు బడా కార్పొరేట్ కంపెనీలే కారణమని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ గవర్నర్ విరాల్ ఆచార్య స్పష్టం చేశారు. రిలయన్స్ గ్రూపు, అదానీ, టాటా, ఆదిత్యా బిర్లా, భారతి టెలికం గ్రూపు కంపెనీలు గుత్తాధిపత్యంతో ద్రవ్యోల్బణాన్ని ఎగదోస్తూ.. ప్రజల జేబులకు చిల్లు పెడుతున్నాయన్నారు. అవి భారత్ లో వివిధ ఉత్పత్తులు, సేవల ధరల్ని అమాంతం పెంచే శక్తిని కలిగి ఉన్నాయన్నారు. అంతర్జాతీ యంగా ముడి సరుకుల ధరలు తగ్గినప్పటికీ ఈ దిగ్గజ కార్పొరేట్ వర్గాలు ఇక్కడ ద్రవ్యోల్బణాన్ని ఎగదోస్తున్నాయన్నారు. బ్రూకింగ్ ఇన్స్టిట్యూట్ కాన్ఫరెన్స్‌లో ఆచార్య ఓ పత్రాన్ని ప్రవేశపెట్టారు. అందులో కార్పొరేట్ల ఆగడాలను ఎండగట్టారు. ధరల్ని నిర్ణయించే శక్తి కార్పొరేట్ దిగ్గజాలకు పెరుగుతూనే ఉన్నందున ద్రవ్యోల్బణం ప్రమాదాలు ఎక్కువ అవుతున్నాయన్నారు.

పోటీని పెంచడానికి, ధరల శక్తిని తగ్గించడానికి ఈ గుత్తేదారులను విచ్ఛిన్నం చేయాలన్నారు. 2017 జనవరి 23 నుంచి 2019 జులై 23 మధ్య ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్‌గా విరాల్ ఆచార్య పని చేశారు. ప్రస్తుతం ఆయన న్యూయార్క్ యూనివర్శిటీ స్టెర్న్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా పని చేస్తు న్నారు. ఆయన పత్రంలో పేర్కొన్న అంశాలు.. "అధిక ధరలకు కారణమవుతున్న ఈ వాణిజ్య గ్రూప్‌లను విచ్ఛిన్నం చేయాల్సి ఉంది. ఆ ఐదు దిగ్గజ గ్రూపులు స్థానిక చిన్న సంస్థల్ని దిగమింగి బడా గ్రూపులుగా ఎదిగాయి. రిటైల్ వ్యాపారం, సహజ వనరులు, టెలికమ్యూనికేషన్ల రంగాల్లో ధర ల్ని పెంచే శక్తి వీటికే ఉంది. కేంద్ర ప్రభుత్వ విధానా లకు ఆ కార్పొరేట్లు మద్దతుగా నిలుస్తున్నారు. ప్రభుత్వం భారీగా పెంచేసిన దిగుమతి సుంకాలతో విదేశీ పోటీ సంస్థల నుంచి దేశంలోని పెద్ద వాణిజ్య గ్రూప్‌లు రక్షణ పొందుతున్నాయి. జాతీయ వాణిజ్య చాంపియన్లను తయారు చేయడం నవ భారత్ పారిశ్రామిక విధానమని చెపుతున్నారు. కానీ ఈ విధానం పరోక్షంగా అధికస్థాయిలో ధరలు కొనసాగేలా చేస్తుంది. మార్కెట్లో పోటీ పెరగడానికి, ధరల్ని నిర్ణయించే శక్తిని తగ్గించడానికి కార్పొరేట్ దిగ్గజాలను విడగొట్టాలి." అని విరాల్ ఆచార్య అన్నారు. "కార్పొరేట్ దిగ్గజాలను విడగొట్టలేకపోతే వాటి వృద్ధి చక్రాల్లో ఇసుక పోయాలి. అప్పుడు వాటికి ఆర్థికంగా గిట్టుబాటు కాదు. ముడి పదార్థాల ధరలు బాగా తగ్గినప్పటికీ, భారత వినియోగదారు లకు ఆ ఫలాలు పూర్తిగా అందడం లేదు. లోహాలు, బొగ్గు, పెట్రోలియం, రిఫైనరీ ఉత్పత్తులు ఆ ఐదు దిగ్గజాల చేతుల్లోనే ఉన్నాయి. ఇవి కాకుండా రిటైల్ వ్యాపారం, టెలికం సర్వీసుల్లో కూడా వారే గుత్తాధి పత్యాన్ని కలిగి ఉన్నారు. 2010 తర్వాత విత్త యేతర రంగాలను పూర్తిగా చేజిక్కించుకోవడంపైనే ఆ ఐదు కార్పొరేట్ దిగ్గజాల దృష్టి పడింది. అనుకు న్నట్లుగానే 2015-16 నాటికి పలు రంగాలను తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. వ్యాపారాలను భారీగా పెంచుకున్నారు. దేశంలో టాప్ 5 కంపెనీ లుగా ఎదిగాయి. ఇతరుల చేతుల్లో ఉన్న కంపెనీ ల్లోని మెజారిటీ వాటాలను చేజిక్కించుకోవడం ప్రారంభించారు. దివాళా తీసిన కొన్ని పెద్ద సంస్థల ను స్వాధీనం చేసుకున్నాయి. ఇది వాటి మరింత వృద్ధికి దోహదం చేశాయి." అని విరాల్ విశ్లేషించారు.

"కరోనా తర్వాత ప్రపంచ వ్యాప్తంగా ధరలు తగ్గినప్పటికీ.. సరఫరా అడ్డంకులు తొలగిపోతు న్నందున అంతర్జాతీయంగా వస్తూత్పత్తుల ద్రవ్యోల్బ ణం తగ్గినప్పటికీ భారత్‌లో హెచ్చు స్థాయిలోనే కొనసాగుతున్నాయి. దేశంలో వడ్డీ భారాలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. కోవిడ్ తర్వాత వస్తువులకు డిమాండ్ బలహీనంగా ఉంది. అయినప్పటికీ దేశంలో హెచ్చు ధరలు కొనసాగుతున్నాయి. దేశం లో తయారీదారుల మార్జిన్లు ఎక్కువగా ఉండటం కూడా అధిక ధరలకు కారణం. పోటీని పెంచడా నికి, ధరల శక్తిని తగ్గించ డానికి ఈ గుత్తేదారులను విచ్ఛిన్నం చేయాలి. ఇందుకోసం పోటీతత్వాన్ని పెంచడంతో పాటుగా రెగ్యూలేటరీ నియంత్రణలు పెంచాలి." అని విరాల్ అన్నారు.

రెండో దశ రైతాంగ పోరాటానికి రెఢీ

(మొదటిపేజీ తరువాయి)

సిఫారసులను అమలు చేస్తామన్న మోడీ సర్కారు దాన్ని విస్మరించింది. రైతులకు ఉత్పత్తి వ్యయంతో కలిపి 50 శాతం అదనంగా ఇచ్చేలా కనీస మద్దతు ధరల గ్యారంటీ చట్టంగా పార్లమెంట్‌లో చేయాలని కోరాం. అది తెస్తే లీగల్‌గా మద్దతు ధర కోసం కొట్లాడే అవకాశం ఉంటుంది. అందుకోసమే మేం ప్రధాన డిమాండ్‌గా పెట్టాం. మోడీ సర్కారు చేస్తామని మాటిచ్చింది. కానీ, చేయటల్లేదు. మొక్కుబడిగా తన అనుకూల రైతు సంఘాలు, ప్రభుత్వ అనుకూల కార్పొరేట్ ప్రతినిధులతో కమిటీ వేశారు. సంయుక్త కిసాన్ మోర్చాగా దీన్ని ఖండించాం. అందులో మేం చేరలేదు. లఖింపూర్ ఖేరీలో ఐదు మంది రైతులు, ఒక జర్నలిస్టు మరణానికి కారణమైన కేంద్ర మంత్రి కొడుకుపై ఇంకా చర్యలు తీసుకోలేదు. ఆ కేంద్ర మంత్రిని క్యాబినెట్ నుంచి తప్పించాలనే డిమాండ్‌ను మోడీ సర్కారు విస్మరించింది. ఏడాదికిపైగా కాలంలో రైతులపై పెట్టిన కేసులను వెనక్కి తీసుకోవాలనే అంశాన్నీ పెడచెవిన పెట్టింది. విద్యుత్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని కోరాం. దాన్నీ పట్టించుకోవట్లేదు. ఈ నేపథ్యంలోనే రైతుల పక్షాన మా పోరాటం కొనసాగుతుంది. రెండో దశ ఉద్యమానికి సన్నద్ధం అవుతున్నాం.

నూతన విద్యుత్ చట్టం తీసుకొస్తే దేశానికే ప్రయోజనమని బీజేపీ నేతలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.. ఇది ఎంత వరకు వాస్తవం?

బీజేపీ ప్రచారం పూర్తి అవాస్తవం. వాస్తవానికి ఇది రైతు, ప్రజా వ్యతిరేక నిర్ణయం. మోటార్లకు మీటర్లు పెట్టాలని ఇప్పటికే చాలా రాష్ట్రాలపై మోడీ సర్కారు ఒత్తిడి పెంచుతున్నది. ఉచిత విద్యుత్, సబ్సిడీపై విద్యుత్ పొందుతున్న అన్నదాతలకు ఇది పూర్తిగా నష్టదాయకం. ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. ఇప్పటికే ఎరువులు, పురుగుల మందులు, విత్తనాల ధర నిర్ణయంపై ప్రభుత్వ నియంత్రణ పూర్తిగా పోయింది. ఎరువుల సబ్సిడీ ఎత్తివేత, విత్తనాలు, పురుగుమందుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇప్పుడు విద్యుత్ చట్టం అమలైతే అన్నదాతలకు గడ్డుకాలమే. ఇప్పటిదాకా పేదల ఇండ్లకు కరెంటుపై ఇస్తున్న సబ్సిడీ తొలగిపోతుంది. ప్రయివేటు సంస్థలు నిర్ణయించినట్టు చార్జీలు కట్టాలి. పీక్ అవర్స్‌లో కరెంటు వినియోగంపై అదనపు చార్జీలు మోపుతారంట. ఎంత దుర్మార్గం? దేశ ప్రజలకు నష్టం చేకూర్చే నిర్ణయం ప్రయోజనం ఎలా అవుతుంది? భారతీయ కిసాన్ సంఘ్(బీజేపీ అనుబంధ సంఘం) కూడా ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నది.

పంటలకు మద్దతు ధరల్లేక ఆయా రాష్ట్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఆ పోరాటాలను ఎలా ముందుకు తీసుకుపోతారు?

పత్తిపంటకు రూ.10 వేల కనీస మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ పెట్టాం. కానీ, తెలంగాణలో రూ.6,400-6,500కి మించి దక్కటం లేదు. ఇప్పుడు సీసీఐని నిర్వీర్యం చేసే ప్రయత్నానికి కేంద్రం పూనుకున్నది. పత్తికే కాదు రబ్బరు, సుగంధద్రవ్యాలు తదితర బోర్డులకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కోతలు పెడుతూ పోతున్నది. ఆయా బోర్డులను నిర్వీర్యం చేస్తున్నది. మహారాష్ట్రలో ఉల్లిగడ్డ, కాశ్మీర్‌లో యాపిల్, బీహార్, బెంగాల్ రాష్ట్రాల్లో ఆలుగడ్డ పంటలకు రేట్లు లేవు. అదే మార్కెట్‌లో నాలుగు రెట్లు అధిక ధరలున్నాయి. మహారాష్ట్రలో ఉల్లిగడ్డ రైతుల పోరాటం కొంతమేర విజయం సాధించింది. ప్రభుత్వం దిగొచ్చింది. అన్ని రాష్ట్రాల్లో పంటలకు కనీస మద్దతు ధర దక్కడం లేదు. ఎక్కడిక్కడ స్థానిక డిమాండ్లను తీసుకుని జాతీయ స్థాయిలో పోరాటాన్ని రూపొందించేలా ఏఐకేఎస్ ముందుకెళ్తున్నది. రైతులకు ఉత్పత్తి వ్యయం+50 శాతం మద్దతు ధర, రైతు రుణమాఫీ కోసం ఐక్యపోరాటాలు చేయబోతున్నాం.

మోడీ సర్కారుకు భిన్నంగా రైతుల మేలు కోసం కేరళలో వామపక్ష ప్రభుత్వం ఏం చేస్తున్నది?

కేంద్ర ప్రభుత్వం క్వింటా వరి ధాన్యానికి మద్దతు ధరగా రూ. 2,040 నిర్ణయించింది. కానీ, వాస్తవానికి ఆ ధర రైతులకు ఎక్కడా లభించడం లేదు. యూపీ, బీహార్, తదితర ఉత్తరాది రాష్ట్రాల్లో రూ.800 నుంచి రూ.1200 లోపే దక్కుతున్నది. కేంద్ర ప్రభుత్వం, మిగతా రాష్ట్రాలకంటే భిన్నంగా కేరళలో తమ ప్రభుత్వం క్వింటా వరి ధాన్యానికి రూ.2,870 చెల్లిస్తున్నది. 16 కూరగాయల పంటలకు కనీస ధరను ప్రభుత్వమే నిర్ణయించింది. వ్యాపారులు అంతకంటే తక్కువ కొనటానికి వీల్లేదు. రాష్ట్ర ప్రభుత్వమే కాదు గ్రామ పంచాయతీలు కూడా హెక్టార్ వరి పంటకు రూ.25 వేలు, హెక్టార్ అరటి పంటకు రూ.30 వేల సబ్సిడీ ఇస్తున్నాయి. రబ్బరు, కొబ్బరి రైతులకు కూడా ప్రత్యేక సబ్సిడీలిస్తున్నారు. రైతుల మేలు కోరే ప్రభుత్వమంటే ఇది. మోడీ సర్కారుకు, కేరళ ప్రభుత్వానికి ఉన్న తేడా ఇదే. మేం చెబుతున్న ప్రత్యామ్నాయం ఇదే.

ఏప్రిల్ ఐదో ఏదీన ఢిల్లీలో తలపెట్టిన మజ్దూర్, కిసాన్ ఐక్యతా ర్యాలీ ప్రధాన ఉద్దేశమేంటి? ఏర్పాట్లు ఎలా జరుగుతున్నాయి?

బీజేపీ అభివృద్ధి నినాదం ఒట్టిదేనని తేలిపోయింది. కార్పొరేట్ అనుకూల విధానాలతో దేశ ఆర్థిక సార్వభౌమత్వానికి ప్రమాదం పొంచి ఉంది. రాజ్యాంగంపై దాడి తీవ్రమైంది. ఆహార రంగం భవిష్యత్‌లో కీలకంగా మారబోతున్న నేపథ్యంలో మన వ్యవసాయాన్ని అంబానీ, అదానీలకు కట్టబెట్టే ప్రయత్నాలను మోడీ సర్కారు వేగతరం చేసింది. కార్మికులను కట్టుబానిసలుగా మార్చాలని చూస్తున్నది. ఈ చర్యలు దేశానికే ప్రమాదకరం. ఈ నేపథ్యంలోనే సేవ్ ఇండియా నినాదంతో ముందుకెళ్తున్నాం. రాజ్యాంగం, ఫెడరలిజం, సెక్యూలరిజాలను కాపాడుకు నేందుకు ఏఐకేఎస్‌గా ఉద్యమబాట పడుతున్నాం. మజ్దూర్, కిసాన్ ఐక్యతా ర్యాలీని విజయవంతం కాకుండా చూడాలని మోడీ సర్కారు విఫలయత్నాలు చేస్తున్నది. పార్లమెంట్ స్ట్రీట్‌లో ర్యాలీ చేపట్టడానికి అనుమతి నిరాకరించింది. ధర్మశాల కమ్యూనిటీ హాల్ బుక్ చేస్తే క్యాన్సల్ చేయించింది. రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు ఢిల్లీకి రాకుండా ఆపేందుకు రైళ్లలో జనరల్ బోగీలను తగ్గించింది. రాంలీలా మైదానంలో అనుమతిచ్చినా అనేక ఆంక్షలున్నాయి. అయినా, ముందుకెళ్తున్నాం. సంఘర్ష్ ర్యాలీ విజయవంతం కోసం మేధావులు, రచయితలు, ఆయా సంఘాల నేతలతో రిసెప్షన్ కమిటీ వేశాం. దానికి చైర్మెన్‌గా ప్రభాత్ పట్నాయక్ ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని ఆటంకాలు సృష్టించినా ఐదు లక్షల మంది రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులతో ర్యాలీని విజయవంతం చేస్తాం. మలిదశ రైతాంగ ఉద్యమానికి ఈ ర్యాలీ వేదిక కాబోతున్నది.

సింగరేణి ఆర్థిక నివేదికకు 'కాగ్' ఓకే

- హర్షం వ్యక్తం చేసిన బోర్డు
- పలు కీలక నిర్ణయాలకు డైరెక్టర్ల ఆమోదం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి కాలరీస్ సంస్థ 2021-22 ఆర్థిక సంవత్సరానికి సమర్పించిన ఆర్థిక నివేదికపై కంప్ట్రోలర్ ఆఫ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఎలాంటి అభ్యంతరాలు తెలుపకుండా (నిల్ కామెంట్స్) ఆమోదించడంపై ఆ సంస్థ పాలకమండలి (బోర్డు) హర్షం వ్యక్తం చేసింది. సింగరేణి ఆదాయ వ్యయాలపై ఆర్థిక విభాగం ఎంతో పకడ్బందీగా, సమర్థవంతంగా సంస్థ తరఫున సమర్పిస్తున్న ఆర్థిక నివేదికలకు గత నాలుగేండ్లుగా కాగ్ ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదు. ఆడిట్‌కు పూర్తి స్థాయి ఆమోదం తెలపడం పట్ల పాలకమండలి సంస్థ డైరెక్టర్ (ఫైనాన్స్) కి అభినందనలు తెలిపింది. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో శుక్రవారం సంస్థ సీఎమ్‌డీ ఎన్ శ్రీధర్ అధ్యక్షతన 566వ బోర్డు సమావేశం జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల డైరెక్టర్లు, సింగరేణి డైరెక్టర్లు దీనిలో పాల్గొన్నారు. పలు ప్రతిపాదనలపై చర్చించి తుది నిర్ణయాలు తీసుకున్నారు. సింగరేణి సంస్థ ఒడిస్సా రాష్ట్రంలో చేపట్టిన నైనీ బొగ్గు బ్లాక్ నుండి ఈ ఏడాది బొగ్గు ఉత్పత్తి అవుతున్న నేపథ్యంలో అక్కడికి సమీపంలోని హండపా రైల్వే సైడింగ్ వరకు బొగ్గు రవాణా చేసి, రైల్వే వ్యాగన్లలోనికి లోడ్ చేసే పనులకు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశం ఆమోదం తెలిపింది. ఈ వివరాలను సంస్థ సీఎమ్‌డీ ఎన్. శ్రీధర్ వెల్లడించారు. నైనీ బొగ్గు బ్లాక్ నుంచి ఏడాదికి సుమారు కోటి టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతుందనీ, బొగ్గు బ్లాక్ నుంచి సమీపంలోని రైల్వే స్టేషన్‌కు కొత్త రైలుమార్గం నిర్మాణం జరుగు తుందని తెలిపారు. అప్పటివరకు రోడ్డు మార్గం ద్వారా మరో రెండేండ్ల పాటు బొగ్గు రవాణా చేయ డం కోసం కాంట్రాక్టు ఏర్పాటుకు ప్రతిపాదించగా బోర్డు అనుమతించింది. వీటితోపాటు రామగుండం ఓసి-2 విస్తరణ ప్రాజెక్టు, కోయగూడెం రెండు ఓపెన్ కాస్టుకు సంబంధించి ఓవర్ బర్డెన్ తొలగింపు వంటి పనులకు ఆమోదం లభించింది. పలు ఏరియాల్లో భారీ యంత్రాలకు అవసరమైన స్పేర్ పార్ట్‌ల కొనుగోలుకు, 70 డంపర్లకు అవసరమైన సేవలకు కూడా పాలకమండలి ఆమోదం తెలిపింది. ఆర్జీ-1, ఆర్జీ-2, ఆర్జీ-3 ఏరియాల్లో కార్మికుల తాగునీటి సౌకర్యం కోసం రూ. 20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ బెడ్స్ నిర్మాణానికి అవసరమైన నిధులను బోర్డు మంజూరు చేసింది. దీంతో రోజుకు 35 మిలియన్ లీటర్ల గోదావరి నీటిని శుద్ధి చేసి పంపిణీ చేయనున్నారు. మైనింగ్ విద్యకు ప్రోత్సాహంలో భాగంగా ఉస్మానియా యూనివర్సిటీ లో మైనింగ్ ఇంజనీరింగ్ విభాగంలో కోర్సుల పునరుద్ధరణకు సింగరేణి సంస్థ రూ. 3 కోట్ల విరాళం అందించడానికి బోర్డు అంగీకరించింది. సమావేశంలో బోర్డు సభ్యులు రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్‌శర్మ, కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి సోలంకి, డైరెక్టర్ శ్రీమతి సంతోషి, డబ్ల్యుసిఎల్ సీఎండి మనోజ్ కుమార్, సింగరేణి సంస్థ నుండి డైరెక్టర్ ఫైనాన్స్ , ఎన్. బలరామ్, డైరెక్టర్లు డి. సత్యనారాయణరావు, ఎన్.వి.కె. శ్రీని వాస్, జి. వెంకటేశ్వర్ రెడ్డి, కంపెనీ సెక్రటరీ శ్రీమతి సునీతా దేవి, జనరల్ మేనేజర్ కోఆర్డినేషన్ ఎం. సురేష్ పాల్గొన్నారు.

పేపర్ లీకు డేటా ఎలా వచ్చింది

- మంత్రి కేటీఆర్‌కు రేవంత్ ప్రశ్న
- ఈడీ విచారణ జరపాలని డిమాండ్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మంత్రి కేటీఆర్‌కు పేపర్ లీకు డేటా ఎలా వచ్చిందో చెప్పాలని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ అంశంపై ఈడీ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. పేపర్ లీక్ కేసులో నిందితులకు, కేటీఆర్‌కు సంబంధమేంటని ప్రశ్నించారు. అసలు కేటీఆర్‌కు ముందుగానే ఎగ్జామ్ డేట్ ఎలా తెలిసిందన్నారు. అధికారులు ఇవ్వలేదంటున్నారు...మరి దొంగలు ఇచ్చారా? అని ఎద్దేవా చేశారు. ఆ దొంగలకు కేటీఆర్‌కు సంబంధమేంటని నిలదీశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో పేపర్ లీక్ కేసు వ్యవహారంపై రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ బృందం ఈడీ అధికారులకు ఫిర్యాదు చేసింది. అనంతరం రేవంత్ మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ కమిషన్ వెల్లడించుకుండా, పబ్లిక్ డోమైన్లో లేకుండా కటాఫ్ మార్కులు విషయం కేటీఆర్‌కు ఎలా తెలిసిందని ప్రశ్నించారు. 415 మంది జగిత్యాల నుంచి గ్రూప్ వన్ పరీక్ష రాశారంటూ కేటీఆర్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. పేపర్ లీకుపై విచారణను మంత్రి నియంత్రిస్తున్నారని ఆరోపించారు. మంత్రి చెప్పిందే సిట్ అధికారులు చేస్తున్నారని విమర్శించారు. దీనిపై విచారణ జరపాలని ఈడీని కోరామన్నారు. కేటీఆర్‌కు నిజంగా పరువుంటే టీఎస్పీఎస్సీ పేపర్ లీక్ కేసును సీబీఐకి అప్పగించాలి లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలంటూ లేఖ రాయాలని రేవంత్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యార్థులు చనిపోతున్నా కల్వకుంట్ల కుటుంబానికి చీమకుట్టినట్టుగా లేదని రేవంత్ అన్నారు. ఆధారాలు బయట పెడితే తిరిగి మాపైన్నే కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శంకర్ లక్ష్మి నుంచి నేరం మొదలైతే ఆమెను సాక్షిగా పెట్టడమేంటని ప్రశ్నించారు. పేపర్ లీక్ కేసులో ఏ1గా శంకర లక్ష్మిని, ఏ2గా చైర్మెన్, సెక్రటరీలను చేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇరుకున పడ్డప్పుడల్లా సిట్‌ను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఈ కేసులో కావల్సిన వారిని కాపాడి దిగువ స్థాయి ఉద్యోగులను బలి పశువులు చేస్తున్నారన్నారు. ఈ కేసులో కోట్ల రూపాయల లావాదేవీలు నగదు రూపంలో జరిగాయనీ, ఇందులో విదేశాల్లో ఉన్నవారితో హవాలా రూపంలో నగదు చేతులు మారాయని ఆరోపించారు. సిట్ కొద్దిమందిని విచారించి కొందరిని వదిలేస్తోందని తెలిపారు. అందరినీ విచారించాలని ఈడీకి ఫిర్యాదు చేశామన్నారు. ఆధారాలు బయటపెట్టిన ప్రతిపక్షాలకు సిట్ నోటీసులివ్వడమేంటని ప్రశ్నించారు. ఆందోళన చేస్తే అరెస్ట్ చేస్తున్నారని విమర్శించారు. పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

'గుట్ట'లో ఈ-చార్జింగ్ స్టేషన్ ప్రారంభం

పర్యావరణాన్ని పరిరక్షించండి:రెడ్కో చైర్మెన్ సతీష్‌రెడ్డి విజ్ఞప్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం యాదగిరి గుట్టలో ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంలో తొలి ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ కేంద్రం ప్రారంభమైంది. శుక్రవారం సురేంద్రపురి సమీపంలో ఏర్పాటు చేసిన చార్జింగ్ కేంద్రాన్ని రాష్ట్ర పునరుత్పాదక శక్తి అభివృద్ధి సంస్థ (రెడ్కో) చైర్మెన్ వై సతీష్‌రెడ్డి రిబ్బన్ కట్‌చేసి లాంఛనంగా ప్రారంభించారు. దేశంలో ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యం (పీపీపీ మోడల్)తో ఏర్పాటు చేసిన మొదటి చార్జింగ్ కేంద్రం ఇదే కావడం గమనార్హం. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ యాదాద్రికి ఎలక్ట్రిక్ వాహనాల్లో వచ్చే భక్తులు తమ వాహనాలు చార్జింగ్ చేసుకునేందుకు వీలుగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మార్కెట్ ధర కంటే తక్కువ యూనిట్ ధరతో వాహనాలు చార్జింగ్ చేసుకునే వీలు ఉంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాలకు మౌలిక వసతులు పెంచేందుకు రెడ్కో సంస్థ కృషి చేస్తున్నదని అన్నారు. హైదరాబాద్ సిటీతో పాటు జిల్లాల్లోనూ చార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో రెడ్కో సంస్థ సొంతంగా చార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నదనీ, కొద్ది రోజుల్లోనే ఇవి వాహనదారులకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రజలు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుపై మరింత ఆసక్తి చూపాలని కోరారు. కార్యక్రమంలో వడాయిగూడెం సర్పంచ్ పోశెట్టి, చార్జింగ్ కేంద్రం యజమాని జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

పెగాసస్ తర్వాత ఏంటి ?

న్యూఢిల్లీ : ప్రముఖులపై నిఘా కోసం పెగాసస్‌ను ఉపయోగించి అభాసుపాలైన మోడీ ప్రభుత్వం మరోసారి అటువంటి నిఘా సాధనాల కోసం ప్రయత్నాలు చేస్తోందని మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. పెగాసస్‌ను విక్రయించిన ఇజ్రాయిల్ ఎన్ఎస్ఓ గ్రూపు గురించి బయట బాగా తెలిసినందున ఈసారి అలా కాకుండా బయటి ప్రపంచానికి తక్కువగా తెలిసిన సంస్థల నుండి కొత్త స్పైవేర్‌ను కొనుగోలు చేయాలని భారత ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం రాబోయే కాలంలో 120 మిలియన్ల డాలర్లు (రూ.986 కోట్లు) మొత్తాన్ని ఖర్చు చేయాలని మోడీ ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఫైనాన్షియల్ టైమ్స్ ఒక కథనాన్ని ప్రచురించింది. దాదాపు డజను వరకు సంస్థలు ఇందుకు సంబంధించిన టెండర్ క్రమంలో పాల్గొంటాయని భావిస్తున్నారు. ఇవన్నీ పెగాసస్ విక్రయ సంస్థ ఎన్ఎస్ఎ గ్రూపునకు ప్రత్యర్థి కంపెనీలే అయి వుంటాయని భావిస్తున్నారు. పెగాసస్ స్పైవేర్‌ను ఉపయోగించారా లేదా అని ఫోరెన్సిక్ పరీక్షల ద్వారా తెలుసుకునే సామర్థ్యం మానవ హక్కుల గ్రూపులకు వుండడం, పైగా ఎవరు లక్ష్యంగా మారారో వారికి యాపిల్, వాట్సాప్‌ల నుండి హెచ్చరికలు వీటన్నింటితో మోడీ ప్రభుత్వ అధికారులు పిఆర్ సమస్య గురించి ఎక్కువగా ఆందోళన చెందుతున్నారు. అందువల్ల మరో కొత్త స్పైవేర్ కోసం చూడాలని మోడీ ప్రభుత్వం యోచిస్తోందని ఈ పరిణామాల గురించి తెలిసిన వ్యక్తులు చెప్పినట్లు ఆ వార్తా కథనం పేర్కొంది. రాబోయే కొద్దేళ్లలో కోటీ 60లక్షల డాలర్ల నుండి 12 కోట్ల డాలర్ల వరకు కాంట్రాక్టులు కుదిరే అవకాశం వుందని ఆ వర్గాలు తెలిపాయి. భారత రక్షణ, ఇంటెలిజెన్స్ అధికారులు పరిశీలిస్తున్న స్పైవేర్ సంస్థల్లో చాలావరకు ఇజ్రాయిల్ మిలటరీ ప్రత్యక్ష లేదా పరోక్ష ప్రమేయం వుందని ఫైనాన్షియల్ టైమ్స్ కథనం తెలిపింది.

అలా పేర్కొన్న కంపెనీల్లో గ్రీస్ ప్రధాన కేంద్రంగా పనిచేసే ఇంటెలెక్సా వుంది. ఇజ్రాయిల్ మిలటరీ ప్రముఖుల జోక్యంతో ప్రిడేటర్ స్పైవేర్‌ను ఈ సంస్థ సృష్టించింది. ఈజిప్ట్, సౌదీ అరేబియా, మడగాస్కర్, ఒమన్ వంటి దేశాలతో సహా మానవ హక్కుల సూచీలో అట్టడుగున గల దేశాల్లో ఇప్పటికే దీన్ని ఉపయోగించిన సుదీర్ఘ రికార్డు వుంది.

భారత్ జాబితాల్లో వున్న వాటిలో క్వాడ్రెమ్ అని మరో కంపెనీ వుంది. జర్నలిస్టు జమాల్ ఖషోగ్గి హత్య తర్వాత సౌదీ అరేబియాకు స్పైవేర్‌ను విక్రయించిన సంస్థ ఇది. కాగ్నైట్ అనే మరో సంస్థ కూడా మోడీ ప్రభుత్వ పరిశీలనలో వుంది.

ఆయా కంపెనీలతో రాజ్‌నాథ్ నేతృత్వంలోని రక్షణ మంత్రిత్వ శాఖ జరుపుతున్న చర్చలు అడ్వాన్స్ దశలో వున్నాయి. అయితే లాంఛనప్రాయమైన 'ప్రతిపాదనకు అభ్యర్ధనలు' పంపడానికి ఇంకా చాలా వారాలు పడుతుంది. వీటిల్లో ఏ కంపెనీ కూడా ఈ కథనంపై స్పందించడానికి కూడా ఇష్టపడలేదు. రక్షణ శాఖ కూడా వ్యాఖ్యానించడానికి అందుబాటులోకి రాలేదు.

క్రమబద్ధీకరణలో లేని స్పైవేర్ పరిశ్రమపై ఆంక్షలు విధించడానికి అమెరికా నేతృత్వంలో తాజా ప్రయత్నాలు జరిగాయి. నిఘా కోసం నిరంకుశ ప్రభుత్వాలు ఉపయోగించే వాణిజ్యపరమైన స్పైవేర్‌ను ప్రభుత్వం ఉపయోగించడాన్ని నిషేధిస్తూ మార్చి 27న అమెరికా ప్రభుత్వ ఉత్తర్వులు తీసుకువచ్చింది.

అమెరికా ఆతిథ్యమిచ్చిన ప్రజాస్వామ్య సదస్సులో గురువారం ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ, ఆస్ట్రేలియా, కెనడా, కోస్టారికా, డెన్మార్క్, ఫ్రాన్స్, న్యూజిలాండ్, నార్వే, స్వీడన్, స్విట్జర్లాండ్, బ్రిటన్, అమెరికా ప్రభుత్వాలన్నీ కలిసి స్పైవేర్ వినియోగానికి చట్టబద్ధమైన యంత్రాం గాలను రూపొందించి, అమలు చేయడానికి ఒక తాటి పైకి వచ్చాయని చెప్పారు. ఇటువంటి సాధ నాల దుర్వినియోగం చాలా ఎక్కువగా వుందని, మన జాతీయ భద్రతకు ముప్పు పెరిగిందని వైట్‌హౌస్ గురువారం సంయుక్త ప్రకటనలో పేర్కొంది. అయితే చాలా ప్రభుత్వాలకు తమ స్వంత ఇంటెలిజెన్స్ వర్గాలు రూపొందించిన నిఘా సాధనాలు వున్నాయని ఫైనాన్షియల్ టైమ్స్ పేర్కొంది.

బిజినెస్

వినూత్న ఐసిఐసిఐ ప్రు గోల్డ్ ప్లాన్ ఆవిష్కరణ

హైదరాబాద్: వినూత్నమైన పొదుపు పథకం ఐసిఐసిఐ ప్రు గోల్డ్ ప్లాన్‌ను ఆవిష్కరించినట్లు ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ తెలిపింది. ఈ పాలసీ జారీ చేసిన 30 రోజుల నుంచి సప్లిమెంటరీ ఆదాయం పొందవచ్చని పేర్కొంది. ప్రతి 5వ పాలసీ సంవత్సరంలో అదనపు గ్యారెంటీడ్ ఆదాయం అందించనున్నట్లు తెలిపింది. జీవితాంతం ఖచ్చితంగా ఆదాయం పొందే అవకాశంతో పాటుగా ఈ పథకంలోని జీవిత బీమా కవరేజీ కుటుంబానికి ఆర్థిక భద్రతను సైతం అందిస్తుందని తెలిపింది. వినియోగదారుల వైవిధ్యమైన అవసరాలను తీర్చేరీతిలో ఇమీడియట్ ఇన్‌కమ్, ఇమీడియట్ ఇన్‌కమ్ విత్ బూస్టర్, డిఫర్డ్ ఇన్‌కమ్ తదితర మూడు వేరియంట్లలో లభ్యమవుతుందని తెలిపింది.


బంజారాహిల్స్‌లో ఆదూరి గ్రూప్ నూతన శాఖ ఏర్పాటు

- ప్రారంభించిన మంత్రి తలసాని



హైదరాబాద్ : ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ ఆదూరి గ్రూప్ తన నూతన శాఖను బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసింది. గురువారం దీన్ని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి అందుబాటు ధరలో నివాస స్థలం కల్పించాలన్న ఆదూరి గ్రూప్ చైర్మన్ ఆదూరి రామాంజనేయులు ఆశయం నెరవేరాలని కోరుకుంటూ అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఆదూరి గ్రూప్ చైర్మన్ ఆదూరి రామాంజనేయులు, ఎండి ఆదూరి కామాక్షి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మధుసూధనా రెడ్డి, డైరెక్టర్స్ వీర భద్ర, అక్క బాలరాజ్, ఆర్యన్, రాధారపు లక్ష్మణ్ కే .దొర స్వామి, పోహార్ పండరినాథ్, సల్కాపురం అనిల్ కుమార్, పిచ్చయ్య బాబు, ప్రత్యూష, ఇతర సిబ్బంది పాల్గొన్నారు

బ్లూ క్రాస్‌కు ఎస్‌బిఐ లేడీస్ క్లబ్ సాయం



హైదరాబాద్ : పెంపుడు జంతువులను సంరక్షిస్తున్న బ్లూ క్రాస్ సంస్థకు ఎస్‌బిఐ లేడీస్ క్లబ్ సాయాన్ని అందించింది. రూ.24,000 విలువ చేసే చెక్కును బ్లూ క్రాస్‌కు ఎస్‌బిఐ లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్ నుపూర్ జింగ్రాన్ అందజేశారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ సుజాత మిశ్రా, సెక్రటరీ మాధవి ప్రసాద్ ఇతర సభ్యులు పాల్గొన్నారు. ఈ సాయం పట్ల బ్లూ క్రాస్ హైదరాబాద్ ఫౌండర్ అమల అక్కినేని ప్రశంసించారు.

ఏప్రిల్14న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

- పనులను పరిశీలించిన మంత్రుల బృందం



ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి రోజున విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందని మంత్రుల బృందం స్పష్టం చేసింది. హైదరాబాద్‌లో అత్యంత ఎత్తు లో నిర్మి స్తున్న 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని శుక్రవారం మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో మంత్రు లు హరీష్ రావు, కేటీఆర్, వేముల ప్రశాంత్ రెడ్డి, తల సాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలి, ఎర్రబెల్లి దయాకర్ రావు, మల్లా రెడ్డి, కార్పొరేషన్ చైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మేయర్ విజయ లక్ష్మి విగ్రహ పనులను పరిశీలించారు. మరో వారం రోజుల్లో నిర్మాణ పనులన్నీ పూర్తి చేసే లక్ష్యంతో సిబ్బంది పనిచేస్తున్నదని కొప్పుల ఈశ్వర్ వెల్లడించారు. విగ్రహంతోపాటు అక్కడ నిర్మిస్తున్న రాక్ గార్డెన్, ల్యాండ్ స్కేపింగ్, ప్లాంటేషన్, ప్రధాన ద్వారం, వాటర్ ఫౌంటెన్, సాండ్ స్టోన్ పనులు, జీఆర్సీ, గ్రానైట్ ఫ్లోరింగ్, లిఫ్ట్, విగ్రహం వద్దకు చేరుకొనే మెట్లదారి, ర్యాంప్, భవనం లోపల ఆడియో విజువల్ రూమ్, ఫాల్స్ సీలింగ్ తదితర పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, వర్క్ ఏజెన్సీతో సమావేశమై పనుల పురోగతిపై చర్చించారు. విగ్రహం నిర్మాణం కోసం 791 టన్నుల స్టీల్, 96 మెట్రిక్ టన్నుల ఇత్తడిని ఉపయోగిస్తున్నట్టు మంత్రి తెలిపారు.

ఫొటోగ్రఫీ ప్రతిబింబం ఆర్వీ కోటేశ్వరరావు

- నిబద్ధత, నైతికతే ఆయన నైజం
- ఉద్యోగ విరమణ సందర్భంగా సీనియర్ ఫొటోగ్రాఫర్ల ప్రశంసలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఫొటోగ్రఫీకి ప్రతిబింబంగా ఫొటో జర్నలిస్ట్ ఆర్వీ కోటేశ్వరరావు (ఆర్వీకే) నిలుస్తారని పలువురు సీనియర్ ప్రెస్ ఫొటోగ్రాఫర్లు కొనియాడారు. నిబద్ధత, నైతికతతో ఆయన విధులు నిర్వహించి, ఎందరికో ఆదర్శంగా నిలిచారని అన్నారు. ప్రజలకు, ప్రభుత్వాలకు ఏ వార్తలకు ఏ ఫొటోలు చూపించాలనే సృజనాత్మకత ఆర్వీకే సొంతమనీ, ప్రజాసమస్యలను ఛాయాచిత్రాలుగా తీసి, పరిష్కారమార్గాల అన్వేషిగా విధుల్ని కొనసాగించారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఆంగ్ల దిన పత్రిక చీఫ్ ఫొటోజర్నలిస్టు ఆర్వీ కోటేశ్వరరావు ఉద్యోగ విరమణ సభ జరిగింది. దీనికి సాక్షి దిన పత్రిక చీఫ్ ఫొటో జర్నలిస్టు కె. రవికాంత్‌రెడ్డి అధ్యక్షత వహించారు. తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్. హరి, ఫొటో జర్నలిస్టులు సి. కేశవులు, హెచ్. సతీష్, డి. రవీందర్‌రెడ్డి, పి. అనిల్‌కుమార్, ఎండి.ఇల్యాస్ తదితరులు ఆర్వీకేకు శాలువా కప్పి, పూలమాలలతో సత్కరించి, మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ ఫొటో జర్నలిస్ట్ సీ కేశవులు మాట్లాడుతూ ఫొటో జర్నలిస్టులు వార్తా మాధ్యమానికి సహకరిస్తారనీ, నిజాయితీ, నిష్పాక్షికంగా ఛాయాచిత్రాల కోసం ప్రయత్నిస్తారని చెప్పారు. హెచ్ సతీష్ మాట్లాడుతూ ఫొటో జర్నలిజం అనేది రిపోర్టింగ్‌కు మరో రూపమని స్పష్టంచేశారు. డి. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ పదాలు లేకుండా ఫొటోజర్నలిస్టు తీసిన ఒక ఫొటో మొత్తం కథనాన్ని తెలియజేసేలా ఉండాలనీ, ఆర్వీకే అలాంటి అనేక చిత్రాలను ప్రజల మనసుల్లో నింపే శారని ప్రసంసించారు. కె. రవి కాంత్ రెడ్డి మాట్లాడుతూ ఫొటోకు భాష అవసరం లేదన్నారు. సత్యాన్ని సత్యం గా చెప్పే శక్తి ఫొటో జర్నలిజానికే ఉందన్నారు. కె.ఎస్. హరి మాట్లాడు తూ ఆర్వీకే ఫొటో జర్నలిజానికి చేసిన సేవల్ని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్న లిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. కిషోర్‌సింగ్, పి. రాంమూర్తి, సం యుక్త కార్యదర్శి బిహెచ్‌ఎంకె గాంధీ, కోశాధికారి కె అనిల్ కుమార్, కార్య వర్గ సభ్యులు నక్క శ్రీనివాస్, పి. హరి కృష్ణ, ఎస్. శివకుమార్, హైదరా బాద్ జిల్లా అధ్యక్షులు హదయానంద్ పాల్గొన్నారు.

సిటీజనులకు మెట్రో షాక్!

రాయితీల్లో కోత విధింపు

- రద్దీ వేళల్లో డిస్కౌంట్ ఎత్తేస్తూ ఎల్అంట్‌డీ నిర్ణయం
- నాన్ పీక్ అవర్స్‌లో అమలు చేయనున్నట్టు ప్రకటన
- సూపర్ సేవర్ ఆఫర్ కొనసాగిస్తూనే.. రూ.100కి పెంపు
- నేటి నుంచి అమలులోకి వస్తుందని అధికారుల ప్రకటన



నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ సిటీజనులు హైదరాబాద్ మెట్రో రైల్ గట్టి షాకిచ్చింది. నేటి నుంచి మెట్రో ప్రయాణికులకు రాయితీల్లో కోత విధించింది. రద్దీ వేళల్లో డిస్కౌంట్ ఎత్తేస్తున్నట్టు ఎల్అండ్‌టీ మెట్రో హైదరాబాద్ అధికారులు శుక్రవారం ప్రకటించారు. ఆఫ్ పీక్ అవర్స్‌లో ఉదయం 6 గంటల నుంచి 8గంటల వరకు, రాత్రి 8గంటల నుంచి 12గంటల వరకు మాత్రమే కాంటాక్ట్ లెస్ స్మార్ట్‌కార్డుల (సీఎస్‌సీ)పై 10శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. నగరంలోని నాగోల్- రాయదుర్గం, ఎల్బీనగర్-మియాపూర్, జేబీఎస్-ఎంజీబీఎస్ మూడు కారిడార్లలోని 57 స్టేషన్ల గుండా ప్రతిరోజూ వెయ్యికిపైగా మెట్రో సర్వీసులు నడుస్తుండగా.. 4.4లక్షల మంది రాకపోకలు సాగిస్తున్నారు. ఉదయం 6 నుంచి రాత్రి 11.15గంటల వరకు నడుస్తున్న రైళ్లలో ఎప్పుడూ రద్దీ కని పిస్తూ ఉంటుంది. కాలేజీ విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు మొదలుకుని వివిధ తరగతుల ప్రజలు మెట్రో రైళ్లను విని యోగించుకుంటున్నారు. కరోనా నేపథ్యంలో మెట్రో రైళ్లలో ప్రయాణించే వారి సంఖ్య లక్షలోపే ఉండేది. కరోనా కట్ట డిలో భాగంగా మెట్రో అధికారులు తీసుకున్న భద్రత చర్య లతో క్రమంగా ప్రయాణికుల సంఖ్య మూడింతలు పెరి గింది.

సూపర్ సేవర్ ఆఫర్‌కు ఆదరణ..

ప్రస్తుతం మెట్రో ప్రయాణికులకు అందుబాటులో ఉన్న సూపర్ సేవర్ ఆఫర్-59కు విపరీతమైన ఆదరణ లభించింది. ఈ సూపర్ సేవర్ ఆఫర్ ద్వారా 1.3 మిలియన్స్ ప్రయాణికులు రాకపోకలు చేస్తున్నారు. ఈ ఆఫర్ మార్చి 31తో ముగిస్తుందని మెట్రో అధికారులు తెలిపారు. సూపర్ సేవర్ ఆఫర్-59 స్థానంలో 99 ఆఫర్‌ను తీసుకొస్తున్నట్టు ప్రకటించారు. ఇది నేటి నుంచి 2024 మార్చి 31 వరకు అమల్లో ఉంటుందని తెలిపారు. గతేడాది ఉగాది పండుగను పురస్కరించుకుని మెట్రో ప్రయాణికులకు ఈ ఆఫర్ అందుబాటులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. రూ.59 చెల్లించి రిచార్జీ చేయించుకుంటే ఏదైనా సెలవు రోజుల్లో (ఒక రోజు మాత్రమే) రైళ్లలో ఉచితంగా తిరిగే అవకాశాన్ని కల్పించారు. దీంతో చాలామంది వాటిని వినియోగించుకున్నారు. అయితే నష్టాలను అధిగమించడంలో భాగంగా ఎల్అండ్‌టీ మెట్రో హైదరాబాద్ అధికారులు తాజాగా రూ.59 కార్డును రూ.99కి పెంచారు. ఈ కార్డు నోటిఫైడ్ హాలీడేస్ (శని, ఆదివారాలతోపాటు ప్రభుత్వ సెలవు రోజుల్లో) అందుబాటులో ఉంటుందని ప్రకటించారు. కాగా, గతంలో రూ.59తో కార్డు తీసుకున్న వారు సూపర్ సేవర్ కింద మెట్రో స్టేషన్లలో రూ.99 వెచ్చించి రిచార్జీ చేసుకోవచ్చని, కొత్తగా ఈ కార్డును తీసుకునేవారు మాత్రం రూ.100 చెల్లించి పొందాల్సి ఉంటుందని సూచించారు.

ఇదిలా ఉండగా, రద్దీ వేళల్లో డిస్కౌంట్‌ను పూర్తిగా ఎత్తేశారు. గతంలో మెట్రో కార్డు, క్యూఆర్ కోడ్‌పై ప్రతి ప్రయాణ చార్జీలో 10శాతం డిస్కౌంట్ ఉండేది. అయితే, దీనిని రోజంతా కాకుండా ఉదయం 6 నుంచి 8గంటల వరకు.. రాత్రి 8 నుంచి 12గంటల వరకు మాత్రమే అందుబాటులో ఉంచుతున్నట్టు వెల్లడించారు. ఇదిలావుంటే.. ఆఫ్ పీక్ అవర్స్‌లో భాగంగా కాంటాక్ట్ లెస్ స్మార్ట్ కార్డ్స్(సీఎస్‌సీ)లపై 10 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. మరోవైపు మెట్రో రైళ్లలో ఇప్పటివరకు కల్పించిన రాయితీ విధానంలో కోత విధిస్తుండటంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగరంలో ట్రాఫిక్ రహిత, సురక్షితమైన, వేగవంతమైన ప్రయాణం అందిస్తున్న తరుణంలో రాయితీలు ఎత్తేయడంపై సామాన్య, మధ్య తరగతి ప్రజలు మెట్రో ప్రయాణాలకు దూరమయ్యే అవకాశం ఉందని, మెట్రో కార్డు, క్యూఆర్ కోడ్‌పై యథావిధిగా పది శాతం డిస్కౌంట్ కొనసాగించాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎమ్మెల్సీల ప్రమాణస్వీకారం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎమ్మెల్యే కోటాలో ఎన్నికైన నలుగురు ఎమ్మెల్సీలు ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే కోటాలో ఎన్నికైన చల్లా వెంకట్రామ్‌రెడ్డి, దేశపతి, నవీన్‌రావులతో శుక్రవారం శాసనమండలిలోని తన ఛాంబర్‌లో మండలి ఛైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గాల నుంచి ఎన్నికైన ఏవీఎన్‌రెడ్డితోనూ గుత్తా ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఎంఎస్ ప్రభాకర్, కౌశిక్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి నరసింహాచార్యులు, బీఆర్ఎస్ఎల్పీ కార్యదర్శి రమేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

టోల్ పన్ను పెంపును ఉపసంహరించుకోవాలి

- ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా కేంద్రం ఏకపక్ష నిర్ణయం: సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్
- ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో నగరంలో పలుచోట్ల ధర్నా



నవతెలంగాణ-సిటీబ్యూరో

కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి టోల్ పన్ను పెంచే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. రహదారులపై టోల్ రేట్ నిర్ణయించే ముందు నోటీసు ఇచ్చి ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని, అవేమీ చేయకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం చేయడం సరికాదన్నారు. శుక్రవారం ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వద్ద ఆటో కార్మికులు, శివం రోడ్, గోల్నాక డీసీఎం అడ్డా, షాపూర్ నగర్ డీసీఎం అడ్డా దగ్గర తదితర ప్రాంతాల్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పుప్పాల శ్రీకాంత్ మాట్లాడుతూ.. దేశంలోని అన్ని రకాల వాహనాలు టోల్ ప్లాజా ద్వారా వెళ్తూ టోల్ పన్ను చెల్లిస్తున్నాయని, వాస్తవంగా రహదారుల అభివృద్ధి సెస్ పేరుతో ప్రతి లీటర్ పెట్రోల్‌పై రూ.5, లీటర్ డీజిల్‌పై రూ.2, అదనంగా వసూలు చేస్తున్నారని. 2017-18 నుంచి మోడీ ప్రభుత్వం దీనిని రోడ్డు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సెస్‌గా మార్చేసి.. ఈ మొత్తాన్ని రోడ్డు నిర్మాణానికి, నిర్వహణకు ఉపయోగించాలని చెప్పిందన్నారు. కానీ పెట్రోలియం ప్రణాళిక, విశ్లేషణ శాఖ లెక్కల ప్రకారం(పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ) 2021-22 ఆర్థిక సంవత్సరంలో 3,084,9000 మెట్రిక్ టన్నుల పెట్రోలు, 7,66,59,000 మెట్రిక్ టన్నుల డీజిల్ అమ్ముడుపోయిందని, దానిపై ప్రభుత్వం రోడ్డు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సెస్ కింద రూ.2,70,000 కోట్లు వసూలు చేసిందన్నారు. ఇదే ఆర్థిక సంవత్సరంలోనే సుమారు వెయ్యి టోల్ ప్లాజాల ద్వారా 34,778 కోట్ల రూపాయలను వసూలు చేసిందని చెప్పారు. మౌలిక వసతుల అభివృద్ధి సెస్ వసూలు చేసిన తర్వాత టోల్ పన్ను వసూలు చేయడం ఏవిధంగా న్యాయమవుతుందని కేంద్రాన్ని ప్రశ్నించారు. వసూలు చేసిన పన్ను ఎంత, ఖర్చు ఎంత అనే విషయాల్లో పారదర్శకత లేదన్నారు. టోల్ చార్జీలను ప్రతియేటా పెంచుతూనే ఉందని, నేటి నుంచి టోల్ చార్జీలను పెంచుతున్నట్టు ఎన్‌హెచ్ఏఐ ప్రకటించిందని, ఈ పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.అజయ్‌బాబు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చేసిన టోల్ పెంపు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ.. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి రాష్ట్ర రోడ్లు, రవాణాశాఖ మంత్రి లేఖ రాయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. అదే సమయంలో రాష్ట్రంలో ఈ నిర్ణయం ద్వారా కార్మికులు, ప్రజలపై భారం పడకుండా తెలంగాణ సర్కారు ప్రత్యామ్నాయ మార్గాలను వెతకాలని సూచించారు. సీఐటీయూ సికింద్రాబాద్ జోన్ కన్వీనర్ టి.మహేందర్ మాట్లాడుతూ.. ట్రాన్స్‌పోర్ట్ కార్మికులపై కేంద్రం అనేక పేర్లతో భారాలు వేస్తూ.. వారి ఆదాయాలు కొల్లగొడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది చాలక టోల్ పన్ను పెంచడం దుర్మార్గమన్నారు. ట్రాన్స్‌పోర్టు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారిని ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ సికింద్రాబాద్ జోన్ నాయకులు కైలాష్, శేఖర్, శ్యామ్, వెంకటేష్, ఫిరోజ్, సీఐటీయూ అంబర్‌పేట జోన్ కన్వీనర్ జి.రాములు, నగర నాయకులు డీఎల్ మోహన్, ట్రాన్స్‌పోర్ట్ రంగం నాయకులు రఘు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంసెట్ పరీక్ష తేదీల్లో మార్పు

- మే 12 నుంచి 14 వరకు ఇంజినీరింగ్ విభాగం
- పాత తేదీల్లోనే అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం
- ఉన్నత విద్యామండలి వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎంసెట్ రాతపరీక్షల షెడ్యూల్‌లో మార్పులు చోటుచేసుకున్నాయి. మే ఏడు నుంచి 11వ తేదీ వరకు జరగాల్సిన ఎంసెట్ ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షల తేదీలు మారాయి. మే 12,13,14 తేదీల్లో ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మే ఏడో తేదీన నీట్ (యూజీ) పరీక్ష ఉంటుందంటూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ప్రకటించిందనీ, మే ఏడు, ఎనిమిది, తొమ్మిది తేదీల్లో టీఎస్‌పీఎస్సీ పరీక్షలను నిర్వహిస్తుండడంతో ఈ మార్పులు చేశామని వివరించారు. వాటిని దృష్టిలో ఉంచుకుని ఎంసెట్‌కు దరఖాస్తు చేసిన అభ్యర్థులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఇంజినీరింగ్ విభాగం షెడ్యూల్‌ను సవరించామని తెలిపారు. అయితే ఎంసెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం రాతపరీక్షల షెడ్యూల్‌లో ఎలాంటి మార్పు చేయలేదనీ, మే 10,11న పాత తేదీల్లోనే యథాతథంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎంసెట్ దరఖాస్తుల గడువు ఈనెల పదో తేదీ వరకు ఉన్నది. ఆలస్య రుసుముతో వచ్చేనెల రెండో తేదీ వరకు అవకాశమున్నది. ఈనెల 30వ తేదీ నుంచి ఎంసెట్‌కు దరఖాస్తు చేసిన అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఎంసెట్‌కు 1.92 లక్షల దరఖాస్తులు

శుక్రవారం నాటికి 1,80,240 దరఖాస్తులొచ్చాయని ఎంసెట్ కన్వీనర్ డీన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఇంజినీరింగ్ విభాగానికి 1,23,129 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 69,233 మంది, ఆ రెండింటికీ 223 మంది దరఖాస్తు చేశారని వివరించారు. ఆలస్య రుసుం లేకుండా వాటి సమర్పణకు తుది గడువు ఏప్రిల్ పదో తేదీ వరకు ఉన్నది.

వాక్యూమ్ ఎక్స్‌ట్రాక్టర్‌తో నార్మల్ డెలివరీ

- నాలుగు కిలోల మగ శిశువు జననం
- హైదరాబాద్ దవాఖానా ఘనత



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

ప్రభుత్వ దవాఖానాల్లో ఆపరేషన్లను తగ్గించేందుకుగాను నార్మల్ డెలివరీలపై వైద్య అధికారులు మొగ్గు చూపుతున్నారు. తాజాగా తెలంగాణ వైద్య విధాన పరిషత్ కింగ్ కోఠి జిల్లా దవాఖానాలో శుక్రవారం గర్భిణికి ఇబ్బంది లేకుండా ఆధునిక పరికరం వాక్యూమ్ ఎక్స్‌ట్రాక్టర్‌తో సాధారణ ప్రసవం చేశారు. నాలుగు కిలోల మగశిశువుకు తల్లి జన్మనిచ్చింది. ఇంత బరువు గల శిశువు ఈ ప్రక్రియ ద్వారా జన్మించడం ఆస్పత్రిలో తొలిసారి అని గైనిక్ హెచ్ఓడీ డాక్టర్ జలజ వీరోనిక తెలిపారు. చంపాపేట్ ప్రాంతానికి చెందిన ఓంప్రకాష్, మోనమ్మ దంపతులు. మోనమ్మకు మొదటి కాన్పు కోసం మార్చి 29న కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రిలో చేరింది. అన్ని పరీక్షలు చేసిన వైద్యులు శుక్రవారం ఉదయం మోనమ్మను డెలివరీ కోసం లేబర్ రూమ్‌కు తరలించారు. అయితే, నార్మల్ డెలివరీకి అవకాశం ఉన్నా.. ఆమె గర్భంలో నాలుగు కిలోల శిశువు ఉండటం.. తల సైజు పెద్దగా ఉండటంతో తల్లికి ఇబ్బంది కలుగుతుందని వైద్యులు గ్రహించారు. దీనిని దృష్టిలో ఉంచుకొని వైద్యులు వాక్యూమ్ ఎక్స్‌ట్రాక్టర్ అత్యాధునిక పరికరంతో సులువుగా ప్రసవం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సరిత వైద్య బృందాన్ని హెచ్ఓడీ డాక్టర్ జలజ, సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రనాథ్, ఆర్ఎంఓ డాక్టర్ సాధన అభినందించారు. అలాగే, వారికి ఓం ప్రకాష్ మోనమ్మ దంపతులు కూడా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆత్మరక్షణకోసమే 'కరాటే' చట్టాలున్నా దాడులు నిత్యకృత్యం

- ఎస్‌వీకే ట్రస్ట్ కార్యదర్శి ఎస్ వినయ్‌కుమార్
- వీరనారి ఐలమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కరాటే శిక్షణ ప్రారంభం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

చట్టాలెన్ని ఉన్నా ఆడపిల్లలపై లైంగిక దాడులు, హింసాత్మక ఘటనలు నిత్యకృత్యమవుతున్నాయని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కార్యదర్శి ఎస్ వినయ్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని వీరనారి ఐలమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కరాటే శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. ట్రస్టు ఛైర్మెన్ బుగ్గవీటి సరళ అధ్యక్షతన జరిగిన సభలో వినయ్ కుమార్ మాట్లాడుతూ లైంగిక దాడులు, వేధింపులను అరికట్టేందుకు ఎన్ని చట్టాలు చేసినా, షీ టీములు ఏర్పాటు చేసినా.. అలాంటి ఘటనలు తగ్గటం లేదని చెప్పారు. దీనికి మనువాద పురుషాధిక్యతా భావజాలమే కారణమని తెలిపారు. మరో పక్క పెట్టుబడి దారి సమాజం ఆడపిల్లని అంగడి సరుకుగా చూపించడం పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే వీరనారి ఐలమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆడపిల్లల ఆత్మరక్షణకోసం "కరాటే" లాంటి "మార్షల్ ఆర్ట్స్" నిర్వహిస్తున్నామని తెలిపారు. మల్లు స్వరాజ్యం, మోటూరి ఉదయం వర్ధంతి సందర్భంగా దీన్ని ప్రారంభించటం సముచితంగా ఉందన్నారు. ఇలాంటి కేంద్రాలను వీలైనంత ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి. జ్యోతి మాట్లాడుతూ మోటూరి ఉదయం, మల్లు స్వరాజ్యం వర్ధంతి సందర్భంగా 'కరాటే శిక్షణా శిబిరం' ప్రారంభించటమంటే వారి ఆశయాలను ముందుకు తీసుకుపోవటమేనని చెప్పారు. మహిళలు ధైర్యంగా బ్రతకాలనీ, అన్ని రంగాల్లో ముందుండాలంటూ వారు కోరేవారని గుర్తుచేశారు. కుటుంబాన్ని కాపాడుకున్నట్టుగానే సమాజాన్ని కూడా కాపాడాల్సిన బాధ్యత మహిళలపైనే ఉందని భావించేవారని పేర్కొన్నారు. ట్రస్టు కార్యదర్శి బి. హైమవతి మాట్లాడుతూ తమ ట్రస్టు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్లు నడుస్తున్నాయని చెప్పారు. బాధిత మహిళలకి ఆశ్రయం ఇవ్వటం కోసమే ట్రస్టు భవన్‌లో 'షార్ట్ స్టే హోమ్‌'ను ప్రారంభించినట్టు తెలిపారు. ప్రస్తుతం ఆడపిల్లలు తమని తాము కాపాడుకోవటానికి "ఉచిత కరాటే శిబిరాన్ని ప్రారంభిస్తున్నామని చెప్పారు. మహిళలు పని చేస్తే తప్ప కుటుంబాలు గడవని నేపథ్యంలో ఆడపిల్లల విద్యపై తల్లుల కేంద్రీకరణ తగ్గుతుందన్నారు. భవిష్యత్తులో వారి కోసం ట్యూషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో ట్రస్టు కోశాధికారి కె.ఎన్ ఆశాలత, ఐద్వా అధ్యక్షులు ఆర్. అరుణ జ్యోతి, ట్రస్టు సభ్యులు డి.ఇందిర, విశాలక్ష్మి, ఉదయలక్ష్మి, శశికళ, లక్ష్మమ్మ, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

అమ్మ..నాన్న క్షమించండి

- సూసైడ్ నోట్ రాసి మెడికో స్టూడెంట్ ఆత్మహత్య
- నిజామాబాద్ మెడికల్ కాలేజీలో ఘటన





నవతెలంగాణ-కంఠేశ్వర్

'అమ్మనాన్న.. అన్నయ్య క్షమించండి. ఫార్మా పేపర్ 1కు ముందే ఇలా చేద్దామనుకున్నా కానీ తోటి మిత్రులు, మేడం డిస్టర్బ్ అవుతారని చేసుకోలే. సాయి నువ్వు యూఎస్ నుంచి వచ్చి ఇక్కడే ఉండు' అంటూ మెసేజ్ పెట్టి మెడికల్ విద్యార్థి సూసైడ్ చేసుకున్నాడు. ఈ ఘటన నిజామాబాద్ మెడికల్ కాలేజీలో శుక్రవారం తెల్లవారు జామున జరిగింది. పోలీసులు, విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లాకు చెందిన ఎం. సనత్ నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఎంబీబీఎస్ థర్డ్ ఇయర్ ఫైనల్ పరీక్షలు వారం కిందట పూర్తి కాగా శనివారం నుంచి ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారు జామున 3.11 గంటల సమయంలో కుటుంబీకులకు ఫోన్ నుంచి మెసేజ్ పెట్టి రూమ్‌లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు అక్కడికి చేరుకొని విగతజీవిగా ఉన్న కొడుకును చూసి బోరున విలపించారు. తోటి మెడికో మృతి పట్ల ఇతర స్టూడెంట్స్ కన్నీరుమున్నీరయ్యారు. జనవరి నెలలో ఆదిలాబాద్ జిల్లా జన్నారం మండలానికి చెందిన ఫైనల్ ఇయర్ విద్యార్థి దాసరి హర్ష సూసైడ్ చేసుకున్నాడు. ఈ ఘటన నుంచి విద్యార్థులు తేరుకోకముందే తాజాగా సనత్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఒకటో టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఒత్తిడికి గురై ఉండొచ్చు - కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర

సనత్ ఆత్మహత్యకు ఒత్తిడే కారణంగా భావిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర తెలిపారు. మెడికల్ కాలేజీ వద్ద మీడియాతో మాట్లాడారు. సనత్ వారం కిందతే థియరీ పరీక్షలు రాశాడని, నేటి నుంచి ప్రాక్టికల్స్ పరీక్షలు ఉన్నాయని, పరీక్షల ఒత్తిళ్ల కారణంగానే ఆత్మహత్యకు పాల్పడినట్టుగా భావిస్తున్నట్టు తెలిపారు.

వైద్యశాఖ మంత్రితో కమిటీ వేయించాలి - ఎస్ఎఫ్ఐ

మెడికల్ విద్యార్థి సనత్ ఆత్మహత్య విచారకరమని, వైద్యశాఖ మంత్రి స్పందించి కమిటీ వేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేశ్ డిమాండ్ చేశారు. మెడలో స్టెతస్కోప్ వేసుకోవాల్సిన వైద్యవిద్యార్థులు ఉరితాళ్లు బిగించుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మెడికల్ కళాశాల ఆత్మహత్యకు నిలయంగా మారుతోందని, వాటి నివారణకు విద్యార్థులకు ఎప్పటికప్పుడు కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు.

సంపాదకీయం

నిరంకుశత్వంపై ప్రజాగ్రహం

ఎంతటి నిరంకుశ నేతలైనా ప్రజాగ్రహానికి తలొంచాల్సిందే. యూదు దురహంకార నేత నెతన్యాహు విషయంలో ఇది అక్షర సత్యం. న్యాయ సంస్కరణల పేరుతో న్యాయ వ్యవస్థను కుళ్లబొడిచి, దానిని నిర్వీర్యం చేయాలని చూసిన ఈ మితవాద నేతకు ఇజ్రాయిలీ ప్రజలు దిమ్మతిరిగే షాక్ ఇచ్చారు. మూడు నెలలపాటు ఉవ్వెత్తున

> ఇజ్రాయిల్‌లో న్యాయవ్యవస్థపై జరిగిన దాడి వంటిదే మన దేశంలోనూ ఇక్కడి మితవాద బీజేపీ ప్రభుత్వం చేస్తోంది. కొలీజియం వ్యవస్థకు వ్యతిరేకంగా ఉపరాష్ట్రపతి, న్యాయశాఖ మంత్రి వంటి ఉన్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు ఇటీవల చేస్తున్న ప్రకటనలు దీనిలో భాగమే. న్యాయమూర్తుల నియామకాన్ని ప్రభుత్వమే శాసించాలని నెతన్యాహు వాదించినట్టుగానే ఇక్కడ మోడీ ప్రభుత్వం కూడా వాదిస్తున్నది. ఇందుకోసం సెర్చి కమిటీ పేరుతో ఒక దానిని తెరపైకి తేవాలని చూసింది.

సాగిన నిరసనలతో అప్రతిష్టాకరమైన ఈ న్యాయ సంస్కరణల బిల్లును తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్టు పచ్చి నిరంకుశవాది నెతన్యాహు ప్రకటించక తప్పలేదు. అతి పెద్ద కార్మికసంఘం 'హిస్తాద్రుత్' సమ్మెలు, ఆందోళనలకు పిలుపునివ్వడంతో వైద్యం నుంచి విమానాల వరకూ సమస్త రంగాలు స్తంభించిపోయాయి. రాయబారులు, దౌత్య ప్రతినిధులు సహా సిబ్బంది అంతా సమ్మెలో పాల్గొనడంతో గత్యంతరంలేని స్థితిలో నెతన్యాహు ఈ నిర్ణయం తీసుకున్నాడు. ఇజ్రాయిల్ ప్రభుత్వం గత కొన్ని దశాబ్దాలుగా అనుసరిస్తున్న దురాక్రమణ, జాతి ప్రక్షాళన వంటి చర్యలు ఇజ్రాయిలీ సెటిలర్లు, సైనికులు, రాజకీయ నాయకులకు వరంగాను, అక్కడ నివసిస్తున్న పాలస్తీనీయుల పాలిట శాపంగాను మారింది. దీనికితోడు అవినీతి ఊబిలో పీకల్లోతులో కూరుకుపోయిన నెతన్యాహు న్యాయవ్యవస్థ స్వతంత్రతనే హరించేలా వివాదాస్పద న్యాయ సంస్కరణల బిల్లును తీసుకొచ్చాడు. దీంతో ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. 'ఇజ్రాయిల్‌లో ప్రజా స్వామ్యాన్ని పరిరక్షించాలి' అన్న పేరుతో చేపట్టిన నిరసనోద్యమానికి యూనివర్సిటీ విద్యార్థులు, యువత, ప్రగతిశీల, ప్రజాతంత్ర వాదుల నుంచి విశేషంగా మద్దతు లభించింది. దీంతో ఇజ్రాయిల్ గత కొన్ని వారాలుగా నిరసనలతో అట్టుడుకుతోంది. తాను ఏం చేసినా న్యాయ వ్యవస్థ ప్రశ్నించకూడదనే ధోరణి నరనరాన జీర్ణించుకున్న నెతన్యాహుకు తన ప్రజల నుంచే ఊహించని రీతిలో తిరుగుబాటు వచ్చేసరికి కంగుతిన్నాడు.



యూదు దుర్హంకార ప్రభుత్వ దమనకాండకు ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి ఇప్పటివరకు 87మంది పాలస్తీనీయులు బలయ్యారు. గడచిన సంవత్సరం ఇజ్రాయిలీ ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌పై జరిపిన హేయమైన దాడిలో 146మంది పాలస్తీనీయులు చనిపోయారు. ఇజ్రాయిల్ 1948లో ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు పాలస్తీనా భూభాగంలో 900కి పైగా కమ్యూనిటీలను (గ్రామాలు, పట్టణాలు) యూదులు ఏర్పాటు చేసుకున్నారు. అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ ప్రభుత్వ నిరంకుశ పోకడలు పెరిగిపెరిగి, చివరికి ప్రజాస్వామ్యానికే ప్రమాదంగా పరిణమించాయి. 75ఏండ్లుగా అనుసరిస్తూ వస్తున్న విధానాలతో ఇప్పటికే పెళుసుగా మారిన ప్రజాస్వామ్యాన్ని నెతన్యాహు ప్రభుత్వం మరింత నిర్వీర్యం చేయడానికి పూనుకోవడంతో ఇజ్రాయిలీ ప్రజలు మేల్కొన్నారు. నెతన్యాహు ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక ఎజెండాను సాగనిచ్చేది లేదంటూ పెద్దయెత్తున వీధుల్లోకి వచ్చారు. దేశంలో పౌరులందరికీ సమాన హక్కులు ఉండాలని, ఇజ్రాయిల్ యూదు దురహంకార రాజ్యంగా కాకుండా ప్రజాస్వామ్యయుత ఆధునిక రాజ్యంగా ఉండాలని ఎక్కువ మంది కోరుకుంటున్నారు. ఇదే వారినందరినీ ఏకంచేసి ప్రజాస్వామ్యం కోసం ఉద్యమించేలా ప్రేరేపించింది.

ఇజ్రాయిల్‌లో న్యాయవ్యవస్థపై జరిగిన దాడి వంటిదే మన దేశంలోనూ ఇక్కడి మితవాద బీజేపీ ప్రభుత్వం చేస్తోంది. కొలీజియం వ్యవస్థకు వ్యతిరేకంగా ఉపరాష్ట్రపతి, న్యాయశాఖ మంత్రి వంటి ఉన్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు ఇటీవల చేస్తున్న ప్రకటనలు దీనిలో భాగమే. న్యాయమూర్తుల నియామకాన్ని ప్రభుత్వమే శాసించాలని నెతన్యాహు వాదించినట్టుగానే ఇక్కడ మోడీ ప్రభుత్వం కూడా వాదిస్తున్నది. ఇందుకోసం సెర్చి కమిటీ పేరుతో ఒక దానిని తెరపైకి తేవాలని చూసింది. సెర్చి కమిటీలో ప్రభుత్వ ప్రతినిధులే ఎక్కువగా ఉంటారు. కాబట్టి ఆ కమిటీ ద్వారా న్యాయవ్యవస్థలో తన మనుషులను నియమించుకోవాలని, తద్వారా న్యాయ వ్యవస్థను తన గుప్పెట్లో పెట్టుకోవచ్చని పన్నాగం పన్నింది. ఈ ప్రమాదాన్ని పసిగట్టిన సుప్రీం కోర్టు ఆదిలోనే దీనికి బ్రేక్ వేసింది. అయినా, న్యాయవ్యవస్థ స్వతంత్రతను హరించేందుకు నిరంతరం కుట్రలు పన్నుతున్న బీజేపీ, ఆరెస్సెస్‌లకు ఇజ్రాయిల్ పరిణామాలు ఒక హెచ్చరిక కావాలి.

భయం గుప్పిట్లో త్రిపుర ప్రజలు

సుహ్రిద్ శంకర్ ఛటోపాధ్యాయ

భారతీయ జనతాపార్టీ త్రిపుర రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించింది. మార్చి 8వ తేదీన మాణిక్ షా ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశాడు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జే.పీ.నడ్డా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీ, హెూం మంత్రి అమిత్ షాలు హాజరయ్యారు. అదే రోజు నిరుపేద రిక్షా డ్రైవరైన ఖొవాయ్‌కి చెందిన హరిమోహన్ ఘోష్ తన ఇంటికి వచ్చిన సమయానికి తన ఆవుల పాక ధ్వంసమై ఉండడం, తన రెండు ఆవులు మంటల్లో చనిపోవడం, తన రిక్షా కూడా ధ్వంసమై ఉండడం గమనించాడు. ఘోష్ భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్) కార్యకర్తగా గుర్తించబడిన తరువాత ఆయన ఇంటిని వదిలి వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాను ఇంట్లో లేని సమయంలో మార్చి 8వ తేదీ తెల్లవారుజామున కాషాయ పార్టీకి చెందిన అల్లరిమూక తన ఆవుల పాకను తగులబెట్టింది. సీపీఐ(ఎం) పార్టీ నాయకత్వంలోని వామపక్ష కూటమి, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల సమాచారం ప్రకారం అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ, ఇన్డైజీనస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర(ఐపీఎఫ్టీ)కూటమి రెండవసారి అధికారాన్ని చేపడుతుందనే ప్రకటన వచ్చిన మార్చి 2వ తేదీ నుండి ప్రతిపక్ష పార్టీల మద్దతుదారులు, సభ్యులపై వెయ్యికి పైగా దాడులు జరిగాయి. ఎన్నికల అనంతరం జరిగిన హింస ఏ స్థాయిలో జరిగిందంటే, ఆఖరికి నిజనిర్థారణ కమిటీ సభ్యులైన ప్రతిపక్ష పార్టీల ఎంపీలు, ఎంఎల్ఏ లను కూడా విడిచి పెట్టలేదు.

ఒకే ఒక ఎజెండా

ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత మార్చి 2వ తేదీ నుండి త్రిపుర రాష్ట్ర ప్రజలు రాజకీయ హింసతో మానసికంగా, శారీరకంగా ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారు. ఎన్నికల్లో కలిసి పోటీచేసిన వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ పార్టీకి చెందిన మద్దతుదారులు, కార్యకర్తలు బీజేపీ చేతిలో నిత్యం దాడులకు గురవుతున్నారు. వారి జీవనాధారంగా ఉన్న వారి ఇండ్లు, దుకాణాలు, ఇతర ఆస్తులన్నింటినీ ధ్వంసం చేశారు. దాదాపు వెయ్యిమందికి పైగా ఇళ్ళను వదిలిపెట్టి వెళ్ళిపోయారు. వామపక్ష పార్టీలకు లేదా కాంగ్రెస్ పార్టీకి మద్దతుదారులుగా ఉన్నారు కాబట్టి వారు ఇంటికి తిరిగి రావాలంటే డబ్బు చెల్లించాలని పాలక బీజేపీ మద్దతుదార్లు ఒత్తిడి చేశారు. స్థానిక బీజేపీ నాయకునికి 50 వేల రూపాయలు చెల్లించిన తరువాత మాత్రమే తాను ఇంటికి రాగలిగానని సెపహిజాలా జిల్లాకు చెందిన ఒక సీపీఐ(ఎం) కార్యకర్త ఫ్రంట్ లైన్‌తో చెప్పాడు. వారికి డబ్బు చెల్లించడంతో పాటు ఇకముందు ఎలాంటి రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనని వారికి ప్రమాణం చేయాల్సి వచ్చిందని ఆ కార్యకర్త చెప్పాడు.

"ప్రతిపక్షాన్ని, ప్రజాస్వామిక కార్యకలాపాలు లేకుండా నాశనం చేయడమే భారతీయ జనతా పార్టీ ఏకైక ఎజెండా. బీజేపీ అధికారంలోకి వచ్చిన 2018 నుండి ఐదు సంవత్సరాలుగా తన రాజకీయ ప్రత్యర్థుల్లో ఒక భయానకమైన వాతావరణాన్ని సృష్టిస్తూ వచ్చింది. ఎలక్షన్ కమిషన్ పుణ్యమా అని కొన్ని నెలలుగా ఈ భయానక వాతావరణం తాత్కాలికంగా లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో బీజేపీకి వ్యతిరేకంగా ఓటువేసి ఓడించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున కదిలి వచ్చారు. దాని ఫలితంగానే బీజేపీ ఓట్ల భాగస్వామ్యం భారీగా తగ్గింది. బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలిపోయిన కారణంగానే బీజేపీ విజయం సాధించింది. మళ్ళీ అధికారం చేపట్టిన తరువాత శాంతి భద్రతల్ని అదుపులో ఉంచే అవకాశం వారి చేతుల్లోకి వచ్చింది. వారికి ఓట్లు తగ్గిన ప్రాంతాల్లో కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. పార్లమెంటరీ ప్రతినిధుల సందర్శన సందర్భంగా ఈ విషయాలు బహిర్గతమయ్యాయని" త్రిపుర రాష్ట్ర సీపీఐ(ఎం) పార్టీ కార్యదర్శి జితేంద్ర చౌదరి ఫ్రంట్ లైన్‌తో అన్నారు.

చౌదరి చెప్పిన దాని ప్రకారం, చెడు ప్రచారం, ప్రజల్లో పెరుగుతున్న ఆగ్రహం ఫలితంగా బీజేపీ నుంచి దాడులు చేస్తున్నవారు, దాడులు చేస్తున్నట్లు కనిపించకుండా ఉండే విధంగా, వారి అసలు ఎజెండాను చాలా నేర్పుగా అమలుచేసే విధంగా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇప్పుడు సీపీఐ(ఎం), కాంగ్రెస్ పార్టీకి చెందిన మద్దతుదార్లు, కార్యకర్తలు వెళ్ళి తమ పనులు తాము చేసుకొని, తమ జీవనోపాధి ద్వారా సంపాదించుకోకుండా, తమ దుకాణాలను తెరిచి, వ్యాపారం చేసుకోకుండా బీజేపీకి చెందిన దౌర్జన్యకారులు అడ్డుకుంటున్నారు. వారు ప్రతిపక్షాలకు చెందిన వారిని భౌతికంగా హత్యలు చేయకపోవచ్చు, కానీ వారిని ఆర్థికంగా నాశనం చేస్తున్నారు. మార్చి 16వ తేదీ నాటికి, వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికి వ్యతిరేకంగా 2000పైగా కేసులు నమోదయ్యాయి. పోలీసులు ఏమీ చేయకుండా కేవలం నిలబడి చూస్తున్నారు. బీజేపీవారు చేస్తున్న దాడులను ప్రతిఘటిస్తున్న వారిని మాత్రం అరెస్ట్ చేస్తున్నారని జితేంద్ర చౌదరి చెప్పారు.

అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకత ఉన్నప్పటికీ, బీజేపీ విజయం సాధించే విధంగా పథకాలు రచించింది. ప్రతిపక్ష పార్టీల గొంతుకలను అణిచివేయడం ద్వారా ప్రజాస్వామిక క్రమాన్ని బలహీనపరచడానికి పాలకపార్టీ అనుసరించిన బెదిరింపు ధోరణులు, హింసాత్మక చర్యలే ప్రభుత్వం పట్ల వ్యతిరేకతకు గల కారణాల్లో ప్రధానమైనది. ఎన్నికల్లో బీజేపీ, ఐపీఎఫ్టీ కూటమి 2018లో సాధించిన (44సీట్లు) విజయానికి పూర్తి భిన్నంగా ఇప్పుడు మొత్తం 60సీట్లకు కేవలం 33సీట్లలో మాత్రమే విజయం సాధించింది. త్రిముఖ పోటీ జరిగిన ఫలితంగానే తమకు అనుకూలమైన ఫలితాలొచ్చాయని ఆఖరికి బీజేపీ నాయకులే ఒప్పుకున్నారు. టీఐపీఆర్ఏ కొన్ని గిరిజనేతర నియోజకవర్గాల్లో ఓట్లు చీల్చి ఉండకపోయి ఉంటే ఐదు నుండి ఆరు స్థానాలను మేం లెఫ్ట్-కాంగ్రెస్ కూటమి చేతిలో కోల్పోయి ఉండెడివారమని బీజేపీ ప్రతినిధి ఫ్రంట్ లైన్‌తో చెప్పాడు.

ఈసారి ఎన్నికల అనంతరం జరిగిన హింస స్వభావరీత్యా కొంచెం భిన్నంగా ఉంది. బీజేపీ భౌతికంగా కంటే కూడా ప్రతిపక్ష పార్టీల మద్దతుదారులు, కార్యకర్తల జీవనోపాధిని లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడిందని వామపక్ష రాజకీయ పరిశీలకుడు, సీనియర్ జర్నలిస్ట్ రాహుల్ సిన్హా అభిప్రాయపడ్డాడు. మొదటి ఐదు సంవత్సరాల్లో ఎక్కువగా భౌతిక దాడులు చేశారు. ఇరవై ఐదు మంది వామపక్ష పార్టీల కార్యకర్తలు, మద్దతుదార్లు హత్య గావించబడ్డారు. ప్రతిపక్ష పార్టీల మద్దతుదారులే వేల సంఖ్యలో దాడులకు గురయ్యారు. వారి పార్టీల కార్యాలయాల్ని ధ్వంసం చేశారు. ఇండ్లను తగులబెట్టారు. ఈసారి ప్రజల జీవనోపాధిని లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నారు. ఒక వ్యక్తికి రబ్బర్ తోట ఉందనుకోండి, ఆ తోటను ధ్వంసం చేస్తారు, లేకుంటే ఆటోరిక్షా, లేదా దుకాణం, లేదా ఏదైనా చిన్న వ్యాపారం. మీకు ఒకవేళ వ్యవసాయం చేయడానికి (వేరే ఎలాంటి వనరులు లేకుండా)మోటార్ పంపుసెట్టు ఉంటే దాన్ని ఎత్తుకెళ్లి పోతారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారు ఇళ్ళవద్దకు రావడానికి పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేసినట్టు అనేకమంది తెలియజేశారు. ఆ విధంగా ప్రజల జీవనోపాధిని పునరుద్ధరించి, మళ్ళీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎలాంటి కార్యక్రమాల్లో పాల్గొనకుండా భయపెట్టి ప్రజల్ని అదుపు చేసే ప్రయత్నం చేస్తున్నారు. దీని ఫలితంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఘోరంగా దెబ్బతిన్నది.

బీజేపీ పాలనలో ప్రతిపక్షం పరిస్థితి అత్యంత ఘోరంగా ఉందని, సీపీఐ(ఎం) పాలనా కాలంలో ఇప్పుడున్న పరిస్థితి ఏనాడూ లేదని, నాటి ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ అభిప్రాయపడుతుంది. ప్రస్తుత బీజేపీ పాలనలో ఉన్నంత భయానకమైన పరిస్థితులు సీపీఐ(ఎం) పాలనా కాలంలో లేవని త్రిపుర రాష్ట్ర పీసీసీ కార్యదర్శి హిమాన్షు కర్ ఫ్రంట్ లైన్‌తో చెప్పాడు. ఆనాడు(సీపీఐ(ఎం) పాలనలో) ప్రతిపక్ష పార్టీ రాజకీయ కార్యకలాపాలు నిర్వహించుకునేది, తన గొంతుకలను వినిపించేది. కానీ ఇప్పుడు ఒక పథకం ప్రకారం ప్రతిపక్షాల నోళ్ళు పూర్తిగా నొక్కే ప్రయత్నం చేస్తున్నారు.





> "త్రిపురలో చెలరేగుతున్న హింస హద్దులు దాటుతుంది. వెయ్యికి పైగా హింసాత్మక సంఘటనలు అసెంబ్లీ ఎన్నికలు జరిగిన కొద్ది రోజులకే నమోదయ్యాయి. బీజేపీ పాలక ప్రభుత్వ మద్దతుదార్లు రాష్ట్రంలో భారీ విధ్వంసక చర్యలకు పాల్పడుతున్నారు. భారీ సంఖ్యలో గృహాలు, ఆస్తులు ధ్వంసం చేయబడటం లేదా దహనాలకు గురవుతున్నాయి. వందల సంఖ్యలో ప్రజల్ని ప్రతిపక్ష పార్టీల సానుభూతిపరుల్ని లక్ష్యంగా చేసుకొని నేరగాళ్లు అనాగరిక దాడులకు పాల్పడుతున్నారని" సీపీఐ(ఎం)కు చెందిన రాజ్యసభ సభ్యుడు వి.శివదాసన్ ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్ కర్‌కు మార్చి 11న రాసిన లేఖలో పేర్కొన్నారు.

కేంద్ర బృందం సందర్శన

హింసాయుత దాడులు ఏ మాత్రం తగ్గకుండా కొనసాగుతున్న పరిస్థితుల్లో వామపక్ష పార్టీల, కాంగ్రెస్ పార్టీల ఎంపీలతో ఏర్పడిన ఒక నిజనిర్ధారణ బృందం రాష్ట్రంలోని ఎంఎల్ఏలు, స్థానిక నాయకులతో కలసి త్రిపుర రాష్ట్రంలో దాడులు జరిగిన ప్రాంతాల్ని సందర్శించారు. "వారు (బీజేపీ వారు)గ్రామాల్లోకి ప్రవేశించి, ఎన్నికల ప్రచారంలో, ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్న సీపీఐ(ఎం) పార్టీ కార్యకర్తల్ని గుర్తించి, వారి ఇళ్ళను ధ్వంసం చేశారు. నిరసన తెలిపే ప్రయత్నం చేస్తే మీకు కూడా ఇదే గతి పడుతుందని బీజేపీ వారు ఇరుగు పొరుగునున్న వారిని కూడా బెదిరించారు. ఇది నిరంతరం కొనసాగుతూనే ఉంది. కానీ పోలీసులు వారి చేతిలో కీలుబొమ్మలుగా మారిపోయారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి కూడా వారు భయపడుతున్నారని" నిజనిర్థారణ బృందం సభ్యుడు పశ్చిమబెంగాల్ నుండి రాజ్యసభకు ఎన్నికైన బికాస్ రంజన్ భట్టాచార్య ఫ్రంట్ లైన్‌తో చెప్పాడు.

ఆఖరికి పార్లమెంటరీ బృందాన్ని కూడా వదిలి పెట్టలేదు. సెపాహిజాల జిల్లాలో నీహల్ చంద్రనగర్‌లో ఈ బృందం దాడికి గురైంది. ఎంపీలను, ఎన్నికైన శాసనసభ్యులనే ఈ విధంగా బెదిరిస్తే, సామాన్య ప్రజానీకం పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించవచ్చు. బెదిరింపులతో వారు ప్రజల నోళ్ళు నొక్కేస్తున్నారు. ఇలాంటి పరిస్థితి ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదకరమని భట్టాచార్య అభిప్రాయపడ్డారు.

మొదట ఈ విషయాన్ని పార్లమెంటులో లేవనెత్తాలని అనుకున్నప్పటికీ, దీని వలన ఎలాంటి ఉపయోగం ఉండదని భట్టాచార్య భావించారు. ఇది రాష్ట్రానికి సంబంధించిన సమస్యని బీజేపీ అంటుంది కాబట్టి దీనిని పార్లమెంట్‌లో ప్రస్తావించ లేదు. ఈ భయానక వాతావరణాన్ని ప్రతిఘటించడానికి ప్రజల్ని ఐక్యం చేయడమే ఏకైక పరిష్కారం అని ఆయన అభిప్రాయపడ్డారు.

"త్రిపురలో చెలరేగుతున్న హింస హద్దులు దాటుతుంది. వెయ్యికి పైగా హింసాత్మక సంఘటనలు అసెంబ్లీ ఎన్నికలు జరిగిన కొద్ది రోజులకే నమోదయ్యాయి. బీజేపీ పాలక ప్రభుత్వ మద్దతుదార్లు రాష్ట్రంలో భారీ విధ్వంసక చర్యలకు పాల్పడుతున్నారు. భారీ సంఖ్యలో గృహాలు, ఆస్తులు ధ్వంసం చేయబడటం లేదా దహనాలకు గురవుతున్నాయి. వందల సంఖ్యలో ప్రజల్ని, ప్రతిపక్ష పార్టీల సానుభూతిపరుల్ని లక్ష్యంగా చేసుకొని నేరగాళ్ల అనాగరిక దాడులకు పాల్పడుతున్నారని" సీపీఐ(ఎం)కు చెందిన రాజ్యసభ సభ్యుడు వి.శివదాసన్ ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్ కర్‌కు మార్చి 11న రాసిన లేఖలో పేర్కొన్నారు.

అయినా బీజేపీ ఈ దాడులకు సంబంధించిన ఆరోపణల్ని కొట్టిపారేసింది. ఆ రాష్ట్ర పాలక పార్టీని, త్రిపుర ప్రభుత్వాన్ని అపఖ్యాతి పాలు చేయడానికి జరుగుతున్న కుట్రగా పేర్కొంది. "స్థానిక ప్రజలు జరుగుతున్న కుట్రను నిరసించారు. వారు భయానక వాతావరణ ఆరోపణల్ని అంగీకరించలేదు. ఆ ప్రాంతంలో ఎలాంటి రాజకీయ హింసాత్మక ఘటనలు జరిగిన సందర్భాలు లేవని, ఆ ఆరోపణలను తిరస్కరించారు. వామపక్ష- కాంగ్రెస్ పార్టీల నాయకులు దీనిని సహించలేకపోయారని" త్రిపుర బీజేపీ అధికార ప్రతినిధి నబేందు భట్టాచార్య ఎంపీలపై దాడి జరిగిన తరువాత ఓ పత్రికా ప్రకటన విడుదల చేశాడు.

("ఫ్రంట్ లైన్" సౌజన్యంతో)
అనువాదం:బోడపట్ల రవీందర్, 9848412451

విద్యాహక్కు చట్టం అమలేది?



పాఠశాలకు వెళ్లాల్సిన బడీడు పిల్లలు బడిలో చేరడం, చేరినవారు కొనసాగడం, వారందరూ అర్థవంతంగా చదువు నేర్చుకోవడానికి అనువైన, ప్రోత్సాహకరమైన, స్వేచ్ఛా పూరిత వాతావరణం పాఠశాలల్లో కల్పించడానికి 13ఏండ్ల క్రితం ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య హక్కు చట్టం అమల్లోకి వచ్చింది. 6-14 వయస్సు ఉన్న పిల్లలందరికీ ప్రాథమిక విద్యను హక్కుగా మారుస్తూ సమున్నత ఆదర్శాలతో పట్టాలెక్కిన ఈ చట్టం ఆచరణలో చతికిలపడింది. దేశంలోని ప్రయివేటు కార్పొరేట్ పాఠశాలలన్నీ పాతికశాతం సీట్లను నిరుపేద విద్యార్థులకు కేటాయించాలనే ఈ చట్టం నిబంధనను ఖాతరు చేస్తున్నవారు కనిపించడం లేదు. అడ్డంగా చట్టం నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలను నియంత్రించే సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల క్షేత్రస్థాయిలో చట్టం అమలు అభాసుపాలు అవుతున్నది. విద్యాహక్కు చట్టం సక్రమంగా అమలు కాకపోవడంవల్ల దేశంలో 6కోట్ల మంది పిల్లలు పాఠశాల ముఖమే చూడటం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో చట్టం అమలులోని సాధక బాధకాలను సమీక్షించాల్సిన తరుణమిది.



అంకం నరేష్
6301650324

చట్టం ఏప్రిల్ 1, 2010 నుండి దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చింది. చట్టం అమల్లోకి వచ్చిన సందర్భాన్ని ప్రస్తావిస్తూ అప్పటి ప్రధాన మంత్రి మాట్లాడుతూ... జాతి, మత, కులాలకతీతంగా దేశ బాలలందరినీ బడిలో చేర్పించి నాణ్యమైన విద్యను చట్టం ద్వారా అందిస్తామని అన్నారు. కానీ నేటికీ చట్టం ప్రధాన ఉద్దేశం నెరవేరలేదు. చట్టం సక్రమంగా అమలు కావాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో 6శాతం నిధులను విద్యాభివృద్ధికి కేటాయించాలి. అరకొర కేటాయింపులతో అద్భుత ఫలితాలు సాధించడం సాధ్యం కాదనే విషయాన్ని గతంలో సుప్రీంకోర్టు తేల్చి చెప్పిన కూడా ప్రభుత్వాలు విద్యాభివృద్ధి కేటాయిస్తున్న నిధులు పేలవంగా ఉంటున్నాయి. నేటికి ప్రాథమిక పాఠశాలలేని గ్రామాలు, మౌలిక సదుపాయాలు లేమి, ఉపాధ్యాయుల కొరతతో విద్యా రంగం అస్తవ్యస్తంగానే ఉన్నది. కరోనా కాలంలో దేశంలో 92లక్షల బాలబాలికలు బడికి దూరం అయ్యారని పలు గణాంకాలు విశ్లేషణ చేస్తున్నాయి. అలాగే వందకు పాతికశాతం బాలబాలికలు ఐదో తరగతిలోనే బడి మానివేస్తున్నట్లు మన రాష్ట్ర ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ఈ చట్టం అమల్లో భాగంగా బడి ముఖం చూడని పిల్లలకు పాఠశాలలో చేర్పించేందుకు ఉద్దేశించిన పథకం సమగ్ర శిక్ష అభియాన్ ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ఎందుకు కొరగానిదిగా మారింది.

విద్యా హక్కు చట్టం సెక్షన్ 12 ప్రకారం దేశంలోని ప్రతి కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలలు ప్రతి విద్యా సంవత్సరంలో ఒకటో తరగతి ప్రవేశాల్లో 25శాతం సీట్లు బలహీన వర్గాలకు ఉచితంగా కేటాయించాలి. ఇందులో భాగంగా వికలాంగులు, అనాథలు, వీధి బాలలకు 5శాతం, ఎస్సీ బాలలకు 10శాతం, గిరిజన బాలలకు 4శాతం, వెనుకబడిన వర్గాల పిల్లలకు 6శాతం సీట్లను ఉచితంగా కేటాయించాలి. కానీ అటు దేశంలో ఇటు రాష్ట్రంలో కనీసం పదిశాతం పాఠశాలలు కూడా ఈ చట్టం నిబంధనలను పాటించడం లేదు. సెక్షన్ 13 ప్రకారం ప్రాథమిక స్థాయిలో వివిధ పాఠశాలల్లో పిల్లల ఎంపికకు ఎలాంటి ఎంట్రన్స్‌లను నిర్వహించకూడదు. కానీ ఈ చట్టం నిబంధనలు ఉల్లంఘిస్తూ మన రాష్ట్రంలో గురుకుల, ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల ఎంపిక కోసం ఎంపిక పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రయివేటు పాఠశాలలో విద్యార్థుల ప్రవేశం కోసం ఎలాంటి క్యాపిటేషన్ రుసుములు తీసుకోకూడదు. కానీ ఈ చట్టం నిబంధనలు బేఖాతరు చేస్తూ డొనేషన్, అడ్మిషన్ ఫీజులను ఇబ్బడిముబ్బడిగా వసూలు చేస్తున్నాయి. సెక్షన్ 18 ప్రకారం గుర్తింపు లేకుండా ప్రయివేటు పాఠశాలలు నడపరాదు. అలా నడిపితే ఈ చట్టం నిబంధనల ప్రకారం జరిమానాలు వసూలు చేయవచ్చు. కానీ చాలా గ్రామీణ ప్రాంతాలలో, మారుమూల ప్రాంతాల్లో ప్రయివేటు పాఠశాలలు నెలకొల్పుతూ ఎలాంటి అనుమతులు లేకుం డా పాఠశాలలను నడుపుతున్నారు. దీనిపై ప్రభుత్వాల సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల విద్యార్థులు నష్ట పోతున్నారు.

విద్యా హక్కు చట్టం సెక్షన్ 25 ప్రకారం మొదట పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి. ప్రస్తుతం దేశంలో 9లక్షల ఉపాధ్యాయ పోస్టులు అలాగే రాష్ట్రంలో దాదాపుగా 20 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చట్టం నిబంధనలకు అనుగుణంగా వాటిని వెంటనే భర్తీ చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి. పనుల్లో గనుల్లో కార్ఖానాల్లో కర్మాగారాల్లో పనిచేస్తున్న బాలకార్మికులను 'ఆపరేషన్ స్మైల్' వంటి ప్రత్యేక కార్యక్రమాల ద్వారా ఎప్పటికప్పుడు గుర్తిస్తూ బడీడు పిల్లలందరూ బడిలో కొనసాగేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. పిల్లల సంపూర్ణ వ్యక్తిత్వ వికాసమే లక్ష్యంగా పాఠశాల విద్య ఉండాలి. అలాగే నిష్ఠ వంటి ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాలతో ఉపాధ్యాయ విద్యను మరింత అభివృద్ధి పరచాలి. ప్రభుత్వాలు స్వచ్ఛంద సంస్థలు పౌర సమాజం ఏకతాటిపై నిలిచి తగిన కృషి చేస్తే విద్యా హక్కు చట్టం లక్ష్యాలు నెరవేరుతాయి.

ఉపాధి హామీ చట్టం గొంతు నులుమొద్దు

మోడీ ప్రభుత్వం 2014లో ఏర్పడినప్పటి నుండి గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్ఇజిఎస్) గొంతు నులిమేందుకు ఏదో రకంగా ప్రయత్నిస్తూనే ఉంది. ఆర్థిక వ్యవస్థ మరింత 'సమర్థవంతంగా', 'ఉత్పాదకంగా' పని చేసేలా మార్గనిర్దేశనం చేయాలంటే ప్రయివేటు రంగాన్ని అనుమతించాలని, అందుకుగాను ప్రభుత్వ వ్యయంలో కోత పెట్టాలని నయా ఉదారవాద సిద్ధాంతం పేర్కొంటున్నది. దీనికి కట్టుబడిన మోడీ ప్రభుత్వం క్రమం తప్పకుండా మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ చట్టంలో సహా వివిధ సంక్షేమ పథకాలకు బడ్జెట్ కేటాయింపుల్లో కోత పెడుతూవస్తోంది. అంతేకాకుండా పథకాల గొంతు నులిమేందుకు ఇతర మోసపూరిత చర్యలను కూడా చేపడుతోంది. చట్టం విషయానికి వస్తే 2022-23 సంవత్సరానికి బడ్జెట్‌లో రూ.73వేల కోట్లు కేటాయింపులు జరపాలని ప్రతిపాదించబడింది. కానీ, వాస్తవానికి రూ.89,400 కోట్లు ఖర్చు చేసి ఉంటారని అంచనా. అంతకు ముందు సంవత్సరం 2021-22లో ఖర్చు పెట్టిన రూ.98,467.85 కోట్లలో దాదాపు పదిశాతం తక్కువ. అయితే 2023-24 బడ్జెట్‌లో కేవలం రూ.60వేల కోట్లు మాత్రమే కేటాయించారు. గతేడాది సవరించిన అంచనా కేటాయింపులో ఏకంగా 33శాతం కోత పెట్టారు.

ప్రభుత్వం చట్టానికి కేటాయింపులు తగ్గించడం ఒక్కటే కాదు. పలు రకాల కొర్రీలు పెడుతోంది. ఈ ఏడాది జనవరిలో, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ కార్మికులు తప్పని సరిగా అటెండెన్స్ (హాజరు) నమోదు చేయాలంటూ నేషనల్ మొబైల్ మానిటరింగ్ సర్వీస్ (ఎన్ఎంఎంఎస్) పేరుతో మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టింది. దీంతో దేశవ్యాప్తంగా పని ప్రదేశాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఇంటర్‌నెట్ కనెక్టివిటీ సరిగా లేకపోవడంతో కార్మికులు తమ హాజరును నమోదు చేయడం కోసమే గంటల తరబడి ప్రయాస పడాల్సి వస్తోంది. హాజరు పడకపోతే, ఆ రోజుకు వారి వేతనం నష్టపోతారు కాబట్టి ఇది వారికి జీవన్మరణ సమస్యగా మారింది. పథకంలో జరుగుతున్న మోసాన్ని ఎదుర్కొనడానికంటూ ఈ తరహా హైటెక్ చర్యలను కార్మికులపై బలవంతంగా రుద్దడం ప్రభుత్వ కుట్ర మినహా మరొకటి కాదు. పీడీఎస్ పంపిణీలో కూడా గతంలో ఇదే పద్ధతిని రుద్దారు. ప్రభుత్వ పాఠశాల టీచర్ల హాజరు విషయంలోనూ ఇలాగే చేశారు. వీటన్నిటివల్లా ప్రజలకు గందరగోళ, విచారకర పర్యవసానాలే కలుగుతున్నాయి. కనెక్టివిటీ సమస్యలతో పాటుగా ఆధార్ సరిపోలడం లేదని, బ్యాంక్ ఖాతా నెంబరు కలవడం లేదని, చేతి వేళ్ళ గుర్తులు పడడం లేదని, ఇంకా ఇలాగే అనేక సమస్యల కారణంగా పీడీఎస్ రేషన్ వేలాది మందికి అందకుండా పోయింది. ఎంజిఎన్ ఆర్ఇజిఎస్ కార్మికులు కూడా ఇలాంటి సమస్యలనే ఎదుర్కొంటున్నారు. ఇటువంటి నిబం ధనల కారణంగా కార్మికులు పని కోసం ఎంజిఎన్ ఆర్ఇజిఎస్‌ను ఆశ్రయించడం



> ఈ చట్టంలో ఈ ఏడాది సగటు పనిదినాల సంఖ్య కేవలం 47 మాత్రమే. కనీసం ఏడాదిలో వంద రోజులు పని కల్పించాలని చట్టం పేర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం పని కల్పించింది అందులో సగం కూడా లేదు. ప్రాణాంతకంగా మారిన ఈ ఆంక్షలకు తోడు, తక్కువ వేతనాలు. అది కూడా సమయానికి సరిగా అందని వేతనాలు, డిజిటల్ అడ్డంకులు, సరిపడా పని దినాలు లేకపోవడం... ఇవన్నీ కలిసి ఈ చట్టం కింద పని దొరకబుచ్చుకుంటున్న కుటుంబాల సంఖ్య తగ్గిపోవడానికి దారితీసింది.

తగ్గిపోతున్నది.

వేతనాల్లో నిరంతరం జరుగుతున్న జాప్యం కార్మికులకు ఎదురవుతున్న మరో సమస్య. ఒకోసారి అనుమతించిన 15రోజుల వెసులుబాటును కూడా మించి జాప్యం జరుగుతోంది. ప్రస్తుత సంవత్సరంలో 15 అంతకుమించి రోజుల జాప్యం తర్వాత రూ.3630 కోట్ల వేతనాలు చెల్లించారు. ఇంకా రూ.1010 కోట్ల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని ప్రభుత్వ డేటా పేర్కొంటోంది. చాలా తక్కువ కూలికి పనిచేసే కార్మికులకు ఈ స్థాయిలో ఇలా వేతనాలు పెండింగ్‌లో పెట్టడమనేది ఏ మాత్రమూ సహించరాని విషయం. దీంతో వారు తరచుగా తక్షణమే డబ్బులు చేతికి అందివచ్చే పనులను ఎంచుకుంటున్నారు. ఎంజిఎన్ఆర్ ఇజిఎస్ వేతనాల కన్నా తక్కువే వచ్చినా వారు దానికే మొగ్గు చూపుతున్నారు. ఈలోగా ప్రభుత్వం ఉపాధి చట్టం వేతనాలను 2 నుండి 10శాతం మధ్య పెంచుతున్నట్లు చాలా అట్టహాసంగా ప్రకటించింది. అంటే రోజుకు రూ.7 నుండి రూ.26 వరకు పెరుగుతాయి. గత అనేక మాసాలుగా ద్రవ్యోల్బణం 6-8 శాతం మధ్యలో ఉంది. ఆహార ద్రవ్యోల్బణం ఇంకా ఎక్కువగా 8-10 శాతం మధ్య వుంది. రాబోయే ఆర్థిక సంవత్సరంలో ఈ అధిక ద్రవ్యోల్బణం తగ్గుతుందని విశ్వసించడానికి ఒక్క కారణం కూడా కనిపించడం లేదు. ఇక కార్మికుల వేతనాల పెంపు అమలు కూడా రాబోయే ఆర్థిక సంవత్సరం నుండే. వాస్తవానికి, వ్యవసాయ కార్మికులకు అలాగే వ్యవసాయేతర కార్మికులకు ప్రస్తుతమున్న వేతనాల రేట్ల కన్నా ఎంజిఎన్ఆర్ఇజిఎస్ వేతనాలు చాలా తక్కువగా ఉన్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పనులకు సంబంధించి సగటు దినసరి వేతనం కేవలం రూ.217.87. అదే సమయంలో పురుష వ్యవసాయ కార్మికులకు రూ.349.77 అని ఆర్‌బిఐ పేర్కొంది.

అలాగే ఈ చట్టంలో ఈ ఏడాది సగటు పనిదినాల సంఖ్య కేవలం 47 మాత్రమే. కనీసం ఏడాదిలో వంద రోజులు పని కల్పించాలని చట్టం పేర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం పని కల్పించింది అందులో సగం కూడా లేదు. ప్రాణాంతకంగా మారిన ఈ ఆంక్షలకు తోడు, తక్కువ వేతనాలు. అది కూడా సమయానికి సరిగా అందని వేతనాలు, డిజిటల్ అడ్డంకులు, సరిపడా పని దినాలు లేకపోవడం... ఇవన్నీ కలిసి ఈ చట్టం కింద పని దొరకబుచ్చుకుంటున్న కుటుంబాల సంఖ్య తగ్గిపోవడానికి దారితీసింది.

అధికారిక సమాచారం ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం కింద పని దొరికిన వారు 8.6కోట్ల మంది ఉండగా, గతేడాది ఈ సంఖ్య 10.6 కోట్లుగా ఉంది. అంటే గతేడాది కన్నా 2కోట్లు (దాదాపు 20శాతం) తగ్గింది. పైగా ఈ చట్టంలో పని కోసం దరఖాస్తు చేసుకున్న దాదాపు 1.6 కోట్ల మంది కార్మికులు తర్వాత పనిలోకి వెళ్లకుండా వెనుదిరిగారు. అలాంటి వారిని పరిగణనలోకి తీసుకోకుండా వేసిన లెక్క ఇది. తక్కువ వేతనాలు, సరిపడా పని దినాలు లేకపోయినా ఎంజిఎన్ఆర్ఇజిఎస్ అనేది కోట్లాదిమంది కుటుంబాలకు జీవనా ధారంగా ఉంది. ఈ పథకంలో ఇచ్చేది అతి తక్కువ వేతనాలే అయినప్పటికీ అవే వారికి ఎంతో విలువైనవి. ఎందుకంటే దేశంలో ఎలాంటి ఉపాధి అవకాశాలు లేవు. పైగా పెరుగుతున్న ధరలు కుటుంబాల బడ్జెట్‌ను ధ్వంసం చేస్తున్నాయి. ఫలితంగా ఆర్థిక సంక్షోభమనేది ఎడతెగకుండా ఉంది. వేతనాలు, పని దినాలు పెంచుతూ, పట్టణ ప్రాంతాలకు కూడా విస్తరిస్తూ, ఉపాధి హామీ చట్టాన్ని మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఇప్పుడు నెలకొంది. దీనితో పిల్లికి చెలగాటం, ఎలకకు ప్రాణ సంకటంగా మారిన ఆటకు అంతం పలకాలి.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

19 ఏండ్ల ఆర్తి కుమారి... పాట్నా బిగ్ అపోలో స్పెక్ట్రా హాస్పిటల్‌లోని ఏడవ అంతస్తులో మంచం మీద నుండి కిటికీలోంచి ఆత్రుతగా చూస్తోంది. అంతర్జాతీయ రగ్బీ స్టార్ ఆమె. మోకాలికైన గాయాన్ని సరిచేసేందుకు ఎంతో బాధాకరమైన రీప్లేస్‌మెంట్ ఆపరేషన్ నుండి ఇప్పుడిప్పుడు కోలుకుంటుంది. కానీ ఆమె మనసు మాత్రం కోల్‌కతా జాతీయ రగ్బీ క్యాంప్‌లో ఉంది. ఆపరేషన్ వల్ల అందులో పాల్గొనలేకపోయింది. క్రీడంటే క్రికెట్ మాత్రమే అనుకునే మన దేశంలో రగ్బీ ద్వారా ప్రపంచం ముందు నిలబడిన ఆమె పరిచయం నేటి మానవిలో...

'రగ్బీ నాకు ప్రపంచాన్ని చూపించింది'



ఆస్పత్రి బెడ్‌పై ఎంతో ఆత్రుతతో ఉన్న ఆమెకు తండ్రి సంజయ్ కుమార్ ఓ శుభవార్త వినిపించాడు. "అంతర్జాతీయ పతకాలు గెలుచుకున్న క్రీడాకారులు ఇప్పుడు నేరుగా ఎస్‌డీఓలు, డీఎస్‌పీలు అవుతారు". సంజయ్ కుమార్ హెడ్‌లైన్‌ని చదువుతున్నప్పుడు కళ్ళు మెరుస్తున్నాయి. క్షణాల వ్యవధిలో ఆసుపత్రి గది ఆనందంతో నిండిపోతుంది. ఆర్తి తన వాట్సాప్ స్టోరీలో న్యూస్ క్లిప్‌ను పోస్ట్ చేసింది. గర్వంగా ఉన్న తండ్రి వెంటనే కొంతమంది బంధువులకు ఫోన్ చేశాడు.

ఆస్పత్రి సెక్యూరిటీ గార్డులు, నర్సులతో పాటు ఇతర సిబ్బందితో "నా కూతురు దరోగా(పోలీసు అధికారి) అవుతుంది" అంటూ ఎంతో ఉప్పొంగిపోయాడు. నర్సుల నుండి గార్డుల వరకు అందరూ అతనితో కలిసి సంబరాలు చేసుకున్నారు. వారి జీవితం మొత్తంలో ఎప్పుడోఒకప్పుడు ప్రభుత్వ ఉద్యోగం సంపాదించడం ఓ కల. అది ఆమెకు నెరవేరబోతుందని అక్కడి వారందరికీ అర్థమయింది. కానీ వారికి అర్థం కానిది రగ్బీ.

విమర్శలు చేశారు

మీరు ఈ ఆటను ఎలా ఆడతారు? ఇది ఫుట్‌బాల్ లాగా ఉంటుందా? వాలీబాల్ లాగా ఉంటుందా? బంతి ఎలా ఉంటుంది? అనే ప్రశ్నలు వస్తూనే ఉన్నాయి. తర్వాత అరగంట పాటు వారికి ఆటను వివరిస్తూ గడిపాడు కుమార్. కొంత మంది ఆసక్తిగల సిబ్బంది తమ ఫోన్‌లను తీసి రగ్బీ చూడడం మొదలుపెట్టారు. మరికొందరు వారి చుట్టూ గుమిగూడారు. కుమార్ కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించిన ఈ తెలియని ఆట గురించి తెలుసుకోవాలనే ఆరాటంతో. "ఇది ప్రమాదకరమైన ఆట లాగా ఉంది" అని ఓ సెక్యూరిటీ గార్డు. ఇతర జట్టు స్కోర్ చేయకుండా నిరోధించడానికి వారు క్రూరమైన పోరాటంలో ఒకరినొకరు నెట్టుకుంటూ ఉంటారు. కొంతమంది బంధువులు, కుటుంబ స్నేహితులు, స్నేహితులు ఆర్తి కుమారి క్రీడ ఎంపికపై విమర్శలు చేశారు. కానీ నేడు ఆమె ఆసుపత్రి గదిలోనూ విజయోత్సవం జరుపుకుంటుంది.

ఇది పోకిరీల ఆట కాదు

"ఒకప్పుడు నా స్వేచ్ఛను నిరసించిన వారి నుండి ఇప్పుడు నేను చాలా గౌరవం పొందుతున్నాను. ఇప్పుడు ఎవరూ నన్ను ప్రశ్న అడిగే ధైర్యం చేయరు, ఈ క్రీడ ద్వారా నేను ప్రపంచానికి చూస్తాను. ఇది చాలా సరదాగా ఉంది" అంటుంది మనదేశ మహిళల రగ్బీలో జాతీయ ఛాంపియన్, వర్ధమాన క్రీడాకారిణి ఆర్తి. బీహార్‌లో ఆర్తి వంటి వందలాది మంది అమ్మాయిలు ఈ క్రీడను ఆదరిస్తున్నారు. రగ్బీ అనేది పెద్దమనుషులు ఆడే పోకిరీల ఆట అనే మూస పద్ధతిని బద్దలుకొట్టారు. ఇది ఇప్పుడు పురుషులో, ఉన్నత వర్గాలో ఆడే ఆట కాదు. భారతదేశంలోని అనేక గ్రామీణ ప్రాంతాలలో యువ, పేద గ్రామీణ అమ్మాయిలు కూడా ఆడగలరు అని నిరూపించారు ఆర్తి వంటి వారు. బీహార్ 2022లో రగ్బీ నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో జూనియర్, సీనియర్ విభాగాలు రెండింటిలోనూ గెలుపొందింది. మాజీ విభాగంలో ఒడిశా, తర్వాతి విభాగంలో పశ్చిమ బెంగాల్‌ను ఓడించింది. ఇది ఒక దశాబ్దం నుండి కొనసాగుతున్న ఘనత. ఒక ఒంటరి రేంజర్ కోచ్ ప్రతిభ కోసం



అన్వేషించడం దగ్గర నుండి సంప్రదాయవాద తల్లిదండ్రులను ఒప్పించడం వరకు విజయం సాధించారు. అంతే కాదు ఇప్పుడు వారి కుమార్తె క్రికెట్ పిచ్చిగా ఉన్న భారతీయులకు రగ్బీని పరిచయం చేస్తున్నారు.



ఎడారిగా మారిన చక్కెర మిల్లే శిక్షణా మైదానం

రగ్బీ... అత్యుత్తమ ఆంగ్ల క్రీడ. ఇప్పుడు బీహార్‌లోని పేద కుటుంబాలకు అనూహ్యమైన అవకాశాలకు ద్వారాలు తెరిచింది. ఆర్తికి ఈ క్రీడను పరిచయం చేసిన బీహార్‌లోని రగ్బీ అసోసియేషన్ సెక్రటరీ, కోచ్ అయిన 43 ఏండ్ల పంకజ్ కుమార్ జ్యోతి. "ఈ అమ్మాయిలను పేదరికం నుండి దూరం చేయడానికి ఇది ఒక మార్గం" అంటారు ఆయన. ఆర్తీ కుటుంబంలో క్రీడాకారులు ఎవరూ లేరు. వ్యవసాయం ఆమె కుటుంబానికి మూలాధారం. కుటుంబంలోని పురుషులు కూడా తమ సంప్రదాయాన్ని విడిచిపెట్టాలనే ఆలోచన ఎప్పుడూ చేయలేదు. నవాడా జిల్లా వారిసాలిగంజ్ వారి స్వగ్రామం. వారికున్న కొద్దిపాటి భూమిని తండ్రి సాగు చేసేవాడు. అదే ఆర్తి చిన్నతనంలో ఆకలితో అలమటించకుండా చూసుకుంది. అథ్లెటిక్స్‌తో సహా మిగతావన్నీ ఆమెకు విలాసవంతమైనవే. ఆమె శిక్షణా మైదానం 78 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పనికిరాని, నిర్జనమైన వారిసాలిగంజ్ షుగర్ మిల్లు. 1993 నుండి ఆ మిల్లు పనిలో లేదు. శిధిలమైన భవనాలు, షెడ్‌ల చుట్టూ కాపలా మాదిరిగా కనిపించే గడ్డి, కలుపు మొక్కలు, చెట్లతో నిండిపోయింది. ఇక్కడే ఆమె తన మొదటి లాంగ్ జంప్, 100 మీటర్ల రేసును ప్రయత్నించింది.



నైపుణ్యాన్ని గుర్తించి

"నాకు 14 ఏండ్ల వయసు ఉన్నప్పుడు కొంతమంది అబ్బాయిలు గ్రౌండ్‌లో ఆడుకోవడం చూశాను. నేనూ వాళ్ళతో కలిసిపోయాను" అంది ఆర్తి. అథ్లెటిక్స్‌పై ఉన్న ఆసక్తి ఆమెను 2016లో పాట్నాకు తీసుకువచ్చింది. అక్కడ ఆమె ఓపెన్ స్టేట్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంది. "నేను 100, 200 మీటర్ల రేసులో రెండవ బహుమతిని పొందాను" అంటూ ఆమె గుర్తుచేసుకుంది. ఇక్కడే రగ్బీ అసోసియేషన్ సెక్రటరీ పంకజ్ కుమార్ జ్యోతి ఆమెలోని నైపుణ్యాన్ని గుర్తించారు. అతను జాతీయ స్థాయిలో రగ్బీ ఆడటానికి స్టామినాతో ఉన్న ఫాస్ట్ రన్నర్ల కోసం వెతుకుతున్నాడు. అతను ఆర్తీని సంప్రదించే సమయానికే నలంద నుండి శ్వేతా షాహీ, బార్హ్ నుండి స్వీటీ కుమారి వంటి బీహార్‌ను జాతీయ, అంతర్జాతీయ రగ్బీ మ్యాప్‌లో ఉంచిన అగ్రశ్రేణి క్రీడాకారిణులను గుర్తించారు.

ఆట పద్ధతి ఆకర్షించింది

హాస్పిటల్ స్టాఫ్ లాగా అప్పటి వరకు ఆర్తి కూడా రగ్బీ గురించి వినలేదు. అయితే కోచింగ్ తీసుకోవడానికి ముందు ఆమె తండ్రిని కొంచెం ఒప్పించవలసి వచ్చింది. ఆట గురించి వినకపోయినా తండ్రి ఆమె నిర్ణయానికి మద్దతు ఇచ్చాడు. ఒక సంవత్సరం తర్వాత 2017లో రాజ్‌గిర్‌లో జరిగిన రాష్ట్ర రగ్బీ ఛాంపియన్‌షిప్‌ని చూడటానికి ఆమెను ఆహ్వానించారు. అక్కడ ఆమె మొదటిసారిగా శ్వేతా షాహి, స్వీటీ కుమారిలను చూసింది. ఆట కదలిక, శక్తి, వేగం, బలం ఆమెను ఆకర్షించాయి. అకస్మాత్తుగా ఆమె జీవితం తీవ్రమైన శిక్షణతో నిండిపోయింది. పాట్నాలో 45 రోజుల బూట్ క్యాంపులో చేరింది. బాల్‌ను ఎలా పట్టుకోవాలి, దానిని ఎలా పాస్ చేయాలి, ప్రత్యర్థి జట్టును ఎలా ఎదుర్కోవాలో నేర్చుకుంది. ఆపై ఆటలు ప్రారంభమయ్యాయి. అదే సంవత్సరం ఇంటర్ స్కూల్ టోర్నమెంట్ కోసం హైదరాబాద్ వెళ్ళింది. అక్కడ జట్టు స్వర్ణం సాధించింది. అతి తక్కువ కాలంలోనే ఆమె శ్వేతా షాహి, స్వీటీ కుమారితో కలిసి బీహార్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించింది.



అంతర్జాతీయ వేదికపై

ఆర్తి టీం మొత్తం కొన్నేండ్లుగా జూనియర్ నేషనల్ రగ్బీ నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో ఒక రజతం, ఒక కాంస్యం, మూడు స్వర్ణాలను ఇంటికి తీసుకువచ్చారు. గత ఏడాది ఆర్తి సీనియర్ నేషనల్స్‌లో ఆడింది. అక్కడ జట్టు బీహార్‌కు స్వర్ణం సాధించింది. ఆటలో ఆమె నైపుణ్యం ప్రపంచాన్ని చూసే అవకాశాన్ని ఇచ్చింది. 2021లో ఆర్తి, సప్నా కుమారి అంతర్జాతీయ వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడానికి ఎంపికయ్యారు. అండర్-18 ఆసియా ఛాంపియన్‌షిప్ కోసం ఉజ్బెకిస్థాన్‌కు వెళ్లిన జట్టు అక్కడ రజతం సాధించింది. జకార్తాలో జరిగిన ఆసియా రగ్బీ సెవెన్స్ ట్రోఫీలో రజతం సాధించిన జట్టులో ఆమె కూడా సభ్యురాలు. జనవరి 28 నుండి ఫిబ్రవరి 4 వరకు ఒడిశాలో జరిగిన ఆల్ ఇండియా 15 ఛాంపియన్‌షిప్‌లో ఆడుతున్నప్పుడు ఆమె మోకాలికి గాయమైంది. దాంతో బోర్నియోలో రగ్బీ మ్యాచ్ ఆడే అవకాశాన్ని కోల్పోయింది. యూట్యూబ్‌లో తనకు ఇష్టమైన ఇద్దరు రగ్బీ ప్లేయర్‌లైన న్యూజిలాండ్ కెప్టెన్ స్టేసీ ఫ్లూహ్లెర్, భారత రగ్బీ కెప్టెన్ వహ్బిజ్ భారుచా క్లిప్‌లను చూస్తున్నప్పుడు "నేను అక్కడ ఉండలేక పోవడం వల్ల చాలా మిస్ అవుతున్నాను" అంటుంది ఆర్తి.

- సలీమ

ఏప్రిల్ 3న ప్రతిపక్ష పార్టీల సమావేశం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఏప్రిల్ 3న 'సోషల్ జస్టిస్, ది రోడ్ ఎహెడ్' పేరుతో డీఎంకే అధినేత, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ప్రతిపక్ష పార్టీలతో మెగా సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో కనీసం 20 ప్రతిపక్ష రాజకీయ పార్టీలు హాజరుకానున్నాయి. ఈ సమావేశంలో కొంత మంది నేతలు భౌతికంగానూ, మరికొంత మంది నేతలు ఆన్‌లైన్‌లో పాల్గొంటారు. ప్రతిపక్షాలను బలోపేతం చేయడానికి, 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రతిపక్షాలను ఏకం చేయడానికి ఈ సమావేశాన్ని పిలిచినట్లు ఊహాగానాల మధ్య, ఇది వివిధ సామాజిక సమస్యలపై చర్చించడానికి రాజకీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు డీఎంకే నేతలు పేర్కొన్నారు. సామాజిక న్యాయం కోసం పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లడమే 'ది ఆల్ ఇండియా ఫెడరేషన్ ఫర్ సోషల్ జస్టిస్' అనే కాన్సెప్ట్ తొలి సమావేశం ఉద్దేశమని పేర్కొన్నారు. జనవరిలో తమిళనాడు ముఖ్యమంత్రి ఈ ఆలోచన చేశారని నేతలు తెలిపారు. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి రాజా, రాష్ట్రీయ జనతాదళ్ నేత తేజస్వీ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా, భారత రాష్ట్ర సమితి నాయకుడు కె కేశవరావు, టీఎంసీ నేత డెరెక్ ఓబ్రెయిన్, ఆప్ నేత సంజయ్ సింగ్ హాజరుకానున్నారు. ఎన్‌సీపీ, శివసేన (ఠాక్రే) పార్టీల తరపున పాల్గొనే ప్రతినిధులను ఇంకా ప్రకటించలేదు. అయితే, రెండు రాజకీయ పార్టీలకు ఆహ్వానాలు పంపినప్పటికీ, వైసీపీ, బీజేడీ సమావేశంలో పాల్గొంటారా? లేదా? అనే దానిపై అందరి దృష్టి ఉంది. ఇది ప్రతిపక్ష "రాజకీయ" సమావేశం కాదని, సామాజిక సమస్యపై చర్చ అని పేర్కొన్న నేతలు, ఈ సమావేశానికి వైసీపీ, బీజేడీ హాజరవుతాయని అంటున్నారు.తమిళనాడు సీఎం ఎంకె స్టాలిన్ కీలకాంశాలతో సమావేశాన్ని ప్రారంభిస్తారు. అయితే, రాజకీయ నాయకులందరికీ సభను ఉద్దేశించి ప్రసంగించడానికి, వారి పార్టీ అభిప్రాయాలను తెలియజేయడానికి సమయం కేటాయిస్తారు.

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించండి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అసెంబ్లీలో ప్రభుత్వమిచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు, అధ్యాపకుల సర్వీసును క్రమబద్ధీకరించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు శుక్రవారం ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో గత 20 ఏండ్లకు పైగా విద్యా, వైద్య రంగాలతోపాటు, వివిధ ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు ఉద్యోగులు, అధ్యాపకులు పనిచేస్తున్నారని తెలిపారు. వారి సర్వీసును క్రమబద్ధీకరించేందుకు 2016లో జీవో నెంబర్ 16ను ప్రభుత్వం జారీ చేసిందని గుర్తు చేశారు. న్యాయస్థానాల తాత్కాలిక ఉత్తర్వుతో క్రమబద్ధీకరణ ప్రక్రియను నిలిపివేశారని పేర్కొన్నారు. 2021 డిసెంబర్‌లో సుప్రీంకోర్టు సానుకూలమైన తీర్పు ఇచ్చిందని తెలిపారు. గతేడాది మార్చి తొమ్మిదో తేదీన రాష్ట్రంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న 11,103 మంది కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ నేటికీ ఆ హామీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ఈ ఏడాది ఫిబ్రవరి ఆరో తేదీన కూడా అసెంబ్లీలో ప్రభుత్వం తరఫున బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక శాఖ మంత్రి టి హరీశ్‌రావు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి రాష్ట్రంలోని 11,103 మంది కాంట్రాక్టు ఉద్యోగులు, అధ్యాపకులను క్రమబద్ధీకరణ చేయనున్నట్టు ప్రకటించారని గుర్తు చేశారు. కానీ వాటికి సంబంధించిన ఉత్తుర్వులు ప్రభుత్వం నుంచి నేటికీ జారీ కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి ఈ విషయంలో సీఎం కేసీఆర్ జోక్యం చేసుకుని కాంట్రాక్టు ఉద్యోగులు, అధ్యాపకుల క్రమబద్ధీకరణకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేసేందుకు అవసరమైన ఆదేశాలివ్వాలని కోరారు.

విద్యుత్ సంస్థల్లో సమ్మె సైరన్

(మొదటిపేజీ తరువాయి)

చర్చలు జరిగినా ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో తప్పనిసరై సమ్మెలోకి వెళ్లాల్సి వస్తున్నదని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం, యాజమాన్యం తమ సమస్యల పరిష్కారంపై చొరవ చూపాలనీ, సమ్మెతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడకుండా నివారించాలని విజ్ఞప్తి చేశారు. సమ్మె నోటీసులను ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్‌శర్మకు, కార్మిక శాఖ కమిషనర్‌కు కూడా అందచేశారు.

కార్మిక హక్కులపై దాడికి వ్యతిరేకంగా నిరసన దినం

(మొదటిపేజీ తరువాయి)

ఎంఈఎస్ కార్పొరేటీకరణ గురించి రక్షణ మంత్రిత్వ శాఖలో చర్చ జరుగుతోందని తెలిపింది. డీఆర్‌డీఓ, నేవీ, ఇతర ఎస్టాబ్లిష్‌మెంట్‌లలో పెద్ద ఎత్తున అవుట్‌సోర్సింగ్ జరుగుతోందని పేర్కొంది. డీఆర్‌డీఓ ప్రాజెక్టులను ప్రైవేట్ రంగానికి అప్పగిస్తున్నారు. డిజిక్యూఎని తగ్గించేందుకు జాతీయ ఉత్పాదక మండలి నివేదికను అమలు చేయాలనే ప్రతిపాదన రక్షణ మంత్రిత్వ శాఖ పరిశీలనలో ఉంది. డిజిక్యూఎను తగ్గించడం వల్ల రక్షణ మంత్రిత్వ శాఖలో ఖాళీగా ఉన్న 20.90 లక్షల పోస్టులను భర్తీ చేయలేదు. ముంబాయిలోని సెంట్రల్ ఆర్డినెన్స్ డిపోతో సహా వివిధ ఆర్డినెన్స్ డిపోలు మూతపడనున్నాయని తెలిపింది. ప్రభుత్వం వాటాదారులు (గుర్తింపు పొందిన డిఫెన్స్ సివిలియన్ ఎంప్లాయీస్ ఫెడరేషన్)లతో ఎలాంటి చర్చలు జరపకుండానే ఈ నిర్ణయాలన్నింటితో మోడీ సర్కార్ ముందుకెళ్తుందని విమర్శించింది. ఏఐడీఈఎఫ్ సహా ఫెడరేషన్‌ల ప్రాతినిధ్యాలను ప్రభుత్వం విస్మరిస్తోందని ధ్వజమెత్తింది. జేసీఎం పనితీరును స్తంభింపజేయడానికి పీఎంఓ నిర్ణయానికి వ్యతిరేకంగా ఇస్రో ఉద్యోగులు ఆందోళనకు దిగారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు, ఆర్మీ వర్క్‌షాప్‌లలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు జరగలేదు.

కేంద్రం నిర్లక్ష్యం సి.శ్రీకుమార్,
ఏఐడీఈఎఫ్ ప్రధాన కార్యదర్శి

ఏఐడీఈఎఫ్ ప్రధాన కార్యదర్శి సి.శ్రీకుమార్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం కార్మిక సంఘాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందనీ, దేశంలోని శ్రామికశక్తికి ప్రాతినిధ్యం వహించే కార్మిక సంఘాలు కూడా రాజ్యాంగబద్ధమైన సంస్థలేనన్న వాస్తవాన్ని అంగీకరించడానికి నిరాకరిస్తున్నారని అన్నారు. ఇండియా ఐఎల్‌ఓ వ్యవస్థాపక సభ్య దేశమని తెలిపారు. ఐఎల్‌ఓ ప్రకారం కార్మికులకు సంబంధించిన సమస్యలను చర్చించడానికి, క్రమబద్ధీకరించడానికి అన్ని సభ్య దేశాలు ప్రతి సంవత్సరం తమ లేబర్ కాన్ఫరెన్స్‌ను ఏర్పాటు చేయాలని, అయితే ప్రస్తుత ప్రభుత్వం 2015 తరువాత ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్‌ను ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు.

కార్మిక చట్టాలను తారుమారు చేసి, కార్మిక సంఘాల అభిప్రాయాలను విస్మరిస్తూ కార్పొరేట్ అనుకూల లేబర్ కోడ్‌లుగా మారుస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు, ఫిర్యాదులను చర్చించి పరిష్కరించేందుకు 1966లో ఏర్పాటైన జాయింట్ కన్సల్టేటివ్ మెషినరీ (జేసీఎం) నిర్వీర్యమైందని పేర్కొన్నారు. జేసీఎంలో ఉద్యోగుల తరపున తాను ప్రాతినిధ్యం వహించినప్పటికీ కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ జేసీఎం సమావేశాన్ని నిర్వహించలేదని విమర్శించారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల కార్పొరేటీకరణ, ఉద్యోగాల తొలగింపు పేరుతో పోస్టుల రద్దు, ఆ ఉద్యోగాలను కాంట్రాక్టర్లకు అప్పగించడం, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల పని నిరాకరణ, ఎంఈఎస్‌ను కార్పొరేటీకరించే ప్రతిపాదన, మూసివేత వంటి డిఫెన్స్ సివిల్ ఉద్యోగులను ప్రభావితం చేసే నిర్ణయాలన్నీ మోడీ ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకుంటుందని దుయ్యబట్టారు. ఆర్మీ వర్క్‌షాప్‌లు, డిపోలలో జీఓసీఓ మోడల్, కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఎక్స్-ట్రేడ్ అప్రెంటీస్‌లను ఉపయోగించుకోవడం వంటివి రక్షణ మంత్రిత్వ శాఖలో జరుగుతున్నాయని తెలిపారు.

తెలంగాణకు శత్రువు బీజేపీ

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆడిటోరియంలో జాతీయ పంచాయతీ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డితో కలిసి మంత్రి కేటీఆర్ హాజరై మాట్లాడారు. గ్రామీణాభివృద్ధిలో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలిచిందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి దేశంలోని ఏ రాష్ట్రంలో జరగడం లేదని తెలిపారు. దేశంలో 20 ఉత్తమ గ్రామ పంచాయతీల్లో 19 తెలంగాణ నుంచి ఉండటం గొప్ప విషయమన్నారు. ఈ ఘనత సర్పంచులు, కార్యదర్శులు, వార్డు మెంబర్లకే దక్కుతుందని తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో జరుగుతున్న గ్రామీణాభివృద్ధిపై, తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న గ్రామీణ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని బీజేపీ నాయకులకు సవాల్ విసిరారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో రాష్ట్రంలోని 27 మున్సిపాలిటీలకు అవార్డులు వచ్చాయని తెలిపారు. కరోనా వల్ల రాష్ట్రానికి రూ.లక్ష కోట్ల నష్టం వచ్చినా ఇక్కడ సంక్షేమ పథకాలు ఆగకుండా ముందుకు సాగుతున్నాయని స్పష్టం చేశారు. గ్రామస్థాయిలో సర్పంచులకు కొన్ని సమస్యలు ఉన్న మాట వాస్తవమేనని, త్వరలో అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని హామీ ఇచ్చారు. గ్రామస్థాయిలో పెండింగ్‌లో ఉన్న రూ.1300 కోట్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం వచ్చినప్పుడు ఉన్న తలసరి ఆదాయం కంటే ప్రస్తుతం రాష్ట్ర తలసరి ఆదాయం గణనీయంగా పెరిగిందని తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు జిల్లా కేంద్రంగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సీఎం కేసీఆర్ మొదటి సారి ఎమ్మెల్యే అయిన తర్వాత రాజేంద్రనగర్‌లోని ఎన్ఐఆర్డీలో గ్రామీణాభివృద్ధిపై శిక్షణ తీసుకున్నారని గుర్తు చేశారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రం రాకముందు గ్రామాల్లో సర్పంచుల పరిస్థితి ఘోరంగా ఉండేదని, సీఎం కేసీఆర్ దూర దృష్టితో చిన్న చిన్న తండాలను కూడా గ్రామపంచాయతీలుగా చేశారని గుర్తు చేశారు. 14, 15వ ఆర్థిక ప్రణాళికా సంఘంలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డుల్లో మొదట 100కు 99 అవార్డులు తెలంగాణకే వస్తే.. బీజేపీ ప్రభుత్వం కుట్ర చేసి వాటిని తగ్గించిందన్నారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించకుండా వివక్ష చూపుతోందన్నారు. ఈ అవార్డులు రావడానికి ఎంతో శ్రమించిన సర్పంచులు, కార్యదర్శులు, వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు అభినందనలు తెలిపారు. అనంతరం 'పల్లె ప్రగతి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. జాతీయ ఉత్తమ పంచాయతీలకు ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, ఐఏఎస్‌లు హనుమంతరావు, రఘునందన్ రావు, రాష్ట్రంలోని డిప్యూటీ కలెక్టర్లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

తొవ్వేయడమే

(మొదటిపేజీ తరువాయి)

సవరించింది. దీంతో సర్క్యులర్‌లో పేర్కొన్నట్టుగా రిజర్వ్ ఫారెస్టుల్లోని క్యాప్టివ్ బ్లాక్‌ల నుంచి తవ్వకాలు జరిపి వెలికితీసిన ఖనిజాల వాణిజ్య విక్రయానికి ఇది మార్గం సుగమం చేసింది. అయితే, రిజర్వు ఫారెస్టుల్లో క్యాప్టివ్ బ్లాక్‌ల నుంచి కమర్షియల్ మైనింగ్‌కు కేంద్ర అటవీ మంత్రిత్వ శాఖ సైతం క్లియరెన్సులు ఇవ్వడంతో దీనికి సంబంధించిన పూర్తి తంతు ముగిసినట్టయ్యింది.

మైనింగ్ కంపెనీల ప్రయోజనాలే ముఖ్యం

కేంద్రం నిర్ణయంపై ఇటు పర్యావరణవేత్తలు, సామాజిక కార్యకర్తలు, జంతుప్రేమికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది.

మైనింగ్ కంపెనీ యజమానుల లాభాలే ధ్యేయంగా మోడీ ప్రభుత్వం వారికి అనుకూలంగా పని చేస్తున్నదనీ, ప్రజాప్రయోజనాలు, పర్యావరణ నష్టాన్ని మాత్రం గాలికొదిలేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అటవీ ప్రాంతాల్లో కమర్షియల్ మైనింగ్‌కు గేట్లు ఎత్తడం ద్వారా మోడీ సర్కారు అక్కడి జీవావరణాన్ని, వన్య ప్రాణులను ప్రమాదంలోకి నెట్టేస్తున్నదని పర్యావరణవేత్తలు హెచ్చరించారు.

ఈ మైనింగ్‌తో అధిక మొత్తంలో ఖనిజ దోపిడీ జరుగుతుందని లాభాపేక్షలేని పర్యావరణ సంస్థ కన్జర్వేషన్ యాక్షన్ ట్రస్టుకు చెందిన దెబీ గోయెంకా ఆందోళన వ్యక్తం చేశారు. కంపెనీలు ఆర్థిక లాభాలే ధ్యేయం పని చేస్తూ పర్యావరణ పరిరక్షణకు తూట్లు పొడుస్తాయన్నారు.

అటవీ హక్కు చట్టం ఉల్లంఘన

ప్రకృతి వనరులు ప్రయివేటు కంపెనీలు, ప్రభుత్వానికి చెందవనీ, అవి దేశ ప్రజలకు చెందుతాయని దేశ సర్వోన్నత న్యాయస్థానం గతంలోనే స్పష్టం చేసిందనీ మైనింగ్ ద్వారా ప్రభావితమయ్యే తెగల కూటమి చైర్‌పర్సన్ రెబ్బాప్రగడ రవి అన్నారు. క్యాప్టివ్ మైన్‌ల నుంచి తవ్వకాలకు పబ్లిక్, ప్రయివేటు రంగ సంస్థలకు ఏకపక్షంగా అనుమతులిస్తున్నదనీ, కేంద్రం ప్రజా సంక్షేమం కోసమే పని చేస్తున్నదా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నదని రవి ఆందోళన వెలిబుచ్చారు. భారత రాజ్యాంగం ఆదివాసీ తెగలకు కల్పించిన హక్కులను ఇది ఉల్లంఘిస్తుందని నిపుణులు అన్నారు. క్యాప్టివ్ మైన్‌ల నుంచి వెలికి తీసిన ఖనిజాల వాణిజ్య అమ్మకం, తవ్వకాలకు సంబంధించి అక్కడి స్థానిక తెగల నుంచి అనుమతి తప్పనిసరనీ, అలా చేయకపోవడం పీసా చట్టం, 1995, అటవీ హక్కుల చట్టం, 2006ను ఉల్లంఘించడమేనని రవి తెలిపారు.

డిగ్రీ చూపించమంటే..జరిమానా?

(మొదటిపేజీ తరువాయి)

కేజ్రీవాల్ ట్వీట్ చేశారు.

మోడీ ఎంఏ డిగ్రీకి సంబంధించిన సమాచారాన్ని కేజ్రీవాల్‌కు అందచేయాలని గుజరాత్ వర్సిటీని ఆదేశిస్తూ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ (సీఐసీ) 2016లో ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై గుజరాత్ యూనివర్సిటీ హైకోర్టులో సవాలు చేసింది. ఈ పిటిషన్ విచారణలో భాగంగా సీఐసీ జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేసింది. ప్రధాని విద్యార్హత వివరాలను ఆర్‌టీఐ కింద కోరిన కేజ్రీవాల్ రూ. 25,000 జరిమానా చెల్లించాలని హైకోర్టు ఆదేశించింది.

15 ప్రశ్నాపత్రాలు లీక్ !

(మొదటిపేజీ తరువాయి)

నిందితులు ప్రవీణ్, రాజశేఖర్ పెన్‌డ్రైవ్‌లో గ్రూప్1, ఏఈ, ఏఈఈ, టౌన్ ప్లానింగ్, జేఎల్, డిస్ట్రిక్ట్ అకౌంట్స్ ఆఫీసర్ క్వశ్చన్ పేపర్లు లభ్యమయ్యాయి. ఈ పేపర్లను అమ్మేందుకు యత్నిస్తున్న క్రమంలోనే స్కాం బయటపడింది. ఈ క్రమంలో సురేష్, రమేష్, షమీమ్‌ను సిట్ ఐదు రోజులపాటు కస్టడీకి తీసుకుంది. మూడో రోజు కస్టడీలో వారి నుంచి మరిన్ని విషయాలు రాబట్టిన సిట్ అధికారులు టీఎస్‌పీఎస్సీ సభ్యులను విచారించాలన్న నిర్ణయానికొచ్చారు. ముగ్గురిలో ఇద్దరు టీఎస్‌పీఎస్సీ ఉద్యోగులు కావడంతో మరికొంతమందికి ఈ వ్యవహారంతో సంబంధాలుండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు.

ప్చ్..

(మొదటిపేజీ తరువాయి)

శుక్రవారం (మార్చి 31న) జేపీ నడ్డా సంగారెడ్డి పర్యటనకు వచ్చి ఆ పార్టీ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించాల్సి ఉంది. అయితే, గురువారం సాయంత్రం ఆయన పర్యటన రద్దు అయినట్టు, వర్చువల్ పద్ధతిలో ప్రారంభించనున్నట్టు రాష్ట్ర నాయకత్వం ప్రకటించింది. బీజేపీ అగ్ర నేతల తెలంగాణా టూర్లు తరచూ రద్దవుతుండటం ఆ పార్టీలో ఇప్పుడు పెద్ద చర్చనీయాంశంగా మారింది. తెలంగాణలో బీజేపీ ఏ మాత్రం పుంజుకోవడం లేదనీ, ఇతర పార్టీల నుంచి నేతల చేరికలు లేవని అమిత్ షా తెలంగాణ బీజేపీ నేతల మీద అసంతృప్తిగా ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ విషయంలో నడ్డా, అమిత్‌షా రాష్ట్ర నాయకత్వంపై గుర్రుగా ఉన్నారని విశ్వసనీయ సమాచారం. రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్, అర్వింద్, వివేక్, రాజాసింగ్, తదితర ముఖ్యనేతల మధ్య, పాతా-కొత్త నాయకుల మధ్య నెలకొన్న విభేదాలు తారాస్థాయికి చేరినట్టు ప్రచారం జరుగుతున్నది. పార్టీలో తమ మాటే చెల్లాలనే నాయకుల తీరుతో బీజేపీలో చేరాలనుకున్న నాయకులు కూడా వెనకడుగు వేస్తున్నారు. రాజాసింగ్ అయితే బీజేపీ ఆఫీసు వైపే కన్నెత్తిచూడటం లేదు. ఎమ్మెల్సీ కవితపై ఒంటికాలిపై లేచే ఎంపీ ధర్మపురి అరవింద్...ఆమెపై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యల్ని బహిరంగంగా తప్పుబట్టడం సంచలనంగా మారింది. బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఆట్..ఊట్ అంటూ గొప్పలకు పోతున్నా రాష్ట్రంలో 80కిపైగా నియోజకవర్గాల్లో బీజేపీకి సరైన అభ్యర్థులే లేరన్నది పచ్చినిజం. మిగతా నియోజకవర్గాల్లోనూ పాత, కొత్త నాయకుల మధ్య పొసగక అంతర్గత పోరు తీవ్రమవుతున్నది. హైదరాబాద్‌లో పట్టున్న ఏడెనిమిది నియోజకవర్గాల్లో ఎవరికివారే తామే ఎమ్మెల్యే అభ్యర్థులమంటూ ప్రచారం చేసుకుంటున్నారు. దీంతో ఆధిపత్యపోరు మొదలైంది. పరిస్థితి ఇలాగే ఉంటే గతంలో మాదిరిగా పట్టుమని పదిసీట్లు కూడా రాబోవని బీజేపీ రాష్ట్ర నాయకత్వాన్ని కేంద్ర నాయకత్వం హెచ్చరిస్తున్నా...ఇక్కడి నాయకులు ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో బీజేపీ బలపడేందుకు ఇతర పార్టీల నుండి వచ్చే చేరికల మీదే ఎక్కువగా ఆధారపడిందన్నది బహిరంగ రహస్యం. కానీ ఇతర పార్టీలకు చెందిన నాయకులు బీజేపీ వైపు చూడకపోవడంతో బీజేపీ శ్రేణులు తీవ్రంగా నిరాశ చెందుతున్నారు. రాష్ట్ర బీజేపీ నాయకులు చెప్తున్న మాటలకు, క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితికి పొంతన లేదని గ్రహించడం వల్లనే కేంద్ర నాయకత్వం రాష్ట్రం వైపు కన్నెత్తి చూడటంలేదు. రాష్ట్ర నాయకుల ఒత్తిడి మేరకు ఒకే అన్నా..చివరి క్షణాల్లో ఏదో ఒక సాకు చెప్పి తప్పించుకుంటున్నారు.

వనస్థలిపురం సీఐగా జలేందర్ రెడ్డి బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-వనస్థలిపురం

మల్కాజిగిరి జోన్ సీసీఎస్ విభాగంలో సీఐగా పని చేస్తూ అదనపు బాధ్యతగా ఎల్బీనగర్ సీసీఎస్ లో విధులు నిర్వహిస్తున్న డి జలేందర్ రెడ్డి రాచకొండ పోలీస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు మేరకు శుక్రవారం వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ సీఐగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన సీఐ కే సత్యనారాయణ మల్కాజిగిరి జోన్ సీసీఎస్ విభాగం, అదనపు బాధ్యతగా ఎల్బీనగర్ సీసీఎస్ సీఐగా శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. జలేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కష్టంతోనే ఫలితం సాధ్యమని, ఫిర్యాదు దారుడికి తగిన న్యాయం చేసినప్పుడే ఆ ఫలితాలు మనకు అందుతాయని సిబ్బందికి సూచించారు.

జ్యూవెలరీ షాప్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్ గుప్త



నవతెలంగాణ-నాగోల్

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36లో నూతనంగా ఏర్పాటు చేసిన వేగ శ్రీ జువెలర్స్ నూతన షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉప్పల ఫౌండేషన్ ఛైర్మెన్, ఐవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొన్నారు. ఆయనకు పుష్పగుచ్ఛం అంద జేసి, శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీని ఇన్ ఫ్రా మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ గుప్త, వేగ శ్రీ జ్యూవెలర్స్ డైరెక్టర్లు కళ్యాణ్, మనిదీప్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి ద్వారా పేదల బతుకుల్లో వెలుగులు

- రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- సరూర్‌నగర్, బడంగ్‌పేట్‌లలో కళ్యాణ లక్ష్మి చెక్కుల అందజేత



నవతెలంగాణ -సరూర్‌నగర్

కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా నిరుపేద బతుకులలో వెలుగులు నింపిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం సరూర్ నగర్ తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా హాజరై లబ్దిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సరూర్‌నగర్ , ఆర్కే పురం డివిజన్లకు చెందిన 63 మంది లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. అహర్నిశలు పేద ప్రజల కోసం ఆలోచిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, ఆర్డీవో సూరజ్, తహసిల్దార్ జయశ్రీ, ఆర్కే పురం డివిజన్ కార్పొరేటర్, బీఆర్ఎస్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిలు అరవింద్ శర్మ బేర బాలకిషన్, నాయకులు రాధా ధీరజ్ రెడ్డి, సరూర్నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ అనిత దయాకర్ రెడ్డి , బీఆర్ఎస్ అధ్యక్షులు మహేందర్ యాదవ్, లోకసాని కొండల్ రెడ్డి, సాజీద్, ఋషి, సలీం, రాఘవేంద్ర గుప్తా, నేలకొండ శ్రీనివాస్ రెడ్డి, శ్రీమన్నారాయణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్ : బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి పాల్గొని 75 కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 18 సంత్సరాలు నిండిన ఆడపిల్లల కోసం అమలు చేస్తున్న ఈ పథకంతో బాల్య వివాహాలు నిలిచిపోవడం జరిగిందన్నారు. మిషన్ భగీరథ పథకం కోసం రూ.12వందల కోట్ల రూపాయల నిధులను నియోజక వర్గానికి కోసం మంజూరు చేయడం జరిగిందని, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కోసం రూ. వంద కోట్ల నిధులను ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. డిప్యూటీ మేయర్ ఇబ్రం శేఖర్, కందుకూరు ఆర్డీఓ లక్ష్మినారాయణ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కృష్ణ మోహన్ రెడ్డి,బాలాపూర్ మండల తహశీల్దార్ జనార్ధన్ రావు,కార్పొరేటర్లు,కో ఆప్షన్ సభ్యులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛ ఘట్కేసర్ లక్ష్యంగా ముందుకు వెళ్లాలి

- ఘట్కేసర్ మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య



నవతెలంగాణ-ఘట్కేసర్

స్వచ్ఛ ఘట్కేసర్ లక్ష్యంగా ముందుకు వెళ్లాలని చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ తెలిపారు. ఘట్కేసర్ మున్సిపాల్టీ కార్యాలయంలో శుక్రవారం బడ్జెట్ సమావేశం చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిపారు. 2023-24 సంవత్సర సాధారణ అంచనా నిధులు చర్చించారు ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. 2023-24 సంవత్సర సాధా రణ అంచనా నిధులు రూ. 12 కోట్ల 60 లక్షల నిధులను కేటాయించుకోవడం జరిగిందన్నారు. ఆ నిధులను ఘట్కే సర్ మున్సిపాల్టీలోని కార్మికుల వేతనాలకు, కరెంటు బిల్లు లకు ఉపయోగించేందుకు అని తెలుపుతూ ఘట్కేసర్ సాధారణ మెయింటనెన్స్, అదేవిధంగా అన్ని వార్డుల అభివృద్ధి కి కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు పారదర్శక పాలన, మెరుగైన మౌలిక సదుపాయలు కల్పించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు. సంబంధిత అధికారులు వారికి అప్పగించిన పనులను సకాలంలో పూర్తి చేసి అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రతీ రెండు వార్డులకు ఒక చెత్త సేక రణ వాహనాన్ని ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచిం చారు. మున్సిపల్ పరిధిలో ప్రజలకు అవసరమైన తాగు నీరు, భూగర్భ డ్రయినేజీ, విద్యుత్ ఇతర సమస్యలు లేకుం డా చూడాలని సూచించారు. సీసీ, బీటి రోడ్లు, డ్రయినేజీ మొదలైన మరమ్మతు పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టా లన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ పలు గుల మాధవరెడ్డి కమిషనర్ వేమన రెడ్డి కౌన్సిలర్లు చందు పట్ల వెంకట్ రెడ్డి, కొమ్మగోని రమాదేవి, బొక్క సంగీత, బండారు ఆంజనేయులు , కొమ్మిడి అనురాధ సల్లూరి నాగజ్యోతి, చిలుగురి హేమలత, బర్ల శశికళ , కడుపొల్ల మల్లేష్ , జహంగీర్ , బేతల నర్సింగ్, కుతాది రవీందర్ , కో-ఆప్షన్ సభ్యులు పల్లె అరుణ , బొక్క సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోచారం మున్సిపల్ బడ్జెట్‌కు ఆమోదం



నవతెలంగాణ-ఘట్కేసర్

పోచారం మున్సిపల్ బడ్జెట్ సమావేశం శుక్రవారం మున్సిపల్ చైర్మెన్ బోయపల్లి కొండల్ రెడ్డి అధ్యక్షతన జరిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ. 21,33, 69,000 ల అంచనా ఆదాయంతో రూ. 20,77,65,000 అంచనా వ్యయంతో, రూ. 56,04,000 ముగింపు నిలువతో తయారుచేసిన ముసాయిదా బడ్జెట్‌ను కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈముసాయిదా బడ్జెట్‌ను చైర్ పర్సన్ బోయపల్లి కొండల్ రెడ్డి ప్రవేశపెట్టగా కౌన్సిల్ సభ్యులు, ఆప్షన్ సభ్యులు ప్రతీ అంశాన్ని చర్చించి, బడ్జెట్‌లో గానీ రెవెన్యూ ఆదాయం రూ. 18 కోట్ల 53 లక్షలలో 10 శాతం గ్రీన్ బడ్జెట్ కింద 1.85,39,000 కేటాయిస్తూ, నూతనంగా విలీనమైన ప్రదేశాలు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికిగాను బడ్జెట్లో 1/3 (3వ వంతు రూ.2,44,51,000)లు కేటాయిస్తూ, పురపాలక సంఘంలో మౌలిక వసతులు కల్పన అభివద్ధి పనులకు మొత్తం రూ. 9,22,04,000 లు కేటాయిస్తూ వాస్తవానికి దగ్గరగా ఉన్న ఆదర్శవంతమైన బడ్జెట్ ను రూపకల్పన చేసి ప్రవేశపెట్టిన ముసాయిదా బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదిస్తూ తీర్మానం చేశారు. ఇట్టి బడ్జెట్ సమావేశంలో సభ్యుల ందరూ తమ వంతు బాధ్యతగా క్రమశిక్షణతో చర్చలో పాల్గొని మున్సిపాల్టీ అభివద్ధికి పెద్దపీట వేస్తూ, మౌలిక వసతుల కల్పన అభివద్ధి ధ్యేయంగా సమావేశాన్ని విజయవంతం చేసినందుకు ముసాయిదా బడ్జెట్‌కు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినందుకు చైర్మెన్, కమిషనర్ కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యకమంలో కమిషనర్ సురేష్, వైస్ చైర్మెన్ రెడ్డియా నాయక్ , కౌన్సిల్ సభ్యులు గొంగళ్ల మహేష్ నర్రి ధనలక్ష్మి, చింతల రాజశేఖర్, ఆకిటి శైలజ, బైర హిమ, బాలగోని వెంకటేష్ గౌడ్, నల్లవెల్లి లక్ష్మి, బెజ్జంకి హరిప్రసాదరావు, సామల శ్రీలత, సుర్వి రవీందర్, అభవతిని సరిత, మోటుపల్లి పోచమ్మ, సుర్విసుదాలక్ష్మి, బద్దం మమతారాణి, కోఆప్షన్ సభ్యులు దాసరి శంకర్, అక్రమ్ అలీ మహమ్మద్, మున్సిపల్ ఏఈ కె నరేష్ కుమార్, మేనేజర్ టీ నర్సింలు, అకౌంటెంట్ ముని మహమ్మద్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడి కాదు ఇష్టపడి చదవండి



- మేయర్ జక్క వెంకట్ రెడ్డి

నవతెలంగాణ-బోడుప్పల్

విద్యార్థులు తమ చదువును భయంతో కాకుండా ఇష్టపడి చదవాలని అప్పుడే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని పీర్జాదీగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కాబోతున్నందున సందర్భంగా మేయర్ జక్క వెంకట్ రెడ్డి,కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి కలిసి విద్యార్థులకు హాల్ టికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని, మంచి మార్కులతో విజయాలు అందుకోవాలన్నారు. విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యంతో పాటు ఏకాగ్రత, పట్టుదల ఉన్నప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకోగలుగుతారని కావున విద్యార్థులు అందరూ కష్టపడి చదువుకోవాలన్నారు. కష్టపడితే ఏదైనా సాధించవచ్చుని..మీ భవిష్యత్తు కోసం మీ తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని మరువకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్, నాయకులు ఏనుగు మనోరంజన్ రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పదవులు శాశ్వతం కాదు ప్రజల ఆదరాభిమానాలే ముఖ్యం



- అధికారుల బాధ్యతా రాహిత్యంతో సమస్యలకు నెలవుగా బోడుప్పల్
- కార్పొరేషన్ కార్యాలయం ముందు ధర్నాలో బీఆర్ఎస్ కార్పొరేటర్ వెంకటేష్

నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తీర్మానాలు చేసిన పనులను పూర్తి చేయకుండా అధికారులు తత్సారం చేయాడం వల్ల అభివృద్ధి కుంటుపడిపోయిందని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 23వ కార్పొరేటర్ రాసాల వెంకటేష్ యాదవ్ మండిపడ్డారు. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనలో అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం రాసాల వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ నాడు దేశ వ్యాప్తంగా ఖ్యాతిని గడిస్తే నేడు అధికారుల తీరుతో పథకాల ఊసే లేకుండా పోయిందని అన్నారు. కార్పొరేషన్ లో ఎక్కడ చూసినా గుంతలు పడిన రోడ్లే దర్శనం ఇస్తున్నాయని తెలిపారు. ప్రధాన రహదారుల వెంట ప్రయాణం చేయాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణం కొనసాగించాల్సిన పరిస్థితి దాపురించిందని చెప్పారు. మూడేండ్ల క్రితం తీర్మానాలు చేస్తే పనులు చేయకుండా అధికారులు తాత్సారం చేయాడం వల్ల తమ పాలక వర్గానికి, మంత్రికి చెడ్డపేరు వస్తుందని ఇప్పటికైనా అధికారులు తమ తీరు మార్చుకుని ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూళ్ల చేసిన ప్రతి రూపాయిని ప్రజా అవసరాలకే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ అలూరి వాణికి వినతిపత్రం అందించారు. ఈ ధర్నా కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వారి పడతం లోకేష్,కె.రాంచందర్ యాదవ్, వెంకట్రావు, కృష్ణరెడ్డి, సురేందర్ రెడ్డి, కామగళ్ల నరసింహలతో పాటు కార్పొరేషన్ కు చెందిన వివిధ కాలనీల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కావాలనే రాద్ధాంతం చేస్తున్నారు..

కార్పొరేషన్‌లోని అన్ని డివిజన్ల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నా కూడా కొందరు కావాలనే రాద్ధాంతం చేస్తున్నారని మేయర్ సామల బుచ్చిరెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ రవి గౌడ్‌లు అన్నారు. గత ఫిబ్ర వరి నెలలో రోడ్డు మరమ్మత్తులు పూర్తి చేయాల్సి ఉండగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండడం అదే విధంగా కమిషనర్ మార్పుల కారణంగా కొద్దిగా ఆలస్యం అయ్యిందన్నారు. ఈ రోజు జరిగిన సర్వసభ్య సమావేశంలో రొడ్డు మరమ్మత్తుల కోసం అవసరమైన బడ్జెట్ కేటాయింపు చేసేందుకు గాను తీర్మానాలు చేసి పనులను త్వరగా పూర్తి చేసేలా చూడాలని ఆదేశించినట్టు తెలిపారు.

'పారిశుధ్య కార్మికులకు భద్రత ఇన్సూరెన్స్ కల్పించాలి'

- అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన సీఐటీయూ నాయకులు



నవతెలంగాణ-మీర్ పేట్

పారిశుధ్య కార్మికులకు భద్రత, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని సీఐటీయూ బాలాపూర్ మండల నాయకులు రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిక్ జైన్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ బాలాపూర్ మండల కన్వీనర్ పెంటయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుధ్య కార్మికులు ఎన్నో ఏండ్లుగా పనిచేస్తున్నారని ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఇన్సూరెన్స్ సౌకర్యం, భద్రత కల్పించలేదన్నారు. ఇప్పటి వరకు దాదాపు 20 మంది కార్మికులు చనిపోయారని తెలిపారు. కార్మికులపై ఆధారపడిన కుటుంబాలకు అధికారులు దహన సంస్కారాల కోసం కేవలం రూ 10వేలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుం టున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే కార్పొరేషన్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం, భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు దాసరి బాబు తదితరులు పాల్గొన్నారు.



తెలుగు సంవత్సరాది క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ- సరూర్‌నగర్

బైండ్ల భవనీయ సంఘం తెలుగు సంవత్సరాది నూతన సంవత్సర కాలెండర్‌ను రాష్ట్ర నాయకత్వం చేతులమీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బైండ్ల భవనీయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏదుల్ల గౌరీశంకర్ మాట్లాడుతూ తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకొని ప్రతీ సంవత్సరం తెలుగు క్యాలెండర్‌ను ఆవిష్కరించడం జరుగుతున్నదన్నారు. అంతే కాకుండా అంబేద్కర్ ఉత్సవ కమిటీకి చైర్మెన్‌గా ఇప్పటివరకు ఎస్సీ ఉపకులాల వారికి కేటాయించలేదని ఈ సారి ఎస్సీ ఉపకులాలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. దళిత బంధులో ఉప కులాల వారికి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ ఫలాలను అందరికి వర్తింపచేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏర్పుల భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏర్పుల గాలయ్య పులి యాదగిరి, రాష్ట్ర కార్యదర్శులు తగరం సత్యనారాయణ, ఇంద్రపల్లి సంజీవ, కోశాధికారి ముప్పాళ్ళ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మీర్‌పేట్ బడ్జెట్ సమావేశం రసాభాస





నవతెలంగాణ-మీర్‌పేట్

2023 - 24 ఆర్థిక సంవత్సరానికి మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ వార్షిక బడ్జెట్ సమావేశం మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహాన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిక్ జైన్ పాల్గొన్నారు. సమావేశం ప్రారంభం అయిన వెంటనే ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ కార్పొరేటర్లు.. పెంచిన ఇంటి పన్నులు నీటి బిల్లుల తగ్గించాలని, రెంటు వైర్ల సమస్యలు, వీధి కుక్కలను కట్టడి చేయడంలో, అక్రమ నిర్మాణాలు జరిగితే అపరాధ రుసుం విధించటంలో, కౌన్సిల్ మీటింగ్ నిర్వహించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని పోడియం ముందు ఆందోళన చేపట్టారు. అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను అందులో చర్చిద్దాం.. ప్రస్తుతానికి బడ్జెట్ సమావేశం సాగనివ్వండి అని కార్పొరేటర్లకు చెప్పారు. అయినా వినకపోవడంతో మేయర్, అడిషనల్ కలెక్టర్ సమావేశం నుంచి వెళ్లిపోయారు. దాంతో కాంగ్రెస్, బీజేపీ కార్పొరేటర్లు మున్సిపల్ కార్యాలయం ముందు దాదాపు రెండు గంటల వరకు నిరసన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ డౌన్ డౌన్, మంత్రి సబితా ఇంద్రారెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారం రోజుల్లో సమస్యల పరిష్కారం చేయకపోతే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా మేయర్ లేకుండానే రూ. 77 కోట్ల 71 లక్షల అంచనాతో బడ్జెట్‌ను అకౌంటెంట్ ప్రవేశపెట్టారు.

మరోవైపు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్ నాగేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. బీజేపీ ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ చల్లా కవిత బాల్ రెడ్డి, బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇంఛార్జి అందేలా శ్రీరాములు యాదవ్, బీజేపీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ కార్పొరేటర్లు నాయకులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిళ్లకు గురికాకుండా పరీక్షలు రాయాలి



- కార్పొరేటర్ అరుణ సురేందర్

నవతెలంగాణ-నాగోల్

ఎటువంటి మానసిక ఒత్తిళ్లకు లోను కాకుండా ప్రశాంత మనసుతో పరీక్షలు రాసి లక్ష్యాన్ని చేరుకోవా లని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవులు పదో తరగతి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం నాగోలు ప్రభుత్వ జిల్లా ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు హాల్‌టికెట్లు, పరీక్ష ప్యాడ్లను పెన్నులను వారు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక ప్రణాళిక ప్రకారం చదువుతూ సమయ పాలన పాటించాలని తెలిపారు. సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. నిద్రాహారాలు మాని సమయానికి భోజనం చేయకుండా ఉండి మానసి ఒత్తిళ్లకు గురికాకుడదని చెప్పారు. మంచి మార్కులను సాధించి పాఠశాలకు, మీ తల్లిదండ్రులకు మంచి పేరుకు తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు ,విద్యార్థులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి

నవతెలంగాణ-తుర్కయాంజల్

కార్యకర్తలు పార్టీకోసం కష్టపడి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు.శుక్రవారం బీఆర్ఎస్ తుర్కయంజాల్ మున్సిపాల్టీ అధ్యక్షుడు వేముల అమరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపాల్టీ పరిధిలోని, మన్నెగూడ లోని జేఎంఆర్ గార్డెన్‌లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకాగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి, డీసీసీబీబీ వైస్ చైర్మెన్ కొత్త కురుమ సత్తయ్య, రంగారెడ్డి జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కృషితో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేసుకున్న తర్వాత దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయనటువంటి పథకాలు మన తెలంగాణలోనే ప్రవేశపెట్టారన్నారు. పేద బడుగు బలహీన వర్గాలను ముందుకు తీసుకురావాలని ఉద్దేశంతో కళ్యాణ లక్ష్మి గానీ షాదీ ముబారక్ గానీ దళిత బంధు పథకంగానీ, ఆసరా పింఛన్లు గానీ అనేక పథకాలు ప్రవేశపెట్టి దేశం మొత్తం తెలంగాణ వైపు చూసే విధంగా చేశారన్నారు. ఇతర రాష్ట్రాలు కూడా తెలంగాణ అభివృద్ధిని చూసి ఈరోజు వారి రాష్ట్రాల్లో కూడా తెలంగాణలో ఉన్నటువంటి పథకాలను అమలు చేయాలంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ మున్సిపాల్టీ కౌన్సిలర్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ రామవత్ కళ్యాణ్ నాయక్,కౌన్సిలర్లు తాళ్లపల్లి సంగీత మోహన్ గుప్తా, సిద్దల జ్యోతి జంగయ్య, పుల్ల గుర్రం కీర్తన విజయానంద రెడ్డి,గుండా భాగ్యమ్మ ధనరాజ్,వేముల స్వాతి అమరేందర్ రెడ్డి, గడ్డంఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కందాడ ముత్యం రెడ్డి , మాజీ సర్పంచ్ కందాడ లక్ష్మారెడ్డి , సహకార బ్యాంకు డైరెక్టర్ సామ సంజీవరెడ్డి మండల రైతు కోఆర్డినేటర్ కందాల బల్దేవరెడ్డి,నాయకులు చెవుల దశరథ, బద్దం వెంకటరెడ్డి, కొండ్రు శ్రీనివాస్, కందాడ నరేందర్ రెడ్డి, గుండ్ల రాజిరెడ్డి, పోలిశెట్టి ప్రేమ్ కుమార్, కొండూరు వెంకటేష్, కార్యకర్తలు , మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

ఈత చెట్ల నరికివేతకు నష్టపరిహారం అందజేత



నవతెలంగాణ-హయత్‌నగర్

ఇటీవల విజయవాడ జాతీయ రహదారి ఇరువైపుల చింతల కుంట చెక్ పోస్ట్ నుంచి కొత్త గూడ జంక్షన్ వరకు రోడ్ విస్తరణలో 142 తాటి, ఈత చెట్ల నరికివేతకు నష్టపరిహారంగా ఆర్‌అండ్‌బీ శాఖ, ఎక్సైజ్ శాఖ కలిసి కల్లు గీత సొసైటీకి రూ. 1,39,728 చెక్కులను సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్ రావు, హయత్ నగర్ తహసీల్దార్ సంధ్యా రాణిలు శుక్రవారం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్కో సొసైటీ లక్ష ఈత, తాటి చెట్లు నాటాలని విజ్ఞప్తి చేశారు. రాబోయే రోజుల్లో తెలంగాణ స్వచ్ఛ మైన కల్లును అందించే రాష్ట్రంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్, ఎస్ఐలు సరళ, వెంకన్న, భాస్కర్, రవీందర్ రెడ్డి లు పాల్గొన్నారు.

రైతు హక్కుల సాధన సమితి అధ్యక్షురాలిగా మంజుల రెడ్డి



నవతెలంగాణ - సరూర్ నగర్

తెలంగాణ రైతు హక్కుల సాధన సమితి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా టేకుల మంజులా రెడ్డి నియామకమ య్యారు. ఈ మేరకు శుక్రవారం సమితి గౌరవ సలహాదా రుడు శీలం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు బాలు యాదవ్, అనుబంధ రంగాల కార్యదర్శి నగేష్ యాదవ్‌ల చేతుల మీదుగా నియామక పత్రాన్ని వారు అందుకున్నారు. ఈ సందర్భంగా మంజుల రెడ్డి మాట్లాడుతూ గత కొన్ని నెల లుగా సమితి రాష్ట్ర కార్యదర్శిగా చేస్తున్న సేవలను గుర్తించి అధ్యక్షురాలుగా ఎన్నుకోవడం మరింత బాధ్యత పెంచిం దన్నారు. నియామకానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞ తలు తెలిపారు. రైతు మహిళల్లో చైతన్యం తీసుకొస్తానని, రాష్ట్రస్థాయి రైతు మహిళా సంఘాలను ఏర్పాటు చేస్తానని తెలిపారు. రాష్ట్రంలో మహిళా సంఘాలను ఏర్పాటు చేసి వారికి చేయూతనిస్తానని చెప్పారు. ప్రస్తుత సమాజంలో మహిళలని సంఘటితం చేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. రాష్ట్ర అధ్యక్షులు బాలు యాదవ్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో పత్తి రైతుల సమస్యలపై పోరాటం, రైతు బంధు పథకాన్ని కౌలుదారులకు కూడా వర్తించే విధంగా ప్రయత్నం చేస్తున్నందుకు, గ్రామీణ వాతావరణంలో మహిళలు గ్యాస్ సిలిండర్ వాడడం వలన రోజుకు 30 రూపాయలు ఖర్చు అవుతుండడంతో కట్టెలపోయే వాడు తుండడంతో అనారోగ్యాల పాలవుతున్నారని గ్రామీణ ప్రాం త మహిళలకు గ్యాస్ బండపై 80 శాతం సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చేసిన పోరాటాలను గుర్తించి అధ్యక్షురా లుగా నియమించడం జరిగిందని తెలిపారు.

జోనల్ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్



నవతెలంగాణ-నాగోల్

నాగోల్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని కోరుతూ శుక్రవారం డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవులు జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ పంకజ్‌ను కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ మేరకు జోనల్ కమిషనర్ స్పందిస్తూ వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

హనుమాన్ జయంతి ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

- రాచకొండ సీపీ డి.ఎస్ చౌహాన్



నవతెలంగాణ-హయత్ నగర్

త్వరలో జరుగనున్న హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎల్బీనగర్ లోని కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో హనుమాన్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులకు కమిషనర్ పలు సూచనలు చేశారు. వారు మాట్లాడుతూ.. శాంతియుతంగా ఊరేగింపులు జరుపుకోవాలని, పోలీసులతో సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. రాచకొండ పరిధిలోని సున్నితమైన ప్రదేశాలలో ఉత్సవాల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తులు, ప్రజలు సంతోషంగా, శాంతియుతంగా వేడుకలు జరుపుకోవాలని, పోలీసులకు సహకరించాలని కమిషనర్ కోరారు. ఈ సమావేశంలో ఎల్ బీనగర్ ఏసీపీ శ్రీధర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అంజి రెడ్డి, హనుమాన్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు శివరాం, శశిధర్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

అవుషాపూర్‌లో ఘనంగా సీతారాముల కళ్యాణం



నవతెలంగాణ-ఘట్కేసర్

అవుషాపూర్ గ్రామంలో గురువారం రాత్రి సీతారా ముల కళ్యాణ మహోత్సవం అవుషాపూర్ దేవాలయ కమిటీ అధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మెన్ డాక్టర్ చామ కూర భద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవం అనం తరం బీఆర్ఎస్ ఘట్కేసర్ మండల ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్ రెడ్డి, అవుషాపూర్ దేవాలయ కమిటీ చైర్మెన్ పన్నాల మల్లారెడ్డి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్ర మంలో వివిధ పార్టీల నాయకులు, యువకులు, మహిళలు, అవుషా పూర్ గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

సొంత డబ్బుతో బోర్ మరమ్మతు చేయించిన కార్పొరేటర్



నవతెలంగాణ- నేరేడ్ మెట్

పాడైపోయిన పవర్ బోర్‌ను తన సొంత డబ్బుతో కార్పొరేటర్ మరమ్మత్తు చేయించి వినియోగంలోకి తెచ్చారు. వెంకటాపురం డివిజన్ పరిధిలోని కానాజీగూడలోకొద్ది నెలల క్రితం ఓ పవర్ బోరు పాడైపోయింది. దాంతో స్థానికులకు నీటి ఇబ్బందులు ఎదురయ్యాయి. విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ సబితా అనిల్ కిశోర్ గౌడ్ వెంటనే స్పందించారు. తన సొంత డబ్బులు వెచ్చించి బోరు మరమ్మత్తు చేయించి, ప్రజల వినియోగంలోకి తీసుకుని వచ్చారు.దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ కార్పోరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు

'ఆత్మీయ సమ్మేళనం జయప్రదం చేయండి'



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరి నియోజకవర్గం గౌతమ్ నగర్ పరిధిలోని లక్ష్మీ సాయి గార్డెన్‌లో ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు. అధ్యక్షతన శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న బీఆర్ఎస్ నాయకుల, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం జయప్రదం చేయాలని కార్పొరేటర్ మేకల సునీత రామూయాదవ్‌లు కోరారు. శుక్రవారం వారు ఆత్మీయ సమ్మళన కార్యక్రమ ప్రాంగణాన్ని పరిశీలించారు. ముఖ్య అతిథులుగా మేడ్చల్ జిల్లా అధ్యక్షులు షంబీర్ పూర్ రాజు, ఇన్‌చార్జి పల్లా రాజేశ్వర్ రెడ్డి విచ్చేయుచున్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి సర్కిల్ అధ్యక్షుడు పిట్ల శ్రీనివాస్, సీనియర్ నాయకులు రామూయాదవ్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతీ నీటి బొట్టు విలువైందే..

- జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.ఎం.సత్యనారాయణ
- అవగాహన కార్యక్రమాలు విజయవంతం



నవతెలంగాణ-సిటీబ్యూరో

దేశంలో ఎన్నో ప్రముఖ పట్టణాలల్లో ఇప్పటీ నీటి కొరత ఉందని, వివిధ ప్రాంతాలల్లో నీళ్ల లేక ప్రజలు అల్లాడుతున్నారని జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.ఎం.సత్యనారాయణ తెలిపారు. జలమండలి ఎంతో ప్రయాసతో సుదూర ప్రాంతాల నుంచి తరలిస్తున్న ప్రతీ నీటి చుక్కా విలువైందని, నీటిని వథా చేయవద్దని కోరారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా జలమండలి మార్చి 22 నుంచి 31 వరకు నీటి వథా అరికట్టడం, దాని విలువ, ప్రాముఖ్యతను తెలిపేందుకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బోర్డు పరిధిలో ఉన్న అన్ని ప్రదేశాలు, పాఠశాలలు, కమ్యూనిటీ సెంటర్లలో నిర్వహించిన అవగాహన కార్యాక్రమాల్లో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, రెవెన్యూ డెరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, డైరెక్టర్ రవికుమార్, స్వామీ, ఓఎస్‌డీలు సత్యనారాయణ, మనోహరాచారితోపాటు తదితర అధికారులు పాల్గొని విజయవంతం చేశారు. అయితే ఈ వేడుకలు శుక్రవారంతో ముగియడంతో జూబ్లీహిల్స్‌లోని రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పార్కులో ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.ఎం.సత్యనారాయణ, బోర్డు డైరెక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ నీటి సంరక్షణకు జలమండలి ఆరేండ్లుగా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోం దన్నారు. ఏటా నీటి దినోత్సవం జరపడంతో పాటు జల భాగ్యం, జలం-జీవం, వాక్ వంటి కార్యక్రమాలు చేపట్టిందని గుర్తు చేశారు. అవగాహన కార్యక్రమాల వల్ల ప్రజలకు నీటి ప్రాముఖ్యతను తెలియజెప్పామన్నారు. ఇందులో వివిధ స్వచ్ఛంద సంస్థలను సైతం భాగస్వామ్యం చేశామని తెలిపారు. అనంతరం నీటి సంరక్షణ కోసం పనిచేసిన పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ అవగాహన కార్యక్రమాల్లో మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ తో పాటు శాసన సభ్యులు సుధీర్ రెడ్డి, ముఠా గోపాల్, మాధవరం కృష్ణారావు, పలువురు కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు భాగస్వాములయ్యారు.

చలో ఢిల్లీకి బయల్దేరిన సీఐటీయూ మల్కాజిగిరి బృందం



నవతెలంగాణ-మల్కాజిగిరి

ఏప్రిల్ 5న న్యూఢిల్లీలో జరగబోయే మజ్దూర్ కిసాన్ సంఘర్షణ ర్యాలీలో పాల్గొనడానికి సీఐటీయూ మల్కాజిగిరి మండల బందం శుక్రవారం బయల్దేరింది. ఈ సందర్భంగా నేరేడ్‌మెట్ ఎక్స్ రోడ్ నందు మల్కాజిగిరి మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షులు ఎన్. శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాలు చలో పార్లమెంట్ (చలో ఢిల్లీ) తలపెట్టాయన్నారు.ఈ కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మేడ్చల్ - మల్కాజ్గిరి జిల్లా నాయకులు ఉన్న కృష్ణన్, బంగారు నర్సింగ్ రావు, మల్కాజిగిరి మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం మండల నాయకులు కే. నాగరాజు ,జె .వెంకన్న , లత ఎల్ల య్య , అంజమ్మ స్వరూప ,ఎల్లమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన వ్యవసాయ విద్యార్థులు



నవతెలంగాణ-కంటోన్మెంట్

గ్రామీణ ప్రాంతాలలో రైతులు పండిస్తున్న పంటలను ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు పరిశీలించారు. ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ విజయ్ తో కలిసి విద్యార్థులు సిద్దిపేట జిల్లా చిట్టాపూర్ గ్రామంలో రైతులు పండిస్తున్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ విద్యార్థులు తప్పనిసరిగా రైతుల అనుభవాలను తెలుసుకోవాలని సూచించారు. అలాగే విద్యార్థులు గ్రామ పంచాయితీ. కార్యాలయ. ఆవరణలో గ్రామానికి సంబంధించిన వనరులు సోషల్ మ్యాప్, కాలానుగుణ సమస్యల చెట్టు ఇంకా రైతులు సాగు చేస్తున్న వివిధ రకాల పంట వివరాలను చక్కగా ప్రదర్శించారు. అంతకుముందు ప్రొ.డా. విజయ్ రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ పీ రాజయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస విద్యార్థులు రష్మిత, ప్రీతి ప్రణయ, పూజిత జ్యోతి, విద్యాలేఖ, ఇంకా రైతులు పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం..



- బీఆర్ఎస్ కీసర మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

అన్నదానం...మహాదానం అని బీఆర్ఎస్ కీసర మండల అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్ రెడ్డి అన్నారు.కీసర గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన వన్నిగూడ గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం ఆవరణలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కీసర శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ చైర్మెన్ నాయకపు వెంకటేష్, మాజీ ఎంపీటీసీ రమేష్ గుప్తా, ఉప సర్పంచ్ లక్ష్మణ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

నీటి సంపును ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కాప్రా

ఏఎస్ రావు నగర్ డివిజన్‌లోని ఈ.సి.హెచ్ .సి. ఎస్. లిమిటెడ్ వారు హెూమి. జే. బాబా ఫంక్షన్ హాల్ వద్ద నిర్మించిన నీటి సంపును ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, కార్పొరేటర్ శిరీష సోమశేఖర్ రెడ్డిలు హాజరై ప్రారంభించారు. ఎం. బి.సి మాజీ చైర్మెన్ తాడూరి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి, కుషాయిగూడ ఏస్. ఐ . భద్రయ్య, బీఆర్ఎస్ ఏఎస్ రావు నగర్ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, రజక, నాయకులు మురళి పంతులు, ఏనుగు సీతారాం రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, ఈ .సి. హెచ్ .సి. ఎస్. లిమిటెడ్ మేనే జింగ్ కమిటీ అధ్యక్షులు రాజేశ్వరరావు, సెక్రెటరీ రామవ ూర్తి ,ఉపాధ్యక్షులు సంగయ్య స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు కార్పొరేటర్ ఆర్థిక సాయం



నవతెలంగాణ-జవహర్‌నగర్

జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ లోని 5వ డివిజన్ అయ్యప్ప కాలనీకి చెందిన పాండు రంగాచారి అనారోగ్యంతో శుక్రవారం ఉదయం కన్నుమూశారు. స్థానికులు, కుటుంబసభ్యుల విషయం తెలుసుకున్న 5వ డివిజన్ కార్పొరేటర్ ఏకే మురుగేష్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయంగా రూ. 5000.అందించారు.

దసరా సినిమాలో ఆ సన్నివేశాన్ని తొలగించాలి

- చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు బి. వి. సత్యనారాయణ జి. శ్రీనివాసులు

నవతెలంగాణ-కాప్రా

దసరా సినిమాలో అంగన్వాడి ఉద్యోగులను గుడ్లు దొంగతనం చేసే ఉద్యోగులుగా చిత్రీకరించిన సన్నివేశాన్ని తక్షణమే తొలగించాలని సినిమా పరిశ్రమ సెన్సార్ బోర్డును చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష , ప్రధాన కార్యదర్శి బి. వి. సత్యనారాయణ జి. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. 'నాని హీరోగా నటించిన దసరా సినిమాలో హీరోయిన్ పేరు వెన్నెల. తన పాత్రను అంగన్వాడీ టీచర్ గా చూపించారు. అయితే ఒక సందర్భంలో అంగన్వాడీ టీచర్ సెంటర్ తాళం తీసి కోడిగుడ్లు దొంగతనంగా తీసుకెళ్తున్నట్లు డైరెక్టర్ చూపించారు. ఇది అత్యంత దుర్మార్గం. చిరుద్యోగులను అవమానించడం తప్ప మరొకటి కాదు. ఐసీడీఎస్‌లో అంగన్వాడీ ఉద్యోగులు గత 45 సంవత్సరాల నుండి పనిచేస్తున్నారు. అతి తక్కువ వేతనాలతోటి పేదలకు సేవలు అందిస్తున్నారు. సుప్రీంకోర్టు, కాగ్ నివేదిక, 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ తదితర జాతీయ, అంతర్జాతీయ సంస్థలు అంగన్వాడీ ఉద్యోగుల సేవలను మెచ్చు కున్నాయి. ఐసీడీఎస్ ముందుకు నడవడానికి అంగన్వాడీ ఉద్యోగుల పాత్ర చాలా కీలకంగా పని చేస్తున్నది. ఇంత త్యాగం చేస్తున్న అంగన్వాడీ ఉద్యోగులను కించపరచడం సరైనది కాదు. అంగన్వాడీ టీచర్లను గుడ్లు దొంగతనం చేస్తున్నట్టు చిత్రీకరించిన సన్నివేశాన్ని సినిమా నుంచి సెన్సార్ బోర్డు తక్షణమే తొలగించాలి. ఆలస్యం చేస్తే రాష్ట్ర వ్యా ప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరిస్తున్నాం' అన్నారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీత హనుమంత్ రావును కలిసిన కార్పొరేటర్లు

నవతెలంగాణ-బేగంపేట్

పద్మ శ్రీ అవార్డు గ్రహీత స్వీకర్ ఉపకారం సంస్థ చైర్మెన్ పీ హనుమంత్ రావును రాంగోపాల్ పేట్ డివిజన్ కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్, బీజేపీ సీనియర్ నాయకులు చీర శ్రీకాంత్ శుక్రవారం మారేడ్ పల్లిలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హనుమత్ రావును ఆయన సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ మానసిన, అంగ వైకల్యం పొందిన వారికి ఆయన చేస్తున్న సేవను వారు కొనియాడారు.



హనుమంత్‌రావును సత్కరిస్తున్న కార్పొరేటర్ దీపిక

కంటోన్మెంట్ : మానసిక అంగ వైకల్యం పొందిన వారికి గొప్ప సేవలు చేస్తున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత స్వీకార్ ఉపకారం సంస్థ చైర్మెన్, డాక్టర్ పి హనుమంతరావును మారేడ్‌పల్లి సర్వసుకి కాలనీలో ఆయన నివాసంలో మోండా డివిజన్ కార్పొరేటర్ దీపిక శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపి అనంతరం ఆయనను సత్కరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానసిక వికలాంగుల అభ్యున్నతి కోసం డాక్టర్‌గా వారు చేస్తున్న సేవలు ఘనసీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో నరేష్ తదితరులు పాల్గొన్నారు



హనుమంత్‌రావును సత్కరిస్తున్న కార్పొరేటర్ సుచిత్ర శ్రీకాంత్

వేసవిలో దాహాన్ని తీర్చేందుకే చలివేంద్రాల ఏర్పాటు

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

వేసవిలో దాహాన్ని తీర్చేందుకే చలివేంద్రల ఏర్పాటు అని బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బీఎల్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మీర్ పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్‌లోని ఇందిరానగర్ చౌరస్తా వద్ద ఫ్రిజ్‌లతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వారు ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలివేంద్రాన్ని అందరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, ట్రస్ట్ ప్రతినిధి గుమ్మడి జంపాల్ రెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మహిళ ప్రెసిడెంట్ పరివిన్, కృష్ణవేణి, బోయిని శంకర్ యాదవ్, అశోక్, సముద్రాల కృష్ణమూర్తి,దూసరి నవీన్ గౌడ్, పూస రమేష్,నాదెండ్ల నవీన్, కుమార్, భరత్, లింగ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బండ రాళ్ల తొలగింపు పనుల పరిశీలన



నవతెలంగాణ-కాప్రా

మీర్ పేట హౌసింగ్ బోర్డు కాలనీ డివిజన్ పరిధిలోని నవోదయనగర్ కాలనీలో సీసీ రోడ్డు వేసే క్రమంలో బండ రాళ్ల తొలగింపును స్థానిక కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ బండ రాళ్లను తొలగించే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేసి కాలనీవా సులకు సౌకర్యార్థం అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. ఏఈ ప్రవంతి, వర్క్ ఇన్ స్పెక్టర్ చారి, బీఆర్ఎస్ నాయకులు భూపతి అశోక్, కొయ్యడ జయపాల్, దండెం నరేందర్, పర్వీన్, కొము రమ్మ మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు

తెలంగాణలో కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇవ్వండి

- కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్


తెలంగాణలో కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇస్తే మీ బతుకులు మారతాయని, ఎంతో బాగు పడతాయని కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ ప్రజలను కోరారు. శుక్రవారం వెంకటాపురం డివిజన్‌లో శివనగర్ పరిసర ప్రాంతాలలో ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీకి ప్రజల మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతకొద్ది రోజులుగా తాను మల్కా జిగిరి నియోజకవర్గంలో చేపట్టిన హత్ సే హత్ జోడో యాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. ఈసారి మల్కాజిగిరిలో కాంగ్రెస్ కు ఒక అవకాశం ఇస్తే అభివద్ధి సంక్షేమం అంటే ఏమిటో చూపిస్తానని చెప్పారు. ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్ర మంలో సీనియర్ నాయకులు చంద్రశేఖర్, డోలి రమేష్, నిమ్మ అశోక్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కష్ణ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్, కాంటెస్ట్ కార్పొరేటర్ సంజీవ్ కుమార్, శివకుమార్, ప్రభాకర్, సాయికుమార్, పవన్, పాండు, నిరంజన్, శ్రీనివాస్ గౌడ్, వీనస్ మేరీ, పద్మ , నిర్మల, విజయ, సరిత, సుభాషిని తదితరులు పాల్గొన్నారు

ఘనంగా నేమూరి మహేష్ గౌడ్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-కాప్రా

చరపల్లి డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్, బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి నేమూరి మహేష్‌గౌడ్ జన్మదిన వేడుకలు ట్రస్ట్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు బండారి లక్ష్మారెడ్డి ఆయనచే కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్, మీర్ పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయి జెన్ శేఖర్, ఆకుల మహేందర్ , బైరీ నవీన్ గౌడ్, భాస్కర్ గౌడ్, శంకర్, పవన్, శివ తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ ఆధ్వర్యం లో ఉప్పల్ నియోజకవర్గం ఎస్సీ మోర్చా 10 డివిజన్ల అధ్యక్ష కార్యదర్శుల ముఖ్య సీనియర్ నాయకుల సమావేశం సమావేశం జరిగింది. హెచ్. బి కాలనీకి చెందిన తాళ్లపల్లి లింగంను బీజేపీ ఉప్పల్ నియోజకవర్గ ఎస్సీ మోర్చా కన్వీనర్‌గా నియమించారు. నవతెలంగాణ-కాప్రా

కాంగ్రెస్ కార్యకర్తల నిరాహార దీక్ష



వతెలంగాణ-కంటోన్మెంట్

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పార్లమెంటరీ సభ్యత్వం రద్దు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం పీసీసీ సీనియర్ నాయకుడు ప్యారశాన్ని రామ్ కుమార్ అధ్యక్షతన జూబ్లీ బస్టాండ్ వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు నిరాహార దీక్ష చేశారు. కార్యక్రమానికి పీసీసీ కార్యదర్శి బొల్లు కిషన్, సీనియర్ నాయకులు డిబి దేవేందర్, బల్వంత్ రెడ్డి, రామ్ కుమార్, ఆయుబ్ ఖాన్, జిల్లా, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని రాహుల్ గాంధీ చేసిన యాత్రకు వచ్చిన ప్రజాస్పందనను బీజేపీ నాయకులు చూడలేక ఆయనపై తప్పుడు కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యత్వం రద్దు చేసిన మరుసటి రోజే రాహుల్ గాంధీ బంగ్లా ఖాళీ చేయించారని తెలిపారు. రానున్న

టెన్త్ విద్యార్థులకు హాల్‌టికెట్‌లు అందజేత



నవతెలంగాణ-సిటీబ్యూరో

విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రతినెల మూడవ శనివారం హైదరాబాద్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు వారి పిల్లలు, టీచర్లతో(పీటీఎం) సమావేశం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీనికి విద్యాశాఖ అధికారులు తమ పరిధిలోని పాఠశాలల సమావేశాలకు హాజరై.. తల్లిదండ్రులు వారి పిల్లల ప్రగతిపైనా, ఉపాధ్యాయుల బోధన విధానంపై సంతృప్తిగా ఉన్నారా లేదా తెలుసుకుంటున్నారు. ఈక్రమంలో శుక్రవారం జీబీహెచ్ఎస్ హిమాయత్‌నగర్‌లో నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్‌కు సీపీఎల్ అంబర్‌పేట్, జీహెచ్ఎస్ పోలీస్ బాయ్స్, జీబీహెచ్‌హెస్ హిమాయత్‌నగర్ పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ సమావేశానికి స్థానిక డిప్యూటీ ఈవో విజయలక్ష్మి హాజరై విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు హాల్ టికెట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్లు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

శిశు విహార్ స్టేట్ హోమ్‌లో ఏప్రిల్ 5వ తేదీన ఢిల్లీలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని స్టేట్ ఓం శిశు విహార్‌లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేష్ అన్నారు. ప్రతి కార్మికునికీ నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలనీ, రైతులకు గిట్టుబాటు ధర, ఉపాధి హామీ చట్టానికి నిధులు పెంచాలనీ, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా, రైతాంగ, వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ పార్లమెంటు ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జనరల్ సెక్రెటరీ ఎం.సుజాత, వర్కింగ్ ప్రెసిడెంట్ రాపర్తి అశోక్ పాల్గొన్నారు.

ప్రపంచ నీటి అవగాహనా దినోత్సవం



నవతెలంగాణ-ఓయూ

ఈ నెల 21 నుంచి జరుగుతున్న ప్రపంచ నీటి దినోత్సవ అవగాహనా కార్యక్రమంలో భాగంగా తార్నాక డివిజన్‌లోని నగర డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయం వద్ద ఎన్జీవో వేవ్స్ వారి అధ్వర్యంలో జలమే జనం, జలమే దానం, జలమే బలం, సుజలం సుఫలం అనే నినాదంతో శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ నీటిని వృథా చేయకుండా ఎలా కాపుడుకోవాలో నీరు మన రోజు వారి పనులకు ఎంత ఉపయోగకరము అని తెలిపారు. రాష్ట్రంలో నీటి ఎద్దడి లేకుండా కాళేశ్వరంమే కాకుండా ఎన్నో ఎత్తిపోతల ప్రాజెక్ట్ ల ద్వారా నీటి సమస్య సీఎం చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు శివరాం, సీఈఓ పి.విజయ్ కుమార్, ప్రాజెక్ట్ మేనేజర్ కె.వినోద్ కుమార్, జల మండల్ అధికారులు డీజీఎం కృష్ణ ప్రసాద్, రజిని, మేనేజర్ నిఖిత పాల్గొన్నారు.

మనుధర్మ శాస్త్రాన్ని రద్దు చేయాలి

- అదానీ, అంబానీ ఆస్తులను పేదలకు పంచాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



నవతెలంగాణ-ఓయూ

బీజేపీకి హిందువులపై ప్రేమ ఉంటే దేశంలో కులవ్యవస్థకు పునాది అయిన మనుధర్మశాస్త్రాన్ని రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఓయూ దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రథమ మహాసభల్లో ఆయన మాట్లాడారు. అసమానతలకు, ఆకలి, అంటరానితనం, అభద్రతా, కులోన్మాదం, మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. దేశ సంపద మొత్తం అదానీ, అంబానీ లాంటి కుబేరుల చేతుల్లో ఉందనీ, వారి అవినీతి, అక్రమాలకు దేశ ప్రధాని నిస్సిగ్గుగా సమర్థించడం అవాంఛనీయం అన్నారు. ఒకవైపు సంపన్నులు మరింత సంపన్నులుగా మారుతుంటే, పేద ప్రజల ఆకలి కేకలు మోడీ, షాలకు వినపడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆకలి సూచిలో, అసమానతల్లో మరింత దిగజారుతూ, ఆకలి, అంటరానితనం, అసమానతలు నిరంతరం పెరుగుతుంటే, దేశంలో బీజేపీ రామరాజ్యం ఎలా తెస్తుందని ప్రశ్నించారు. దేశంలో ఉన్న సహజ సంపదను, మోడీ సహజ మిత్రులైన అదానీ, అంబానీలు కొల్లగొడుతూ తమ అక్రమ సంపాదనను పెంచుకుంటూ ఉంటే, పార్లమెంటు సాక్షిగా ప్రధాని మోడీ మౌనం వహించారన్నారు. అదానీ, అంబానీల ఆస్తులను వెంటనే కేంద్ర ప్రభుత్వం జప్తు చేసి దేశంలోని పేద ప్రజలకు, దళితులకు, గిరిజనులకు, ఆదివాసీలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో బుద్ధుని ఆలోచనలు, మార్క్సిజం, అంబేద్కరిజం అన్నీ శ్రామికవర్గం, పేదలు, దళితులు, అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడినవే అన్నారు. సమత, మమత, మానవతా పునాదిగా అసమానతలు లేని నవ సమాజం నిర్మాణం కోసం, ప్రజా పోరాటాలు ఉధృతం చేయాలన్నారు. ఆలిండియా దళిత్ రైట్స్ ఫోరం జాతీయ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రామమూర్తి మాట్లాడుతూ బీజేపీ హయాంలో దేశంలో దళితుల పైన నిత్యం దాడులు జరుగుతున్నప్పటికీ వాటిని నివారించడంలో కేంద్రం విఫలమైందన్నారు. దళితులు, ఆదివాసీలు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలు ఉండడానికి ఇల్లు, తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్టలు సైతం లేవన్నారు. వారికోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నా వారికి చేరడం లేదన్నారు. దేశంలో అవినీతి, ధరల బారాలు పెరిగిపోయి పేదల బతుకులు చితికిపోయాయన్నారు. మే 30వ తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా ఉంటుందనీ, ఈ ధర్నాకు అధిక సంఖ్యలో తెలంగాణ నుంచి హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.బాల మల్లేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల నరసింహ, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు అనిల్ కుమార్, రాజు, కుమార్, రాములు పాల్గొన్నారు.

తాగునీటిలో మురుగు నీరు..

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మురుగు నీటి బాటిళ్ళతో నిరసన



నవతెలంగాణ-ధూల్‌పేట్

కొన్ని రోజులుగా తాగే మంచి నీటిలో మురుగు నీరు కలువడాన్ని వెంటనే అరికట్టాలని సీపీఐ(ఎం) డివిజన్ కార్యదర్శి కృష్ణ నాయక్ డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో రవీందర్ నాయక్ నగర్ కాలనీలో మురికి నీళ్ల బాటలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగే మంచినీళ్లలో మురికి నీళ్ల కలవడంతో ప్రజల అనారోగ్యం పాలవుతున్నరన్నారు. వారం రోజులకుపైగా జంగంమెట్ డివిజన్లో పలు ప్రాంతాల్లో రవీందర్ నాయక్ నగర్ కాలనీలో మంచి నీళ్ల మురికినీళ్లుగా వస్తున్నా అధికారులు పట్టించుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికే ప్రజల జీవితాల్లో కరోనా వల్ల ఎన్నో రకాల అనారోగ్యాల సమస్యలు వస్తున్నా, మరో వైపు కాలుష్యమైన తిండి పదార్థాలు కల్తీలు తాగే మంచి నీళ్ల కూడా కాలుష్యం రావడం వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఇప్పటికీ తాగే నీళ్ల డబ్బులుతో కొనుక్కునే పరిస్థితి ఏర్పడిందన్నారు. కనీసం వంట చేసుకోవడానికి కూడా నీళ్ల లేని పరిస్థితిలో ప్రజలు ఇబ్బందికి గురవుతున్నారన్నారు. కాలుష్యమైన నీళ్ల రాకుండా ఇప్పటికైనా అధికారులను చర్యలు తీసుకోవాలన్నారు. నిరసనతో వాటర్ బోర్డ్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, స్థానిక ప్రజలు సోనా, జామున, విజయ, సునీత, బుజ్జి, హాసియా, మంగ, జ్యోతి, స్వరూప, లక్ష్మి, మంజు, పార్టీ నాయకులు శ్రీను, ఈశ్వర్, రాహుల్, శివమణి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

'రబీ' పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



నవతెలంగాణ-అడిక్‌మెట్

అకాల వర్షాలతో నష్టపోయిన రైతుకు రైతు వారీగా అంచనా వేసి నష్టపరిహారం చెల్లించి రబీ సీజన్‌లోని అన్ని రకాల పంటలను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలి అని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేసింది. శుక్రవారం విద్యానగర్ లోని మార్క్స్ భవన్ లో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం అధ్యక్షులు రాయల చంద్రశేఖర్ అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు రాయల చంద్రశేఖర్, రాష్ట్ర బాధ్యులు కె.రంగారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ఒకరిపై ఒకరు నిందలు వేసుకోవడమే తప్ప రైతులకు సంక్షేమ పథకాలు అమలు జరిపేది మేమే అన్నట్టు గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారే తప్ప మరొకటి కాదన్నారు. రెండు ప్రభుత్వాలూ రైతుకు చేసిందేమీ లేదన్నారు. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తామనీ, రైతుకు రెండింతల ఆదాయం తెచ్చి పెడతామని 2014 ఎన్నికల ప్రణాళికలో పేర్కొని ఎనిమిదేండ్లు గడిచిపోయినప్పటికీ రైతు వ్యతిరేక విధానాలను అవలంభిందే తప్పా రైతు పండించిన పంటకు ఎంఎస్‌పీ మినిమం సపోర్ట్ ప్రైస్ గ్యారెంటీ చట్టం ఊసే లేదన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు గుప్పిట్లో పెట్టడానికి ప్రయత్నం చేసి రైతులు ఆందోళనకు తలవగి తాత్కాలికంగా వెనక్కి తగ్గారన్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఏకకాలంలో రూ.లక్ష రుణమాఫీ చేస్తానని హామీనిచ్చిందే తప్ప అమలు చేసింది లేదన్నారు. వడగళ్ళ వానలో రైతు లక్షలాది రూపాయలు నష్టపోతే రూ.10 వేలు ఆర్థిక సాయం చేసి గొప్పలు చెప్పుకోవడం సబవా అని ప్రశ్నించారు. ప్రకృతి నష్టాల వల్ల 33శాతం రైతు నష్టపోతే తప్ప నష్ట పరిహారం ఇవ్వరాదని ఉన్న నిబంధనలు నేటికీ కొనసాగుతున్నాయనీ, ఆ నిబంధనలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

శోభాయాత్రలో గాడ్సే ఫోటోను ప్రదర్శించడం సిగ్గుచేటు

నవతెలంగాణ-అడిక్‌మెట్

ఎమ్మెల్యే రాజాసింగ్ నిర్వహించిన శోభాయాత్రలో గాడ్సే ఫోటోను ప్రదర్శించడం సిగ్గుచేటు అని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ అన్నారు. శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీరామనవమి సందర్భంగా హైదరాబాదులో ఎమ్మెల్యే రాజాసింగ్ నిర్వహించిన శోభాయాత్రలో మహాత్మా గాంధీని చంపిన గాడ్సే ఫోటోను ప్రదర్శించడం, ఊరేగించడం సిగ్గుచేటు అన్నారు. ఈ చర్య వీరి నకిలీ దేశభక్తిని స్పష్టం చేస్తుందన్నారు. గాంధీని చంపిన గాడ్సే ఫోటోను శోభాయాత్రలో ప్రదర్శించడం ద్వారా వీరు ఏ రకమైన సందేశం ఈ సమాజానికి ఇవ్వదలుచుకున్నారో ఎమ్మెల్యే రాజాసింగ్ చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు మతోన్మాదాన్ని రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ది పొందడానికి తహతహలాడుతున్నాయన్నారు. గాడ్సే ఫోటోను ప్రదర్శించి, ఊరేగించడమే వీరి దేశభక్తా అని ప్రశ్నించారు. అంటే హంతకులను సన్మానించడమే వీరి విధానం అనేది తేటతెల్లమవుతుందన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి రాజ్యాంగాన్ని మార్చివేసి మనుస్మృతిని అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నాయన్నారు. నేడు గాడ్సే ఫోటోను ఊరేగించడం, ఇటీవలనే హమారా ప్రసాద్ అనే ఆర్‌ఎస్‌ఎస్ వ్యక్తి అంబేద్కర్ బతికి ఉంటే చంపి వేసే వాడినని మాట్లాడటం ఇవన్నీ వీరి ఫాసిస్టు పోకడలను తెలియజేస్తున్నాయన్నారు. ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండించాలని ప్రజలు, ప్రజాస్వామిక వాదులకు విజ్ఞప్తి చేస్తున్నట్టు తెలిపారు. ఈ ఘటనకు కారణమైన వారిని గుర్తించి వెంటనే అరెస్టు చేయాలనీ, ఎమ్మెల్యే రాజాసింగ్ శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ అసోసియేషన్ మొదటి వార్షికోత్సవం



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

మహిళలందరికీ అండగా నిలబడుతూ సహకారం అందించాలని పూర్వ సమాచారశాఖ కమిషనర్, ప్రియదర్శిని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయనిర్మల అన్నారు. కోఠి ఉస్మానియా మెడికల్ కళాశాల ఆవరణలోని అల్యూమిని భవన్ ఆడిటోరియంలో తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఉమెన్ ఎంపవర్మెంట్ అసోసియేషన్ మొదటి వార్షికోత్సవాన్ని వ్యవస్థాపక అధ్యక్షులు కె.శశి శ్రీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అందరినీ ఒకే వేదిక మీకు తీసుకురావడం అభినందనీయమన్నారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కె.శశి శ్రీ మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో ఉన్న ప్రతి మహిళా ఉద్యోగికి ఈ అసోసియేషన్ అండగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సెలబ్రేషన్స్ నిర్వహించారు. పలు పోటీలను నిర్వహించారు. అనంతరం పలువురు మహిళలను శాలువా, షీల్డ్‌లతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సుల్తాన్ బజార్ మెటర్నిటీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజలక్ష్మి, పేట్లబుర్జు మెటర్నిటీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ మాలతి, సైఫా బేగం, డాక్టర్ గీత, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.విజయ నిర్మల, ఉపాధ్యక్షులు డాక్టర్ అనితారెడ్డి, డాక్టర్ రాధిక, కోశాధికారి స్ఫూర్తి, సంయుక్త కార్యదర్శి డాక్టర్ షీలారాణి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎం.కల్పన, ఈసీ మెంబర్లు లావణ్య, రమాదేవి, లలితారాణి, నర్సుబాయి, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

సోమాజిగూడలో 'వేగా శ్రీ గోల్డ్ అండ్ డైమండ్స్ ఆక్స్' ప్రారంభం



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఆడవారి మనసు దోచే ప్రపంచం ఏదైనా ఉంది అంటే నగల ఆభరణాల ప్రపంచం ఒక్కటేనని ప్రముఖ నటి ప్రజ్ఞా జైస్వాల్ అన్నారు. ప్రపంచంలో ఆడవారి మనసుకు నచ్చే ప్రసన్న నగలను అందించే మేటి సముదాయం వేగా శ్రీ గోల్డ్ అండ్ డైమండ్స్ ఆక్స్ ప్రస్తుత ప్రజల ముఖ్యంగా మహిళల శైలికి వివాహ వేడుకలకు హృదయ నగలను ఆభరణాలను డైమండ్స్‌ను అందించ డంలో ప్రసిద్ధి చెందిందని తెలిపారు. శుక్రవారం ఈ సముదాయాన్ని ఆమె సోమాజిగూడలో ప్రారంభించి మాట్లాడారు. వేగా శ్రీ గోల్డ్ అండ్ డైమండ్స్ ఆక్స్ సంస్థ చైర్మన్ వనమా నవీన్, ఎండీ. మణిదీష్ యోచురి, కల్యాణ్ కుమార్ గొల్ల, శ్రీనివాస్, సుధాకర్‌తో కలిసి ఆభరణాల సముదాయాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నా రు. ఈ వేగుళ్ళ ఆడవారి మనసుదోచే బంగారు, వజ్రాలు, వక్క, గుంజన్, విక్టోరియన్ ఆభరణాలు అబ్బురపరిచే శ్రేణిలో కస్టమర్లకు అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు.

ఓయూ ఈఈ విభాగం హెడ్‌గా విద్యాసాగర్



నవతెలంగాణ-ఓయూ

ఓయూ ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రిక్ ఇంజినీరింగ్ (ఈఈ) విభాగం నూతన హెడ్‌గా ప్రొ.ఈ. విద్యాసాగర్ నియమితులయ్యారు. ఆయన గతంలో ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా, ప్రస్తుతానికి విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, డైరెక్టర్ ఆఫ్ ఐటీ అండ్ ఈసీ ఓయూ బాధ్యతలుగా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు హెడ్‌గా బాధ్యతలు స్వీకరించారు. అయినను విభాగం అధ్యాపకులు, విద్యార్థులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేసి సత్కరించారు. సమిష్టి కృషితో విభాగం ఉన్నతికి కృషి చేస్తానని ఆయన చెప్పారు.



బీఆర్ఎస్ అంబర్‌పేట డివిజన్ టీఆర్ఎస్వీ వైస్ ప్రెసిడెంట్ చేగురి దినేష్ గంగపుత్ర జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మహేష్ ముదిరాజ్, రంగు ఉదయ్ గౌడ్, లవంగు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-అంబర్‌పేట

'ఫ్లోర్ కర్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులు'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఆంధ్రప్రదేశ్ కర్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 3వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, ఫ్లోర్ కర్లింగ్ ఛాంపియన్ షిప్-2023 పోటీలను నెల్లూరు జిల్లాలోని ఎల్ఎల్ఎఫ్ స్కూల్ వేదయపాలెంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఒలంపిక్ గేమ్‌కు తెలంగాణ నుంచి చక్రట్ సాయి హన్సిక, ఆర్.క్రాస్విన్, ఆర్.మోనాలిసా, మధిరాజు, నాగ అక్షయలు సిల్వర్ మెడల్‌ను గెలుచుకున్నారనీ, ఆర్ఎస్ కీర్తి మిశ్రా, కోన దివ్యరాణి, ఏ.భవాని, పి.అతర్వా బ్రొంజ్ మెడల్ పథకాన్ని సాధించినట్టు కోచ్‌లు భాను, లక్ష్మీ చైతన్య శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఫ్లోర్ కర్లింగ్‌లో సిల్వర్, బ్రొంజ్ పథకాలు సాధించినందుకు వారు ఆనందం వ్యక్తం చేశారు. ఫ్లోర్ కర్లింగ్ గేమ్ నేషనల్ ఛాంపియన్ షిప్ మే నెలలో అరుణాచల్ ప్రదేశ్ లో జరుగుతాయనీ, దానికి టీమ్స్ సిద్ధం చేస్తున్నామన్నారు. ఇది నూతన గేమ్ అయినప్పటికీ పిల్లలు చాలా త్వరగా నేర్చుకుని మెడల్స్ సాధించడం సంతోషకరమన్నారు. వీరిని ఇంకా ముందుకు తీసుకెళ్లేందుకు తమ శాయశక్తుల కృషి చేస్తున్నామని వారు వెల్లడించారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి : శ్రీనివాస్‌గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దూసరి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం గోల్నాక డివిజన్ కృష్ణానగర్‌లో పాదయాత్ర నిర్వహించి స్థానిక ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు రెండు, మూడు రోజుల నుండి మంచినీటి సరఫరా సరిగా లేక ఇబ్బందులకు గురవుతున్నట్టు స్థానికులు చెప్పడంతో వెంటనే స్పందించి ప్రస్తుతానికి ట్యాంకర్ ద్వారా మంచి నీటిని సరఫరా చేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు. కృష్ణానగర్ గవర్నమెంట్ స్కూల్ ట్రాన్స్‌ఫార్మర్ పిల్లలకు ఇబ్బందికరంగా ఉండి ప్రమాదంగా మారడంతో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఫినిషింగ్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. స్కూల్ బాత్రూంలో సరిగా లేవని స్థానిక విద్యార్థులు తెలపడంతో సమస్యను పరిష్కరించాలని సూచించారు. రోడ్లన్నీ క్లీన్‌గా ఉంచాలనీ, డ్రయినేజీ సమస్యలు రాకుండా చూడాలని స్థానిక అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బస్తీ నాయకులు బాలరాజ్, అరవింద్, యూసుఫ్ షరీఫ్, సల్మాన్, రఫిక్, అసాద్ పాల్గొన్నారు.

డిపో లాభాల్లో ఏహెచ్ పాత్ర క్రియాశీలకం



నవతెలంగాణ-హైదరాబాద్

డిపో లాభాల్లో రాణించేందుకు ఏ హనుమంత్ రెడ్డి పాత్ర కీలకమని ఆర్టీసీ హైదరాబాద్ - 1 డిపో మేనేజర్ డి.కృష్ణారెడ్డి అన్నారు. హైదరాబాద్ - 1 డిపోలో అధికారులు ఏ హనుమంత్ రెడ్డి, ఏ నరసింహలు విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన సందర్భంగా డిపోలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిపోలో తోటి ఉద్యోగులతో పాటు తన విధులు బాధ్యతగా నిర్వహిస్తూ అన్నింటిలో ముందుండేవారన్నారు. ఈ డిపో నుంచి తన అనుభవం ద్వారా శబరిమలై ప్రత్యేక స్పెషల్ బస్సులను కల్పిస్తూ 16 బస్సులను అదనంగా నడిపించి డిపోను లాభాల్లో మొదటి స్థానంలో నిలిచేందుకు ఆయన చేసిన కృషి మరువలేనిది అన్నారు. డిపోకు ఏహెచ్ రెడ్డి, నరసింహ చేసిన సేవలు ఎనలేనిమన్నారు. తోటి ఉద్యోగులతో ఆయన మదత్వాన్ని, స్నేహశీల, సన్నిహిత వైఖరిని పలువురు జ్ఞాపకం చేసుకున్నారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ తో పాటు తోటి ఉద్యోగులు పూలమాలతో సత్కరించి, అభినందించారు. అంతకంటే ముందుగా తోటి ఉద్యోగులు సంగీతముతో పలు పాటలు పాడుచు, అందరినీ సంతోషపరిచారు. ఈ కార్యక్రమంలో డిపో ఇన్స్పెక్టర్ స్వాతి, తోటి ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్ పో తో 'విద్యా'ర్థుల సృజనాత్మకత వెలికితీత



నవతెలంగాణ-హైదరాబాద్

ఎక్స్ పో సైన్స్ ప్రదర్శనలు విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఎంతో దోహదపడతాయని ప్రముఖ సంఘ సేవకులు ఎం.అరవింద్ కుమార్, జియాగూడ కార్పొరేటర్ బోయిని దర్శన్, కులుసుం పుర ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్ అన్నారు. జియాగూడ విద్యా శ్రీ హైస్కూల్లో 35వ ఎక్స్ పో - 2003 సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన స్కూల్ చైర్మన్ శ్యామ్ వేరా, డైరెక్టర్ సునీత వేరాలతో కలిసి దీపారాధన చేసి ప్రారంభించారు. విద్యార్థులు వివిధ భాషల, సబ్జెక్టులతో కూడిన సృజనాత్మకమైన ప్రదర్శనను తిరిగి తిలకించారు. విద్యార్థులు ప్రదర్శించిన వాటి వివరాలను విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు వారి మనోవికాసాన్ని వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ ప్రదర్శనలు ఎంతో అవసరం అన్నారు. అప్పుడే వారిలో ప్రతిభకనుగుణంగా ఉపాధ్యాయుల ప్రోత్సహించి రాణించేందుకు కృషి చేస్తారన్నారు. పేద విద్యార్థులకు విద్యానందించాలని ఉద్దేశంతో మురికివాడలో స్కూల్ ఏర్పాటు చేసి నిరుపేద కుటుంబాలు ఎంతోమందికి విద్య శ్రీ విద్యానందించి ఉన్నత స్థానాలకు ఎదిగించిందని గుర్తు చేశారు. విద్య వైజ్ఞానికం సాంకేతికతను అందిపుచ్చుకునేలా క్రమశిక్షణతో కూడిన బోధనలు బోధిస్తూ విద్యనే ఏకైక లక్ష్యంగా ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రస్తుతం వ్యాపారమే లక్ష్యంగా కొనసాగుతున్న విద్యాసంస్థల్లో నేడు కూడా ఎక్కడా ఎలాంటి బ్రాంచీలు ఏర్పాటు చేయకుండా ఇదే ప్రాంతంలోనే ఉంటూ 35 ఏండ్లుగా ఎంతో మంది నిరుపేదల కుటుంబాల విద్యార్థులకు ఉన్న విద్యను అభ్యసించి తమదైన శైలిలో మంచి ముద్రను వేసుకుందన్నారు. రాష్ట్రంలోనే ఎస్ఎస్సి ఫలితాల్లో మొదటి స్థానాన్ని అధిరోహించి నాటి ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి కేసీఆర్‌తో ప్రతి పురస్కారమును అందించుకున్న ఘనత విద్యా శ్రీ దక్కించుకుందని వారు అభినందించారు. స్కూల్ చైర్మన్ శ్యామ్ వేరా మాట్లాడుతూ ఈ ఎక్స్ పోలో సుమారు 500 కు పైగా ప్రదర్శనలు విద్యార్థులు ఏర్పాటు చేశారన్నారు. చదువుతోపాటు విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. ముఖ్యంగా సైన్స్ ఎగ్జిభిషన్‌లు, క్రీడా పోటీలు, డిజిటల్ కంప్యూటర్ విద్య, సైన్స్ లాబ్ ప్రత్యేక తరగతులతో శిక్షణ కల్పిస్తున్నామన్నారు. ప్రదర్శనలో రామాయణం, మహాభారతం, తెలంగాణ వంటలు, పండుగలు, రాకెట్ ప్రయోగాలతోపాటు టెక్నాలజీ, పచ్చదనంతో లాభాలు, యోగ, కరాటే, డ్యాన్సులు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివ రత్నం, డివిజన్ బీజేపీ అధ్యక్షులు జె.లక్ష్మీనారాయణ, టీడీపీ అధ్యక్షులు నర్సింగరావు, గోల్కొండ జిల్లా డైరీ సెల్ కన్వీనర్ బి.శివకుమార్ యాదవ్, బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్ యాదవ్, రాజు పాల్, టి నర్సింగరావు, ఈశ్వర్ సింగ్, దిలీప్ కుమార్, బాబి, తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి 14వ తేదీ వరకు క్రికెట్ టోర్నమెంట్



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్స్ కృష్ణ, అంబేద్కర్, నరసింహ, చంద్రశేఖర్, వంశీధర్ ఆధ్వర్యంలో మహనీయుల జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఏప్రిల్ 05 నుండి 14 వరకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్‌నుఉస్మానియా యూనివర్సిటీ బీసీ సెల్ డైరెక్టర్ ప్రొ.చల్లమల్ల వెంకటేశ్వర్లు విద్యార్థుల సమక్షంలో ఆర్ట్స్ కాలేజ్ ఎదుట ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థుల మానసిక ఉల్లాసానికి చసువుతోపాటు, క్రీడలు ఎంతో ప్రాముఖ్యమైనవన్నారు. మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ వారి స్ఫూర్తిని కొనసాగిస్తూ రీసెర్చ్ స్కాలర్స్ మహాత్మ జ్యోతిబాపూలే, జగ్జీవన్ రామ్, మీర్ ఉస్మాన్ అలీ ఖాన్, బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల ఇలాంటి ప్రోగ్రాములు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాల చెందిన విద్యార్థులు గడ్డం ప్రసాద్, ప్రవీణ్, శ్రీనివాస్, నవీన్, శంకర్ రాజు, విజయ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌కు ఓయూ విద్యార్థి లేఖ



నవతెలంగాణ-ఓయూ

ఓయూ విద్యార్థి కాంపాటి వెంకట్ (విద్యార్థి నిరుద్యోగ ఫోరం చైర్మన్) ఉస్మానియా యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి 'పేపర్ లీకేజీ వల్ల విద్యార్థులమైన మేము ఆత్మ న్యూనత భావం చెంది అయోమయంలోఉన్నాం. టీఎస్పీఎస్సీని వెంటనే ప్రక్షాళన చేసి చైర్మన్, సభ్యులను వెంటనే తొలగించి మాకు సంస్థపై నమ్మకం కలిగించిన తర్వాతనే పరీక్ష తేదీలను ప్రకటించాలని కోరుకుంటున్నాం' అంటూ సీఎం కేసీఆర్‌కు శుక్రవారం లేఖ రాశారు. పరీక్ష తేదీలను ప్రకటించటం వల్ల టీఎస్పీఎస్సీ, ప్రభుత్వంపై అనుమానాలు కలుగుతున్నాయన్నారు. జనార్దన్ రెడ్డిని భర్త రఫ్ చేస్తే గుట్టు బయటపడుతుందన్నారు. తమకు చాలా అనుమానాలు ఉన్నాయనీ, అందుకే జనార్ధన్ రెడ్డిని తొలగించటం లేదా? అని విద్యార్థులం ప్రశ్నిస్తున్నట్టు చెప్పారు. సిట్‌తో కాదు సిట్టింగ్ జడ్జి, సీబీఐతో విచారణ జరిపించాలన్నారు. బాధ్యతగా విద్యార్థులకు ఆర్థికంగా రూ.5 లక్షల సహాయం చేయాలనీ, విద్యార్థులంగా డిమాండ్ చేస్తున్నట్టు చెప్పారు.

'విద్యార్థుల అరెస్టు దుర్మార్గమైన చర్య'



నవతెలంగాణ-ఓయూ

పేపర్ లీకేజీలపై నిరసన వ్యక్తం చేస్తున్న కేయూ విద్యార్థులను ఉదయం ఐదు గంటలకు తలుపులు బద్దలు కొట్టి అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అనీ, అరెస్టు చేయాల్సింది 30 లక్షల మంది జీవితాలను రోడ్డున పడేసిన టీఎస్పీఎస్సీ చైర్మన్, బోర్డ్ మెంబర్లను అని బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు, బహుజన్ స్టూడెంట్స్ జాక్ చైర్మన్ వేల్పుల సంజయ్, ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. ఆర్ట్స్ కాలేజీ ఎదుట శుక్రవారం అరెస్టులకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తూ టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజ్ వ్యవహారంలో సిట్ అధికారులు కేవలం ఆరు నోటిఫికేషన్లు మాత్రమే లీకైవి అని చెప్పడం వాళ్ళ బాధ్యతా రాహిత్యానికి నిదర్శనం అన్నారు. టీఎస్పీఎస్సీ కండక్ట్ చేసిన 7 నోటిఫికేషన్ల పరీక్షలు జరిగిన ఏడుకేడు లీక్ చేసింద్రు అనీ, అది సిట్‌తో సాధ్యం కాదనీ, ఈ కేసును సీబీఐకి బదలాయించాలని డిమాండ్ చేశారు. బోర్డు చైర్మన్, మెంబర్లను అరెస్టు చేయకుండా మళ్లీ రీ షెడ్యూల్ ప్రకటించడం అంటే తెలంగాణ విద్యార్థి నిరుద్యోగుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు పోమల అంబేద్కర్, మోత్ర ప్రభాకర్, ప్రశాంత్, వెంకన్నగౌడ్, రాజు, యుగంధర్ ప్రవీణ్, సతీష్, వెంకటేష్, భాస్కర్, శ్రీనివాస్, సత్యం, ఆనంద్, కుమార్, నవీన్, పాల్గొన్నారు.

కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-అడిక్‌మెట్

కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలనీ, జనగణనలో కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం కేంద్రమంత్రి అమిత్ షా ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం త్వరలో దేశవ్యాప్తంగా జనగణన చేపట్టబోతుందనీ, ఇందులో కులగణన చేపట్టాలని కోరారు. జన గణ పట్టికలో 34 కాలమ్స్ ఉన్నాయనీ, ఇందులో అదనంగా కులగణనకు ఒక కాలమ్ పెట్టడానికి కేంద్రం వ్యతిరేకించడం దుర్మార్గం అన్నారు. ఒక్క రూపాయి అదనపు ఖర్చు లేకుండా దేశంలోని కులాల వివరాలన్నీ వస్తాయనీ, ఎందుకు ఈ కేంద్ర ప్రభుత్వం అంగీకరించడం లేదన్నారు. దేశంలోని 75 కోట్ల మంది బీసీలకు అభివద్ధి చేయకుండా భారతదేశం అగ్రదేశంగా తయారవుతుందా? ఎందుకింత బీసీల పట్ల వివక్ష చూపుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైల్వే, ఎల్ఐసీ, బ్యాంకింగ్ తదితర ప్రభుత్వ శాఖలను ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం అన్యాయం అన్నారు. ప్రైవేటీకరణ చేస్తే ఎస్సీ/ఎస్టీ/బీసీ రిజర్వేషన్లు ఉండవన్నారు. ఉద్యోగ అవకాశాలు లేవనీ, పైగా వేల కోట్ల లాభాలు బాటలో ఉన్న రైల్వేలను, ఎల్ఐసీని ప్రైవేటీకరణ చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలనీ, ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలని కోరారు. ఎస్సీ/ఎస్టీ అట్రా సిటీ యాక్ట్ మాదిరిగా బీసీలకు రక్షణ, భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీల న్యాయమైన డిమాండ్ల పట్ల కేంద్ర మంత్రి అమిత్ షా సానుకూలంగా స్పందించారని తెలిపారు. బీసీ సంఘం ఇచ్చిన డిమాండ్లపై ప్రత్యేక చొరవ చూపుతామని హామీ ఇచ్చారన్నారు. తొందరలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేస్తామనీ, బీసీల పెద్ద ఎత్తున బడ్జెట్ పెంచుతామని హామీ ఇచ్చారు అని తెలిపారు. ఈ ప్రతినిధి వర్గంలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరడి భూపేష్ సాగర్, జాతీయ నాయకులు కె.రాము, కర్రీ వేణుమాధవ్, వర ప్రసాద్, భాషయ్య, పరుషారామ్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికునికి రావాల్సిన గ్రాట్యూటీ డబ్బులు ఇప్పించిన రవి సింగ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



కజీడిమెట్ల ఇండస్ట్రియల్ ఏరియాలోని ఓ కంపెనీలో ఐదేండ్లుగా ప్రసాద్ అనే కార్మికుడు పని చేస్తున్నాడు. అనివార్య కారణాల వల్ల డ్యూటీ మానేయడంతో కార్మికుడికి రావాల్సిన బెనిఫిట్స్ కంపెనీ యాజమాన్యం ఇవ్వలేదు. దీంతో ప్రసాద్ తనకు తెలిసిన వారి ద్వారా బీఆర్ఎస్ కేవీ, రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమ శక్తి అవార్డు గ్రహీత రవి సింగ్ కలిసి తనకు జరిగిన అన్యాయం గురించి చెప్పుకున్నాడు. వెంటనే స్పందించిన రవి సింగ్ కంపెనీ వద్దకు హుటాహుటిన వెళ్లి కంపెనీ యజమాన్యంతో పలుమార్లు చర్చించి " పేమెంట్ ఆఫ్ గ్రాట్యూటీ చట్టం 1972 " ప్రకారం కార్మికుడికి రావాల్సిన గ్రాట్యుటీ డబ్బులను ఇప్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస చారి, సంతోష్ గౌడ్, మనోజ్ కుమార్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లై-హై చాలెంజ్ విజేతగా మిడతన పావని'

నవతెలంగాణ-హిమాయత్ నగర్



నూజివీడులోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్ జీయుకెటి) విద్యార్థిని మిడతన పావని తన అసాధారణ ప్రతిభతో కోడింగ్ విభాగంలో కోడింగ్ నైపుణ్యాల ఆవశ్యకతను గుర్తించి విజయం సాధించారు. కోడింగ్ పట్ల ఆమెకున్న అభిరుచి కారణంగా పావని నేడు ఫ్లై-హై చాలెంజ్ లో విజేతగా నిలవడమే కాకుండా ఈ నెలలో దుబాయ్ వేదికగా జరగనున్న 4.0 టెక్ సదస్సు, అల్టిమేట్ కోడింగ్ ఛాలెంజ్, పలు సెమినార్లు, వర్క్ షాప్ లలో పాల్గొననున్నట్లు ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పావని తన మనస్సు ను పైథాన్ కోడ్ కు అంకితం చేసి తను ఆ విభాగంలో పూర్తి పట్టు సాధించారు. నెక్స్ట్ వేవ్స్ సిసిబిపి 4.0 కెరీర్ బిల్డింగ్ ప్రోగ్రామ్స్ తో ఎవరైనా సరే 4.0 నైపుణ్యాలను పొందవచ్చునని ఆమె తెలిపారు. అత్యున్నత జీతాలను పొందుతూ ఫుల్ స్టాక్ డెవలప్ మెంట్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ వంటి వాటిలో ఉద్యోగాలు పొందవచ్చునన్నారు. కుటుంబ సభ్యుల మద్దతుతో తను ఈ విజయం సాధించినట్లు ఆమె పేర్కొన్నారు.

'టోల్' పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుష్పాల శ్రీకాంత్

నవతెలంగాణ-అంబర్‌పేట/కుత్బుల్లాపూర్

కేంద్ర ప్రభుత్వం నేటి నుంచి టోల్ పన్ను పెంచే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుష్పాల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శివమ్ రోడ్డులోని ట్రాలీ, ఆటో స్టాండ్స్ వద్ద డ్రైవర్స్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలో ఉషోదయ టవర్స్ నుంచి జీడిమెట్ల సబ్ స్టేషన్ వరకు వాహనాలతో ర్యాలీ నిర్వహించి, షాపూర్ నగర్ హనుమాన్ గుడి దగ్గర ఉన్న డీసీఎం అడ్డా దగ్గర నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ రహదారుల అభివృద్ధి సెస్ పేరుతో ప్రతి లీటర్ పెట్రోల్ పై రూ.5/బిలు, ప్రతి లీటరు డీజిల్ పైన రూ.2/బిలు అదనంగా వసూలు చేస్తున్నార న్నారు. 2017బి18 బడ్జెట్ కాలం నుండి మోడీ ప్రభుత్వం దీన్ని "రోడ్డు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సెస్ "గా మార్చేసింద న్నారు. దీని అర్థం.. ఈ మొత్తాన్ని రోడ్డు నిర్మాణానికి, నిర్వహణకు



ఉపయోగించాలి కానీ పెట్రోలియం ప్రణాళిక, విశ్లేషణ శాఖ లెక్కల ప్రకారం (పెట్రోలియం సహజ వాయువు మంత్రిత్వ శాఖ) 2021బి22 ఆర్థిక సంవత్సరంలో 30849000 మెట్రిక్ టన్నుల పెట్రోలు, 76659000 మెట్రిక్ టన్నుల డీజిల్ అమ్ముడుపోయిందనీ, దానిపై ప్రభుత్వం రోడ్డు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సెస్ కింద రూ.2,70,000 కోట్లు వసూలు చేసినట్టు తెలిపారు. ఇదే ఆర్థిక సంవత్సరంలోనే సుమారు 1000 టోల్ ప్లాజాల ద్వారా రూ.34,778 కోట్లను కూడా వసూలు చేసిందన్నారు. మౌలిక వసతుల అభివృద్ధి చెస్ వసూలు చేసిన తర్వాత మళ్లీ తిరిగి టోల్ పన్నును వసూలు చేయడం ఏ విధంగా న్యాయమవుతుందని ప్రశ్నించారు. పన్ను ఎంత వసూలు చేసింది, ఎంత ఖర్చు చేసింది అనే విషయంలో పారదర్శకత లేదన్నారు. చివరకు ప్రభుత్వం టోల్ రేట్ నిర్ణయించే ముందు లేదా దాన్ని పెంచే ముందు నోటీసు ఇచ్చి ప్రజల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకోవాలి కానీ అవేమీ చేయకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.అజయబాబు మాట్లాడుతూ "రాష్ట్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి కేంద్ర బీజేపీ ప్రభుత్వం చేసిన ఈ నిర్ణయంని ప్రభుత్వం వ్యతిరేకిస్తున్నదని తెలియజేస్తూ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి రాయడం సంతోషమన్నారు. ఈ నిర్ణయం ద్వారా పడే భారాన్ని కార్మికులు, ప్రజలపై పడకుండా ఉండేందుకు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీఐటీయూ అంబర్‌పేట జోన్ కన్వీనర్ జి.రాములు, నగర నాయకులు డీఎల్. జోన్ నాయకులు ట్రాన్స్‌పోర్ట్ రంగం నగర నాయకులు రఘు నాయక్, ట్రాలీ ఆటో నాయకులు నర్సింగ్, డీసీఎం డ్రైవర్స్ శ్రీనివాస్, అజయ్‌బాబు పాల్గొన్నారు.

నీటి కుండీలను ఏర్పాటు చేయాలి



- వీధి కుక్కల నివారణకు సమిష్టిగా కృషి చేయాలి
- ఇక స్క్వాడ్ డాగ్ కాదు స్టెబిలైజేషన్ స్క్వాడ్
- నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

నవతెలంగాణ-సిటీబ్యూరో

వీధి కుక్కల ప్రమాదాల నుంచి ప్రజలను సురక్షితంగా ఉంచడానికి ఎన్జీవోలు సమిష్టిగా కృషి చేయాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సూచించారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో వీధి కుక్కల ప్రమాదాలపై ఏర్పాటైన అఖిల పార్టీ సమావేశంలో వెటర్నరీ శాఖ అధికారి వకీల్, కార్పొరేటర్లు శ్రవణ్, సి.ఎన్. రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రానున్న వేసవిలో వీధి కుక్కలకు తాగునీటి అవసరాలకు నీటి కుండీలు ఏర్పాటు చేయాలన్నారు. కుక్కలు పట్టుకునే స్క్వాడ్ డాగ్‌ను స్టెబిలైజేషన్ స్క్వాడ్‌గా నామకరణం చేయాలని సూచించారు. వీధి కుక్కలు ఎక్కువగా సంచరించే ప్రదేశాల్లో స్థానిక లీడర్ల సలహా మేరకు వీధి కుక్కల స్క్వాడ్‌కు సమాచారం అందించాలన్నారు. వీధి కుక్కలపై విస్తృతంగా అవగాహన కల్పించడానికి సినిమా సొసైటీ ద్వారా వీధి కుక్కల ప్రమాదాలపై స్లైడ్ రూపొందించాలని తెలిపారు. వీధి కుక్కల దత్తత తీసుకునే కార్యక్రమాన్ని అన్ని డివిజన్‌లలో చేపట్టే విధంగా కార్పొరేటర్లు చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రజా సంక్షేమానికి నిరంతరం పాటుపడతా

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడతానని స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. 'ప్రగతి యాత్ర'లో భాగంగా 35వ రోజు శుక్రవారం ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని నందానగర్, గాంధీనగర్, వెంకట్ రామ్ రెడ్డి నగర్ లలో స్థానిక కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్‌తో కలిసి పాదయాత్ర చేస్తూ పూర్తి చేసిన అభివృద్ధి పనులను పరిశీలించారు. నందానగర్ లో రూ.2.90 కోట్లతో సీసీ రోడ్లు, ఎస్సీ స్మశానవాటిక, బస్తీ దవాఖాన పనులను పూర్తి చేసినందుకు ఎమ్మెల్యే, కార్పొరేటర్‌లకు బస్తీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. మిగిలి ఉన్న రోడ్లు, డ్రైనేజీ, బోర్ వాటర్ సమస్య, ఎస్సీ, మైనార్టీ, ముదిరాజ్‌ల స్మశానవాటికల అభివృద్ధి, కరెంటు పోల్స్ బదిలీ వంటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గాంధీనగర్‌లో రూ.2.90 కోట్లతో భూగర్భ డ్రైనేజీ, దాదాపు సీసీ రోడ్లు పూర్తి చేసినందుకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. హిందూ స్మశానవాటిక, ముస్లీం స్మశానవాటిక, మహిళా భవనం, కమ్యూనిటీ హాల్, బస్ షెల్టర్, మిగిలిన సీసీ రోడ్ల పనులను వేగంగా చేపట్టి పూర్తి చేయాలని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంకట్ రామ్ రెడ్డి నగర్ లో రూ.3 కోట్లతో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, కమ్యూనిటీ హాల్ పనులు పూర్తి చేసినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. మిగిలి ఉన్న భూగర్భ డ్రైనేజీ, కమిటీ హాల్ పై అంతస్తు, అంతర్గత సీసీ రోడ్లు, మహిళా



భవనం పనులు వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే స్పందిస్తూ అక్కడే ఉన్న సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకొని వేగంగా శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఏర్వ శంకరయ్య, ప్రధాన కార్యదర్శి జి.సుధాకర్, డీఈఈ భాను చందర్, ఏఈ మల్లారెడ్డి, కాలనీల సంక్షేమ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



నవతెలంగాణ-శామీర్‌పేట

సీతారామచంద్ర స్వామి కల్యాణ వసంత మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మూడు చింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామ పరిధిలోని రాములగుట్టపై (శ్రీరామ పాదక్షేత్రం) ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ వ్రతంలో 16 జంటలు పాల్గొని పూజలు చేశారు. అనంతరం అన్నదానం వితరణ చేశారు. కాగా చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కటికెల వైద్యనాథ్ దంపతులు, పూజారులు నందగిరి ఉపేందర్ రావు, ఉదయ్ శర్మ, శివాలయ కమిటీ చైర్మన్ క్యాతం రవి, మాజీ చైర్మన్ మర్యాల వీరేశం గుప్తా, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బండి జగన్నాథం, నాయకులు క్యాతం మధుకృష్ణ, చినలచ్చ శ్రీనివాస్, మంద స్వామి, చిత్తయ్య గౌడ్, రామరాజు, మేర శ్రీశైలం, శ్రీనివాస్, సాయి శ్రీనివాస్ చారి, కటికెల గోపి, తదితరులు పాల్గొన్నారు.

గుడికి వెళ్లిన యువతి అదృశ్యం

నవతెలంగాణ-బాలానగర్



యువతి అదృశ్యమైన ఘటన బాలానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. సీఐ కె.భాస్కర్ వివరాల ప్రకారం బాలానగర్ రాజు కాలనీలో నివాసముండే వెంకన్న కూతురు నవ్య ఇంట్లోనే ఉంటుంది. బుధవారం మధ్యాహ్నం గుడికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్ళింది. ఇంట్లో చెప్పి వెళ్లిన నవ్య తిరిగి ఇంటికి చేరుకోలేదు. నవ్య ఆచూకీ కోసం బంధువుల వద్ద, స్నేహితుల వద్ద విచారించినా ఆచూకీ లభించలేదు. పరిసర ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని హిందూ వాహిని కుత్బుల్లాపూర్ భాగ్ ప్రతినిధులు శుక్రవారం శంభీపూర్‌లోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఏప్రిల్ 6వ తేదీన జగద్గిరిగుట్ట సలాసర్ హనుమాన్ మందిరం వద్ద



ప్రారంభమయ్యే హనుమాన్ శోభా యాత్రకు రావాల్సిందిగా ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో నరేష్, సంతోష్, రవి, శ్యామ్, చారీ, తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-దుండిగల్

ఘనంగా సీతారాముల వారి ఊరేగింపు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

జగద్గిరిగుట్ట డివిజన్ జగద్గిరినగర్‌లో ప్రముఖ సంఘ సేవకులు జి.ద్రోణాచారి(చందు) ఆధ్వర్యంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సీతారాముల(శావ) ఊరేగింపు వేడుకలకు స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. గురువారం సాయంత్రం జగద్గిరిగుట్ట పురవీధుల్లో ఊరేగింపు కన్నుల పండువగా జరిగింది. కార్యక్రమంలో స్థానికులు రెడ్డప్ప గౌడ్, రాజేష్ ,హరిప్రసాద్, భాస్కర్‌చారి, శ్రావణ్ కుమార్, నందు, శివ గౌడ్, రాజమాణిక్యం, సత్యనారాయణ గౌడ్, నాగరాజు, బాలరాజు, ప్రభాకర్, రాజుచారి, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



దశలవారీగా సమస్యలను పరిష్కరించి అభివృద్ధి చేస్తాం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించి అభివృద్ధి చేస్తున్నామని సూరారం 129 డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ అన్నారు. సూరారం డివిజన్ పరిధిలోని వేమారెడ్డి నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. సూరారం డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తూ.. మౌలిక వసతులను కల్పించుటకు పెద్దపీట వేస్తున్నామన్నారు. స్థానికులకు ఇలాంటి ఇబ్బంది కలగకుండా.. నాణ్యతా ప్రమాణాలు లోపించకూడదన్నారు. పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లు లాభ పేక్షలతో కాకుండా సేవ భావంతో మన్నికగా ఉండేలా త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సుభాష్ రెడ్డి, సంజీవ్, విజయ్‌ల్గొన్నారు.

మాజీ సర్పంచ్ రాజమల్లారెడ్డి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-మేడ్చల్



మేడ్చల్ మండల పరిధిలోని డబిల్ పూర్ గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు వీర్లపల్లి రాజమల్లారెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం వారి నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చామకూర మహేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్, మున్సిపల్ కౌన్సిలర్లు కౌడే మహేష్, జాకట దేవరాజ్, మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శేఖర్ గౌడ్, మండల అధ్యక్షుడు చీర్ల దయానంద్ యాదవ్, మాజీ ఉప సర్పంచ్ మర్రి నర్సింహా రెడ్డి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి కప్పి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కలసినవారిలో భాగ్యరెడ్డి, సత్యనారాయణ, సంజీవ, అశోక్, మహేష్, రవి, నరేష్ మేడ్చల్ మండల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



దుండిగల్ మున్సిపల్ భజరంగ్ దళ్ బౌరంపేట్ ప్రతినిధులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని ఈరోజు శంభీపూర్‌లో కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏప్రిల్ 6వ తేదీన బౌరంపేట్ దుర్గామాత దేవాలయం వద్ద ప్రారంభించనున్న శ్రీహనుమాన్ శోభయాత్రకు రావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, మురళి యాదవ్, తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-దుండిగల్

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని మల్లంపేట్ కు చెందిన ముస్లిం సోదరులు శుక్రవారం శంభీపూర్‌లోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సమస్యలను పరిష్కరించాలని కోరగా సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మాదాసు వెంకటేష్, నిజాంపేట్ కో - ఆప్షన్ సభ్యులు సలీం, నాయకులు చంద్రగిరి సతీష్, నాయకులు పాల్గొన్నారు. నవతెలంగాణ-దుండిగల్



మూడు చింతలపల్లికి జాతీయ స్థాయి అవార్డులు

నవతెలంగాణ-శామీర్‌పేట

సీఎం దత్తత గ్రామమైన మూడు చింతలపల్లి గ్రామానికి జాతీయ స్థాయిలో మౌలిక వసతుల కల్పనలో ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డుకు ఎంపికైంది. కాగా శుక్రవారం రాజేంద్రనగర్‌లోని ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించిన జాతీయ పంచాయతీ అవార్డుల ప్రధానోత్సవం (దీన్ దయాల్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్) కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ రాష్ట్ర పంచాయతీ శాఖ మంత్రి దయాకర్ రావు చేతులమీదుగా జాతీయస్థాయిలో ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డును మంత్రి మల్లారెడ్డి సమక్షంలో సర్పంచ్ జామ్ రవి అందుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ముడుచింతలపల్లి గ్రామానికి జాతీయ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు శాసనమండలిలో మర్యాద పూర్వకంగా కలిశారు.



కార్యక్రమంలో బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, దూలపల్లి పీఏసీఎస్ చైర్మన్ గరిశ నరేందర్‌రాజు, నాయకులు మురళి యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. నవతెలంగాణ-దుండిగల్

దుండిగల్ మున్సిపాల్టీ బడ్జెట్‌కు ఆమోదం



నవతెలంగాణ-దుండిగల్

దుండిగల్ మున్సిపాలిటీ 2023-2024 సంవత్సర వార్షిక బడ్జెట్ సమావేశాన్ని శుక్రవారం పురపాలక సంఘం సమావేశ మందిరం కార్యాలయం లో ప్రత్యేక బడ్జెట్ సమావేశం చైర్ పర్సన్ సుంకరి క్రిష్ణ వేణి క్రిష్ణ అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్లు అభివృద్ధి పనులు బడ్జెట్ వివరాల సమాచారం వివరణలు ఇవ్వాలని తెలిపారు. సమావేశంలో చైర్ పర్సన్ 2023-24 సంవత్సర బడ్జెట్ ప్రవేశపెట్టారు. కౌన్సిలర్స్ అడిగిన ప్రశ్నలకు చైర్ పర్సన్ సంబధిత అధికారుల ద్వారా వివరణ ఇప్పించారు. ఈ బడ్జెట్‌ను వైస్ చైర్మన్, కౌన్సిలర్స్ అందరూ ఆమోదించారు. 2023-24 సంవత్సరం మొత్తం పన్నులు, ఇతరముల ద్వార వచ్చే అంచనా ఆదాయం పై గ్రాంట్లు రూ. మొత్తం. 67.43 కోట్లు, 2023-24 సంవత్సరం అంచనా వ్యయం పై గ్రాంట్లు రూ.65.99 కోట్లు, 2023-24 మిగులు బడ్జెట్ అంచనా రూ.1.44 కోట్లు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ తుడుము పద్మారావు, కమిషనర్ కె.సత్యనారాయణ రావు, కౌన్సిలర్స్ సుంకరి క్రిష్ణ, ఇతర వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ ఇంజినీర్ పి.ప్రవీణ్ కుమార్, టీపీఓ సాయిబాబా, జూనియర్ ఎకౌంటు ఆఫీసర్ రాజ బాబు, మునిసిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ - అసెంబ్లీలో శుక్రవారం జరిగిన ఎమ్మెల్సీ కుర్మయ్య, నవీన్‌కుమార్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి



కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపి వివేకానంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎమ్మెల్సీ నవీన్ రావుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నవతెలంగాణ-దుండిగల్



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతినగర్ లోని శ్రీ పట్టాభి రామాంజనేయ స్వామి ఆలయంలో శ్రీ సీత రామాంజనేయ స్వామి మహోత్సవం ఆలయ కమిటీ చైర్మన్ చల్లా సుధీర్ రెడ్డి నేతృత్వంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. నవతెలంగాణ-దుండిగల్

రాజమల్లారెడ్డికి మంత్రి మల్లారెడ్డి జన్మదిన శుభాకాంక్షలు

నవతెలంగాణ-మేడ్చల్



మేడ్చల్ మండల పరిధిలోని డబీల్‌పూర్ గ్రామ మాజీ సర్పంచ్ వీర్లపల్లి రాజమల్లారెడ్డి శుక్రవారం తన జన్మదిన సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి పూల బొకే అందజేసి శాలువా కప్పి సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రిని కలిసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు వీర్లపల్లి గీతాభాగ్యరెడ్డి, డబీల్ పూర్ పిఎసిఎస్ చైర్మన్ సద్ది సురేష్ రెడ్డి ఉన్నారు.






సెమీస్‌లో సింధు



- క్వార్టర్స్‌లో శ్రీకాంత్ పరాజయం
- స్పెయిన్ మాస్టర్స్ సూపర్ 30

తెలుగు తేజం పి.వి సింధు ఫామ్‌లోకి వచ్చింది!. సీజన్‌లో తొలిసారి సెమీఫైనల్లోకి ప్రవేశించింది. డెన్మార్క్ షట్లర్ మియా బ్లిచ్‌ఫెల్ట్‌పై వరుస గేముల్లో అలవోక విజయం సాధించిన అగ్రశ్రేణి షట్లర్ నేడు సింగపూర్ అమ్మాయి జిన్ మిన్‌తో పోటీపడనుంది. కిదాంబి శ్రీకాంత్ క్వార్టర్స్‌లో ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించాడు.

మాడ్రిడ్ (స్పెయిన్) : ఇండియా ఓపెన్, మలేషియా ఓపెన్, ఆల్ ఇంగ్లాండ్, స్విస్ ఓపెన్.. ఇలా ఈ ఏడాది ఆరంభం నుంచీ భారత స్టార్ షట్లర్‌కు ఎక్కడా కలిసిరాలేదు. అనామక షట్లర్ల చేతిలోనూ పరాజయాలు సింధు ఫిట్‌నెస్‌పై అనుమానాలు రేకెత్తించాయి. సుమారు ఆరు నెలల విరామం అనంతరం షటిల్ కోర్టులో రీ ఎంట్రీ ఇచ్చిన తెలుగు తేజం పి.వి సింధు ఈ సీజన్‌లో తొలిసారి ఓ టోర్నీ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. డెన్మార్క్ షట్లర్ మియా బ్లిచ్‌ఫెల్ట్‌పై మెరుపు విజయం సాధించి స్పెయిన్ మాస్టర్స్ టోర్నీలో అదరగొట్టింది. 21-14, 21-17తో సింధు వరుస గేముల్లోనే సెమీఫైనల్ బెర్త్ ఖాయం చేసుకుంది. పురుషుల సింగిల్స్ మాజీ వరల్డ్ నం.1 కిదాంబి శ్రీకాంత్ క్వార్టర్‌ఫైనల్లో టాప్ సీడ్ కెంట నిషిమోట చేతిలో పరాజయం పాలయ్యాడు.

అలవోకగా.. : ఆల్ ఇంగ్లాండ్ చాంపియన్‌షిప్స్‌లో మియా బ్లిచ్‌ఫెల్ట్ చేతిలో ఓటమి చెందిన పి.వి సింధు.. స్పెయిన్ మాస్టర్స్‌లో లెక్క సరి చేసింది. 40 నిమిషాల్లోనే డెన్మార్క్ షట్లర్ కథ ముగించిన పి.వి సింధు మహిళల సింగిల్స్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. రెండో సీడ్ సింధుకు ఆరంభంలో కలిసిరాలేదు. 4-6తో వెనుకంజ వేసింది. కానీ విరామ సమయానికి 11-10తో సింధు పుంజుకుంది. 12-12 వరకు పాయింట్లు, ఆధిక్యం కోసం సింధుతో డెన్మార్క్ షట్లర్ గట్టిగా పోటీపడింది. ద్వితీయార్థంలో జోరందుకున్న సింధు ఏకపక్షంగా పాయింట్లు కొల్లగొట్టింది. 21-14తో తొలి గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో డెన్మార్క్ అమ్మాయి పుంజుకునే ప్రయత్నం చేసింది. విరామ సమయానికి 11-6తో ముందంజ వేసిన మియా బ్లిచ్‌ఫెల్ట్.. మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లేలా కనిపించింది. 16-16 వద్ద స్కోరు సమం చేసి, 18-17తో ఆధిక్యంలోకి వచ్చిన సింధు అక్కడ్నుంచి వరుస పాయింట్లతో మియా బ్లిచ్‌ఫెల్ట్‌కు షాక్ ఇచ్చింది. 21-17తో రెండో గేమ్‌ను గెల్చుకుని నేరుగా సెమీఫైనల్లోకి ప్రవేశించింది. ఇక పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్‌కు ఓటమి తప్పలేదు. టాప్ సీడ్ కెంట నిషిమోట 21-18, 21-15తో శ్రీకాంత్‌పై అలవోక విజయం సాధించాడు. 41 నిమిషాల ముగిసిన క్వార్టర్‌ఫైనల్లో జపాన్ స్టార్‌కు శ్రీకాంత్ నుంచి పెద్దగా ప్రతిఘటన ఎదురు కాలేదు. రెండు గేముల్లోనూ నిషిమోటను సమం చేసేందుకు ప్రయత్నించిన శ్రీకాంత్.. ఏ దశలోనూ జపాన్ స్టార్‌పై ఆధిపత్యం చెలాయించలేదు.

స్పెయిన్ మాస్టర్స్ సూపర్ 300 టోర్నీలో నేడు పి.వి సింధు కీలక మ్యాచ్‌కు సిద్ధమవుతోంది. వరల్డ్ నం.33 సింగపూర్ షట్లర్ యో జిన్ మిన్‌తో నేడు సింధు తలపడనుంది. సింగపూర్ అమ్మాయితో గతంలో ఆడిన మూడు మ్యాచుల్లోనూ సింధు ఏకపక్ష విజయాలు నమోదు చేసింది. ఏ మ్యాచ్‌లోనూ మూడో గేమ్ వరకు వెళ్లలేదు. కానీ ఇటీవల సింగపూర్ షట్లర్ గణనీయమైన పురోగతి సాధించింది. షటిల్ కోర్టులో అగ్రశ్రేణి ప్లేయర్లకు సవాల్ విసురుతోంది. దీంతో నేడు సెమీఫైనల్లో సింధుకు గట్టి సవాల్ ఎదురయ్యే అవకాశం కనిపిస్తోంది.

ఆరంభం అదిరింది

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఆరంభం అదిరింది. మూడేండ్ల విరామం అనంతరం స్వదేశీ అభిమానుల మధ్యకు వచ్చిన ధనాధన్ క్రికెట్ లీగ్ 16వ సీజన్ శుక్రవారం అహ్మదాబాద్‌లోని నరెంద్ర మోడీ స్టేడియంలో అట్టహాసంగా మొదలైంది. ఆరంభ వేడుకలకు సినీ తారల నృత్యాలతో ప్రత్యేక ఆకర్షణ వచ్చింది. పాన్ ఇండియా చిత్రాలు పుష్ప ఫేం రష్మిక మందన, బాహుబలి ఫేం తమన్నా భాటియాలు పాపులర్ పాటలకు తమదైన నృత్యాలతో అభిమానులకు సూపర్ కిక్ అందించారు. సంగీతకారుడు అరిజిత్ సింగ్ పాటలతో స్టేడియం హోరెత్తింది. ఐపీఎల్ డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్య ట్రోఫీని మైదానంలోకి తీసుకువచ్చాడు. ఆరంభ మ్యాచ్‌కు చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ ఎం.ఎస్ ధోని, గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్య బగ్గీల్లో అభిమానుల కేరింతల నడుమ మైదానంలోకి వచ్చారు.

ఆసియాకప్‌కే పరిమితం!

- హైబ్రిడ్ మోడల్ ఆతిథ్యంపై పీసీబీ

లాహోర్ : 2023 ఆసియా కప్‌లో అనుసరిస్తున్న హైబ్రిడ్ మోడల్‌ను 2023 వన్డే వరల్డ్‌కప్‌లోనూ అమలు చేయాలని కోరలేదని, అసలు అటువంటి చర్చ చోటుచేసుకోలేదని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) చైర్మెన్ నజీం సేథి తెలిపారు. పీసీబీ మాజీ సీఈవో, ఐసీసీ జనరల్ మేనేజర్ (క్రికెట్) వసీం ఖాన్ ఇటీవల ఓ పాక్ చానల్‌తో మాట్లాడుతూ.. 'ఆసియా కప్ కోసం భారత్ పాక్‌కు రావటం లేదు. వన్డే వరల్డ్‌కప్ కోసం పాక్ సైతం అక్కడికి వెళ్లదనుకుంటా. ఆసియాకప్ తరహాలోనే వరల్డ్‌కప్‌లోనూ హైబ్రిడ్ మోడల్ తప్పదేమో. పాక్ మ్యాచులను తటస్థ వేదికపై నిర్వహించాలని పీసీబీ డిమాండ్ చేయవచ్చు' అని తెలిపారు. ఆసియా కప్‌లో ఆడేందుకు భారత జట్టు పాక్ పర్యటనకు రాకుంటే.. వన్డే వరల్డ్‌కప్‌కు పాక్ సైతం ఆ దేశానికి వెళ్లబోదని గతంలో పీసీబీ చైర్మెన్లు హెచ్చరించిన నేపథ్యంలో వసీం ఖాన్ వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. కానీ 2025 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్యం ఇవ్వనున్న పాకిస్థాన్.. నష్ట నివారణ చర్యలు చేపట్టింది. హైబ్రిడ్ మోడల్ ఆసియా కప్‌కు మాత్రమే పరిమితం. వన్డే వరల్డ్‌కప్ గురించి ఎటువంటి చర్చ లేదు. ఐసీసీ వేదికపై చర్చ చేపట్టలేదని శుక్రవారం సేథి తెలిపారు.

సాయ్ హాస్టల్‌లో అనూహ్య ఘటన

- టాయ్‌లెట్‌లో సహచర అథ్లెట్ వీడియో చిత్రీకరణ

బెంగళూర్ : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) బెంగళూర్ సెంటర్‌లో అనూహ్య సంఘటన చోటు చేసుకుంది. డిప్లొమా చదువుతున్న మహిళా అథ్లెట్ టాయ్‌లెట్ వీడియోలను సహచర అథ్లెట్ చిత్రీకరించింది. బాధిత అథ్లెట్ ఫిర్యాదుతో స్పందించిన అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు చేయించి, విచారణ కోసం అంతర్గత కమిటీ ఏర్పాటు చేశారు. ఈ మేరకు సాయ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. డిప్లొమా చదువుతున్న మహిళా అథ్లెట్ సాయ్ హాస్టల్‌లో ఉంటుంది. హాస్టల్ టాయ్‌లెట్‌లో అథ్లెట్ వీడియోలను మరో అథ్లెట్ తీసింది. మార్చి 28న ఈ ఘటన జరుగగా, వీడియోను వైరల్ చేసి బాధిత అథ్లెట్‌ను మానసిక వేధింపులకు గురి చేయాలని వీడియో తీసినట్టు ప్రాథమిక దర్యాప్తులో తేలింది!.

ఐపీఎల్‌లో నేడు

పంజాబ్ X కోల్‌కత
వేదిక : మొహాలి , సమయం : మ: 3.30

లక్నో X ఢిల్లీ
వేదిక : లక్నో, సమయం : రా: 7.30

స్టార్‌స్పోర్ట్స్,జియో సినిమాలో ప్రసారం

టైటాన్స్ బోణీ

- చెన్నైపై గుజరాత్ గెలుపు
- రుతురాజ్ మెరుపులు వృథా
- ఛేదనలో శుభ్‌మన్ గిల్ జోరు



నవతెలంగాణ-అహ్మదాబాద్

డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ బోణీ కొట్టింది. ఐపీఎల్16 ఆరంభ మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌పై టైటాన్స్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 179 పరుగుల ఛేదనలో శుభ్‌మన్ గిల్ (63, 36 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) కదం తొక్కాడు. వృద్ధిమాన్ సాహా (25), సాయి సుదర్శన్ (22), విజయ్ శంకర్ (27) రాణించారు. చివర్లో రాహుల్ తెవాటియ (15 నాటౌట్‌),, రషీద్ ఖాన్ (10 నాటౌట్, 3 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) అదిరే ముగింపు ఇచ్చారు. 19.2 ఓవర్లలోనే లాంఛనం ముగించిన టైటాన్స్ సీజన్లో తొలి విజయం నమోదు చేసింది. అంతకముందు, రుతురాజ్ గైక్వాడ్ (92, 50 బంతుల్లో 4 ఫోర్లు, 9 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్‌తో చెలరేగటంతో చెన్నై సూపర్‌కింగ్స్ 178 పరుగులు చేసింది.


రుతురాజ్ షో : టాస్ నెగ్గిన గుజరాత్ టైటాన్స్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. డెవాన్ కాన్వే (1), రుతురాజ్ గైక్వాడ్ (92) తొలి వికెట్‌కు శుభారంభం అందించలేదు. కొత్త బంతితో మహ్మద్ షమి టైటాన్స్‌కు బ్రేక్ సాధించాడు. డెవాన్ కాన్వేను షమి సాగనంపాడు. మొయిన్ అలీ (23), రుతురాజ్ గైక్వాడ్ సూపర్‌కింగ్స్ ఇన్నింగ్స్ జోరు పెంచారు. ఇద్దరూ ఎడాపెడా బౌండరీలు బాదారు. అల్జారీ జొసెఫ్ వేసిన తొలి ఓవర్లో రుతురాజ్ గైక్వాడ్ ఏకంగా 18 పరుగులు పిండుకున్నాడు. అలవోకగా సిక్సర్లు సంధించిన రుతురాజ్‌కు బంతులు వేసేందుకు టైటాన్స్ బౌలర్లు తడబడ్డారు. మూడు ఫోర్లు, ఐదు సిక్సర్లతో 23 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించిన రుతురాజ్ గైక్వాడ్‌కు మరో ఎండ్ నుంచి సరైన సహకారం లభించలేదు. 11 ఓవర్లలోనే 100 పరుగుల మార్క్ చేరుకున్న సూపర్‌కింగ్స్.. చివరి 9 ఓవర్లలో 78 పరుగులే చేయగల్గింది. డెత్ ఓవర్లలో వరుస వికెట్లు పడగొట్టిన గుజరాత్ టైటాన్స్ చెన్నైని నిలువరించింది. బెన్ స్టోక్స్ (7), అంబటి రాయుడు (12), రవీంద్ర జడేజా (1) అంచనాలు అందుకోలేదు. చివర్లో కెప్టెన్ ఎం.ఎస్ ధోని (14 నాటౌట్, 7 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) కండ్లుచెదిరే సిక్సర్‌తో అభిమానులను అలరించాడు.

స్కోరు వివరాలు :

చెన్నై సూపర్‌కింగ్స్ : 178/7 (రుతురాజ్ 92, మొయిన్ అలీ 23, షమి 2/29, రషీద్ 2/26)

గుజరాత్ టైటాన్స్ : 182/5 (శుభ్‌మన్ 63, విజయ్ శంకర్ 27, రాజ్యవర్ధన్ 3/36, జడేజా 1/28)

నవచిత్రం



దసరా బరిలో బాలయ్య

బాలకృష్ణ అభిమానులకు, ప్రేక్షకులకు షైన్ స్క్రీన్స్ సంస్థ అధినేతలు సాహు గారపాటి, హరీష్ అదిరిపోయే సర్‌ప్రైజ్ అప్‌డేట్ ఇచ్చారు. ఈచిత్రాన్ని విజయదశమి కానుకగా విడుదల చేస్తున్నట్టు శుక్రవారం అధికారికంగా అనౌన్స్ చేశారు. బాలకృష్ణ, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. రిలీజ్ అనౌన్స్‌మెంట్ నేపథ్యంలో ఎన్‌బికె108.. "విజయదశమికి ఆయుధ పూజ' అని పేర్కొన్నారు. ఈ అనౌన్స్ మెంట్ పోస్టర్‌లో బాలకృష్ణ చాలా ఇంటెన్స్ కనిపిస్తున్నారు. అలాగే పోస్టర్‌లో కాళీమాత విగ్రహం కూడా ఉంది. కాజల్ అగర్వాల్ కథానాయికగా నటిస్తుండగా, శ్రీలీల కీలక పాత్రలో కనిపించనున్న ఈ చిత్రంలో ప్రముఖ సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు. ఈచిత్రానికి రచన, దర్శకత్వం: అనిల్ రావిపూడి, నిర్మాతలు: సాహు గారపాటి, హరీష్ పెద్ది, సంగీతం: తమన్, డీవోపీ: సి రామ్ ప్రసాద్, ఎడిటర్: తమ్మి రాజు, ప్రొడక్షన్ డిజైనర్: రాజీవ్, ఫైట్స్: వి వెంకట్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్.కృష్ణ.

డబుల్ సర్‌ప్రైజ్ ఇచ్చారు

రవితేజ నటించిన క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ 'రావణాసుర'. సుధీర్ వర్మ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని అభిషేక్ పిక్చర్స్, ఆర్ టీ టీమ్‌వర్క్స్‌పై అభిషేక్ నామా, రవితేజ నిర్మించారు. హర్షవర్ధన్ రామేశ్వర్, భీమ్స్ సిసిరోలియో ద్వయం సంగీతం అందించిన ఈ చిత్రం ఏప్రిల్ 7న సమ్మర్ స్పెషల్‌గా రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో సంగీత దర్శకుడు



హర్షవర్ధన్ రామేశ్వర్

హర్షవర్ధన్ రామేశ్వర్ మీడియాతో మాట్లాడుతూ, 'అభిషేక్‌గారి ప్రొడక్షన్‌లోనే డెవిల్ చేస్తున్నాను. ఆయన ఒక రోజు కాల్ చేసి 'రావణాసుర' టైటిల్ ఎలా ఉందని అడిగితే, చాలా పవర్ ఫుల్‌గా ఉందన్నాను. దీనికి థీమ్ సాంగ్ కావాలని కొన్ని వివరాలు చెప్పారు. ఒక ట్యూన్ చేసి పంపించాను. అది ఆయనతోపాటు దర్శకుడు సుధీర్‌వర్మకి నచ్చి ఈ చిత్రానికి నువ్వే మ్యూజిక్ చేస్తున్నావని, ఇందులో రవితేజ హీరో అని చెప్పి డబుల్ సర్‌ప్రైజ్ ఇచ్చారు. రవితేజతో పని చేయడం డ్రీమ్ కమ్ ట్రూ మూమెంట్. నేను నాలుగు పాటలుతో పాటు నేపథ్య సంగీతం చేస్తే, భీమ్స్ ఒక ఐటెం సాంగ్ చేశారు. దర్శకుడు సుధీర్‌వర్మ సౌండింగ్ కొత్తగా ఉండాలని చెప్పడంతో చాలా ఛాలెంజింగ్‌గా అనిపించింది. 'రావణాసుర' సరికొత్త కథతో ప్రేక్షకులను కచ్చితంగా అలరిస్తుంది' అని తెలిపారు.

విజువల్ ఫీస్ట్‌గా మల్లికా.. పాట



సమంత

'శాకుంతలం సినిమా చూశాను. అత్యంత అద్భుతంగా అనిపించింది. ఆ క్షణం నుంచి వీడియో సాంగ్స్ విడుదల చేసేద్దామా అన్నంత ఆత్రుతగా ఉంది. ఆ విషయాన్నే దర్శకుడు గుణశేఖర్‌తో పంచుకున్నాను. సినిమాలో నాకు అత్యంత ఇష్టమైన పాట 'మల్లికా మల్లికా'. ఈ పాటను వీడియోలో చూడటం చాలా ఆనందకరమైన విషయం. ప్రజలందరికీ ఇప్పుడు ఈ వీడియో సాంగ్‌ని అందుబాటులోకి తీసుకొస్తున్నాం' అని కథానాయిక సమంత తెలిపారు.

ఆమె టైటిల్ పాత్రలో నటించిన సినిమా 'శాకుంతలం'. దిల్‌రాజు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై గుణ టీమ్ వర్క్స్ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 14న విడుదల కానుంది శాకుంతలం. నీలిమ గుణ నిర్మాత. గుణశేఖర్ రచించి, దర్శకత్వం వహించారు. 'మల్లికా మల్లికా మాలతీ మాలికా..' అంటూ సాగే పాటను శుక్రవారం విడుదల చేశారు. చైతన్య ప్రసాద్ అందించిన సాహిత్యానికి, మణిశర్మ కూర్చిన బాణీకి అందంగా న్యాయం చేశారు సింగర్ రమ్య బెహరా. నిర్మాత నీలిమ గుణ మాట్లాడుతూ, 'యూత్‌కి బాగా నచ్చే పాట ఇది. రమ్య బెహర అద్భుతంగా ఆలపించారు. విన్న ప్రతి ఒక్కరూ బావుందన్నారు. ఇప్పుడు వీడియో సాంగ్‌కి హ్యూజ్ రెస్పాన్స్ వస్తోంది. సినిమాలో ఈ పాట ఇంకా గొప్పగా విజువల్ ఫీస్ట్‌లా ఉంటుంది. హంసలు, పువ్వుల లతలు, వనం, పాటలో సమంత ముఖ కవళికలు అందరినీ ఆకట్టుకుంటాయి' అని తెలిపారు. 'ఈ పాటకు యూనిట్‌లోనూ స్పెషల్ అభిమానులున్నారు. సమంతకి కూడా చాలా ఇష్టమని చెప్పారు. రికార్డింగ్ సమయంలో ఎంతగా ఆస్వాదించామో, తెరమీద చూసుకున్నప్పుడు అంతే సంతోషం కలిగింది. ప్రేక్షకులు కూడా ఇలాగే ఫీల్ అవుతారు' అని దర్శకుడు గుణశేఖర్ చెప్పారు.

అతీంద్రియ శక్తుల నేపథ్యంలో..



రస్సెల్ క్రోవ్

జూలియస్ అవేరీ దర్శకత్వంలో తెరకెక్కిన అమెరికన్ అతీంద్రియ భయానక చిత్రం 'ది పోప్స్ ఎక్సార్సిస్ట్'. ఇందులో పోప్‌కి భూతవైద్యుడైన ఫాదర్ గాబ్రియెల్ అమోర్త్‌గా రస్సెల్ క్రోవ్ నటించారు. ఈ చిత్రంలో డేనియల్ జొవట్టో, అలెక్స్ ఎస్సో, ఫ్రాంకో నీరో కూడా ముఖ్య పాత్రల్ని పోషించారు. సోనీ పిక్చర్స్ ద్వారా ఇంగ్లీష్, తమిళం, తెలుగు, హిందీ భాషల్లో ఏప్రిల్ 7న ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది.'తండ్రి గాబ్రియేల్ ఒక యువకుడికి భయంకరమైన పరిశోధనపై ట్రైనింగ్ ఇస్తాడు. ఆ క్రమంలో ఒక ప్రొఫెషనల్ ఇన్వెస్టిగేటర్, దెయ్యం పట్టిన ఒకరిని బయటకు పంపడానికి ప్రయత్నిస్తాడు. అప్పుడు అస్థిరమైన దెయ్యాల నివాసం, శతాబ్దాల నాటి రహస్యం వెనుక చాలా పెద్ద కుట్ర వెలుగులోకి వస్తుంది. కథనం సాగుతున్న కొద్దీ మరిన్ని ఆశ్చర్యకరమైనవిగా అనిపిస్తాయి. వాటికన్‌లో జరిగిన ఓ వాస్తవ సంఘటన ఆధారంగా ఈ సినిమా తెరకెక్కింది.

బాలీవుడ్ సినిమాలో బతుకమ్మ పాట..

బతుకమ్మ పండగ నేపథ్యం లోని పాటలు మన తెలుగు సినిమాల్లో తరచూ వినిపించడం అనేది మామూలే. అయితే బాలీవుడ్ సినిమాలో బతుకమ్మ పాట వినబడితే... విశేషమే కదా! సల్మాన్ ఖాన్ హీరోగా నటించిన బాలీవుడ్ సినిమా 'కిసీ కా భాయ్ కిసీ కీ జాన్'. ఆయన సరసన పూజా హెగ్డే కథానాయికగా నటిస్తుండగా, వెంకటేష్, భూమిక ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. ఆడబిడ్డల మనసుకు దగ్గరైన బతుకమ్మ పండుగ నేపథ్యంలో ఈ సినిమా కోసం రూపొందించిన పాటను శుక్రవారం విడుదల చేశారు. తెలంగాణ పల్లె సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా పాటను చిత్రీకరించారు. ఈ పాటలో పూజా బుట్టబొమ్మలా అందర్నీ అలరిస్తోంది. ఈ పాట గురించి పూజా హెగ్డే మాట్లాడుతూ, 'బతుకమ్మ పర్వదినం గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. భారతీయ సంస్కృతిలో పువ్వులను పూజించే గొప్ప పండుగ ఇది. తెలంగాణ అమ్మాయిలు సంబరంగా చేసుకునే, ఎంతో విశిష్టత ఉన్న పండుగ. సల్మాన్ ఖాన్, వెంకటేష్, భూమికతో ఈ పాటలో సందడి చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది' అని తెలిపారు. ఈ పాటకి రవి బస్రూర్ సంగీతం అందించారు. ఈ సినిమాలో ఈ పాట ఉంటే బాగుంటుందని సల్మాన్‌కి వెంకటేష్ సూచించారని సమాచారం. ఫర్హాద్ సంజి దర్శకత్వంలో సల్మాన్ ఖాన్ తన సొంత బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



పూజా హెగ్డే

ఆ 10 నిమిషాలు చాలు..

మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో కిరణ్ అబ్బవరం హీరోగా తెరకెక్కిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మీటర్'. నూతన దర్శకుడు రమేష్ కడూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మిస్తోంది. నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి సమర్పణలో చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మించారు. అతుల్య రవి కథానాయిక. వేసవి కానుకగా ఏప్రిల్ 7న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా దర్శకుడు రమేష్ కడూరి మీడియాతో మాట్లాడుతూ, 'బాబీ, గోపీచంద్ మలినేని దగ్గర సహాయ దర్శకుడిగా పని చేశాను. ఇప్పుడు ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నాను. రచయిత శ్రీకాంత్ విస్సా మైత్రీ మూవీ మేకర్స్‌కి నా దగ్గరున్న కథ గురించి రిఫర్ చేశారు. నిర్మాతలకు నచ్చడంతో ఈ ప్రాజెక్ట్ సెట్ అయ్యింది. కిరణ్ ఇంతకుముందు చేసిన సినిమాలన్నింటి కంటే ఇది ఫ్రెష్‌గా ఉంటుంది. ఇందులో ఆయన ఒక డిఫరెంట్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపిస్తారు. సీరియస్ కాప్‌గా సెకండ్ హాఫ్‌లో ఓ పది నిమిషాలు ఉంటారు. ఆ పది నిమిషాలు థియేటర్‌లో రఫ్ఫాడించేస్తాడు. మిగతా అంతా తండ్రి కొడుకుల మధ్య మంచి ఎమోషన్‌తో పాటు చాలా ఎంటర్‌టైనింగ్‌గా ఉండే కథ. నాయిక అతుల్యరవి తమిళంలో నటించిన సినిమాలు చూశాను. తను అద్భుతమైన నటి. ఈ సినిమాలో తన పాత్ర చాలా బాగుంటుంది. ఇది విడుదలయ్యాక ఆమె తెలుగులోనూ బిజీ అవుతుంది. కథకి తగ్గట్టు కమర్షియల్ టోన్ తెలిసిన సంగీత దర్శకుడు సాయి కార్తిక్. ఈ సినిమాకి నెక్స్ట్ లెవల్ మ్యూజిక్ ఇచ్చారు. నిర్మాణంలో మా నిర్మాతలు ఎక్కడా కాంప్రమైజ్ కాలేదు. ఈ సినిమాతో దర్శకుడిగా నాకు మంచి గుర్తింపు లభిస్తుందని ఆశిస్తున్నాను' అని తెలిపారు.



రమేష్‌కడూరి

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బీజేపీ పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తుంది

- సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేంద్రంలో అధికారంలో కొనసాగుతున్న బీజేపీ పెట్టుబడిదారుల కొమ్ముకాస్తున్నదని సీఎల్పీ మాజీ నేత కె జానారెడ్డి విమర్శించారు. అదానీ కంపెనీలలో పెట్టుబడి పెట్టిన వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో పార్టీ నేత రోహిన్‌రెడ్డితో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. అదానీ, మోడీ సంబంధాలపై రాహుల్ నిలదీశారని గుర్తు చేశారు. అదానీ వ్యవహారం బయటపడొద్దనే ఉద్దేశంలోనే రాహుల్‌గాంధీని లోక్‌సభ నుంచి బయటకు పంపించారని విమర్శించారు. అక్రమాలకు,అప్రజాస్వామిక విధానాలకు, మోడీ అరాచకాలకు వ్యతిరేకంగా రాహుల్ మాట్లాడుతున్నారని చెప్పారు. మోడీ రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బీజేపీపై పోరుకు ఎన్నికలకు సంబంధం లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీతో కాంగ్రెస్ పొత్తు అనేది.. ఎన్నికలు వచ్చినప్పుడు ప్రజలు నిర్ణయిస్తారంటూ హాట్ కామెంట్స్ చేశారు.

రవాణా రంగాన్ని రక్షించుకుందాం

- ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ



నవతెలంగాణ-ఖమ్మం

రవాణా రంగాన్ని రక్షించుకుందామని, 2019 రవాణా చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ పబ్లిక్ ప్రయివేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మం నగరంలోని ఎన్ఎస్‌టీ రోడ్డుపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వై.విక్రమ్, జిల్లా కార్యదర్శి ఉపేందర్ మాట్లాడుతూ.. ప్రజా రవాణా వాహనాలకు డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. టోల్ ట్యాక్స్ పెంపుతో ప్రజలపై అదనపు భారం పడుతుందని, నిత్యావసర ధరలు పెరుగుతాయని, కాబట్టి టోల్ ట్యాక్స్ పెంపు ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మోటార్ వాహన చట్టం 2019 సవరించాలని కోరారు. ఈనెల 5న చలో ఢిల్లీ మజ్దూర్, కిసాన్ సంఘర్ష్ ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ధరవత్ రాందాస్, జిల్లా కోశాధికారి దండగల ఉపేందర్, ఆటో యూనియన్ జిల్లా నాయకులు శ్రీను, యాసీన్, అక్బర్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు నవీన్‌రెడ్డి, డ్రైవర్లు రమేష్, శ్రీను, నాగేశ్వరావు, కాసిం, తదితరులు పాల్గొన్నారు.

జయరాజును పరామర్శించిన బీవీ రాఘవులు, వి.శ్రీనివాసరావు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజును ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పరామర్శించారు. శుక్రవారం వారు జయరాజుకు ఫోన్ చేసి మాట్లాడారు. జయరాజు కొడుకు ప్రశాంత్ రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలుసుకున్న రాఘవులు, శ్రీనివాసరావు ఫోన్‌లో మాట్లాడి ఓదార్చారు. ప్రశాంత్ ఎలా మరణించాడనే విషయాలను అడిగి తెలుకున్నారు. ఎదిగిన కొడుకు మరణించడం తీరని లోటని, ఆ బాధ నుంచి కోలుకోవడం కష్టమన్నారు. మానసికంగా కుంగిపోకుండా కాస్త మనోధైర్యంతో ఉండాలని సూచించారు. రోడ్ల విస్తరణ జరపకపోవడం, క్రాసింగ్ వద్ద సిగ్నల్ వంటివి లేకపోవడం వల్ల హైవేలపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తు చేశారు.

బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్ తప్పదు

- బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తీరు ఉట్టికి ఎగరలేనమ్మ స్వర్గానికి నిచ్చెనేసినట్టుగా ఉందని బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా విమర్శించారు. శుక్రవారం ఆయన వర్చువల్ ద్వారా తెలంగాణ, ఏపీలోని పలు జిల్లాల్లో బీజేపీ కార్యాలయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఆర్ఎస్ పార్టీని కేసీఆర్ బీఆర్ఎస్‌గా పేరు మార్చుకున్నారని, వచ్చే ఎన్నికల్లో ఓడిపోయాక అది కాస్త వీఆర్ఎస్‌గా మారిపోతుందని జోష్యం చెప్పారు. కేసీఆర్, ఆయన కుటుంబమంతా అవినీతి, అక్రమాల్లో కూరుకుపోయారన్నారు. బిడ్డ కవిత ఈడీ కేసు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తెలంగాణ, ఏపీల్లో కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులు, రైల్వేలైన్ల నిర్మాణానికి పెద్దపీట వేసిందన్నారు. రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ ఎన్నిక వచ్చినా బీజేపీ గెలుస్తుందన్నారు. పేపర్ లీక్ జరిగితే సీఎంగా ఉన్న కేసీఆర్ స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన కుటుంబానికి ఎలాంటి సంబంధం లేకపోతే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మునుగోడులో పోలింగ్ ఏజెంట్లు లేని బీఆర్ఎస్ దేశమంతటా సభలు పెడితే ఏమైతదని ఆరోపించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఇంచార్జీ తరుణ్‌చుగ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ లక్ష్మణ్, మురళీధర్‌రావు, అరవింద్ మీనన్, రఘునందర్‌రావు, ప్రేమేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, నందీశ్వర్‌గౌడ్, బాబుమోహన్, సంగప్ప, దేశ్‌పాండే పాల్గొన్నారు.

నష్టపోయిన మొక్కజొన్న పంటలను సర్వే చేయాలి

- పొచ్చర క్రాస్ రోడ్డు వద్ద రైతుల ధర్నా



నవతెలంగాణ-బోథ్

నష్టపోయిన మొక్కజొన్న పంటను సర్వే చేయాలని శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల రైతులు ధర్నా చేశారు. కనుగుట్ట గ్రామంలో ఇటీవల అకాల వర్షంతో మొక్కజొన్న పంట తీవ్రంగా దెబ్బతిన్నది. ఈ పంటను వ్యవసాయ అధికారి సర్వే నిర్వహించడం లేదని పొచ్చర క్రాస్ రోడ్ వద్ద రైతులు ధర్నా చేశారు. ఎమ్మెల్యే రైతులను పట్టించుకోవడం లేదని పేర్కొంటూ నినాదాలు చేశారు. అధికారులు సైతం ఈ విషయంలో స్పందించకపోవడంతో రైతులు ఆందోళన చేపట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సర్వే నిర్వహించి పంట నష్టపరిహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కనుగుట్ట గ్రామ రైతులు అశోక్, ప్రభాకర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజి కేసును సీబీఐకి అప్పగించాలి

- టీఎస్‌పీఎస్సీ కార్యాలయ ముట్టడిలో వైఎస్ షర్మిల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పేపర్ లీకేజి కేసును సీబీఐకి అప్పగించాలంటూ వైఎస్ఆర్ టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. శుక్రవారం టీఎస్‌పీఎస్సీ ముట్టడికి ఆమె ప్రయత్నించారు. కార్యాలయం ముందు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. నిందితులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు అనుమతి ఇవ్వాలని పోలీసులను కోరారు. పోలీసులు అందుకు నిరాకరించారు.

'స్త్రీనిధి' దేశానికే ఆదర్శం

- ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.2,710 కోట్ల రుణప్రణాళిక
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో పేదల పాలిట పెన్నిధిగా పనిచేస్తున్న స్త్రీనిధి పరపతి సహకార సమాఖ్య దేశానికే ఆదర్శమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.2,710 కోట్ల రుణప్రణాళిక రూపొందించామని తెలిపారు. స్త్రీ నిధి పరపతి సహకార సమాఖ్య పదో సర్వసభ్య సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లోని శిల్పారామంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ ఏడాది 1.59 లక్షల సంఘాలలోని 5.30 లక్షల సంఘ సభ్యులు శ్రీనిధి నుంచి రుణాలు పొందారని చెప్పారు. స్త్రీ నిధి రుణాల నిలువ రూ.5,355 కోట్లు చేరిందన్నారు. రుణాల నిలువలో 28.20 శాతం వృద్ధి సాధించటం పట్ల అభినందనలు తెలిపారు. మండల సమాఖ్య కాలపరిమితిని మూడేండ్లకు పెంచేందుకు జనరల్ బాడీ తీర్మానం చేయాలని ఎమ్‌డీని కోరారు. సభ్యులకు ఐదు లక్షల రూపాయల ఇన్సూరెన్స్ పథకం అమలునూ పరిశీలించాలని సూచించారు. స్త్రీనిధి రాష్ట్రంలో పేద మహిళల ఆర్థిక అభ్యున్నతిలో కీలకపాత్ర పోషిస్తున్నదన్నారు. ప్రతి మహిళా తాను తీసుకున్న రుణాన్ని సరైన పద్ధతిలో ఉపయోగించుకుని లభించే ఆదాయంలో నుంచి క్రమం తప్పకుండా అప్పు వాయిదాలు చెల్లించి స్త్రీనిధి సంస్థ అభివృద్ధికి దోహదపడాలన్నారు. సభ్యులపై వడ్డీ భారాన్ని తగ్గించేందుకు స్త్రీనిధి రుణాలపై వడ్డీని క్రమంగా 14 శాతం నుంచి 11 శాతానికి తగ్గించామని చెప్పారు. స్త్రీనిధి పేద మహిళలకు కావాల్సిన రుణాలను అందించడమే కాకుండా వారికి "స్త్రీనిధి సురక్ష పథకం" ద్వారా ఆర్థిక రక్షణ కల్పిస్తుందని చెప్పారు. ఒకవేళ రుణం తీసుకున్న సభ్యురాలు మరణించినట్లయితే తీసుకున్న అప్పులో నిల్వ మొత్తాన్ని రద్దుచేసి సభ్యురాలు అంతవరకు చెల్లించిన మొత్తాన్ని తిరిగి ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో 1030 బ్యాంక్ కరస్పాండెంట్ కేంద్రాలను సభ్యులు నిర్వహిస్తూ సగటున నెలకు రూ. 12 వేల ఆదాయం పొందుతున్నారని చెప్పారు. కొన్ని మండల సమాఖ్యలనో, మహిళా సంఘాలనో ఎంచుకొని వారు పెద్ద పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి కోటి రూపాయలైనా రుణాలివ్వడానికి స్త్రీనిధి కృషి చేయాలన్నారు. సీతాఫలాలు, మామిడిపండ్లు, మిర్చి, పసుపు మొదలైనవి సేకరించి ఉత్పత్తులను తయారు చేస్తున్నామనీ, వాటిని మార్కెటింగ్‌కి మల్టీనేషనల్ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని తెలిపారు. స్త్రీ నిధి కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన సెర్ప్, మెప్మా, డీఆర్‌డీఓ, పీడీ, ఇతర సిబ్బందిని, మహిళా సంఘాల సభ్యులకు అవార్డులను ప్రదానం చేశారు. సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి, సెర్ప్ సీఈవో సందీప్ కుమార్ సుల్తానియా, మున్సిపల్ డైరెక్టర్ సత్యనారాయణ, శ్రీనిధి రాష్ట్ర అధ్యక్షులు ఇందిరా, వరంగల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ, ఏపీ మాస్ అధ్యక్షులు సీఎస్.రెడ్డి, శ్రీనిధి ఎమ్‌డీ విద్యాసాగర్ రెడ్డి, ఉపాధ్యక్షులు రాఘవ దేవి, కోశాధికారి సరస్వతి, మేనేజింగ్ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

శ్రమశక్తి అవార్డు నామినేషన్ ప్రతిపాదనల్ని తిరస్కరిస్తున్నాం

- లేబర్ కమిషనర్‌కు సీఐటీయూ లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

శ్రమశక్తి అవార్డుకు కార్మిక శాఖ పంపిన నామినేషన్ ప్రతిపాదనల్ని తిరస్కరిస్తున్నట్టు కార్మిక శాఖకు సీఐటీయూ స్పష్టం చేసింది. శుక్రవారం ఈ మేరకు లేబర్ కమిషనర్‌కు లేఖ అందజేసినట్టు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ తెలిపారు. కార్మిక సమస్యలపై పనిచేస్తున్న వారికి మేడే సందర్భంగా శ్రమ శక్తి అవార్డులివ్వడానికి ప్రభుత్వం నిర్ణయించిందనీ, సీఐటీయూ నుంచి కూడా అవార్డుకు ప్రతిపాదనలు పంపాలని కార్మిక శాఖ కోరిందని తెలిపారు. దీన్ని తిరస్కరిస్తున్నట్టు ప్రకటించారు. 73 రంగాల్లో కనీస వేతనాల జీవోలను వేతన సవరణ చేయకపోవడాన్నీ, 2021లో ఐదు రంగాలకు ఫైనల్ నోటిఫికేషన్స్ గెజిట్ చేయలేదని గుర్తుచేశారు. కాంట్రాక్టు కార్మికుల కోసం ఇచ్చే జీవో 11 కూడా సవరించలేదని ప్రస్తావించారు. కాంట్రాక్టు కార్మికుల కనీస వేతనాలు నిర్ణయించేందుకు కూడా ప్రభుత్వం ముందుకు రావడం లేదని పేర్కొన్నారు. అత్యంత దుర్భర జీవితాలు గడిపే లక్షలాది బీడీ మహిళలకు ఉపయోగపడే 41ని ప్రభుత్వం అబెయన్స్‌లో పెడితే దాన్ని పునరుద్ధరించేందుకు రాష్ట్ర సర్కారు సిద్ధంగా లేదని చెప్పారు. రాష్ట్రంలో యూనియన్ల రిజిస్ట్రేషన్లు సకాలంలో చేయడం లేదన్నారు. కొన్ని కంపెనీల్లో యూనియన్స్ రిజిస్ట్రేషన్ చేయకుండా కార్మిక హక్కులు హరిస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లకు రూల్స్ ఫైనల్ కాకపోయినా అందులోని కార్మిక వ్యతిరేక అంశాలను యాజమాన్యాలు అమలు చేస్తుంటే కార్మిక శాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదని విమర్శించారు.

పరిశ్రమల్లో రక్షణ చర్యల గురించి పట్టించుకోవడం లేదని చెప్పారు. వలస కార్మికులను యాజమాన్యాలు తీవ్రంగా దోపిడీ చేస్తున్నాయనీ, అధిక పని గంటలు, భద్రత లేని ప్రమాదభరితమైన పనులు చేయిస్తున్నారని తెలిపారు. 1979 అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టం అమలుకు చర్యలు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ కార్మికులను చట్ట ప్రకారం పర్మినెంట్ చేయడం లేదనీ, పెరుగుతున్న ధరలకనుగుణంగా వారి వేతనాలు నిర్ణయించడం లేదని చెప్పారు.

కాంట్రాక్ట్, క్యాజువల్, డైలీవేజ్ తదితర పద్ధతుల్లో పని చేస్తున్న కార్మికులకు కనీసం పీఎఫ్, ఈఎస్ఐ, ఇతర సామాజిక భద్రత చర్యలు కల్పించడం లేదన్నారు. ఇటువంటి అనేక కార్మిక వ్యతిరేక, యాజమాన్యాల అనుకూల విధానాలు అవలంభించే కార్మిక శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఈ శ్రమ శక్తి అవార్డును సీఐటీయూగా తిరస్కరిస్తున్నామని ప్రకటించారు. కార్మికుల శ్రమను ప్రభుత్వం, యాజమాన్యాలు కొల్లగొడుతున్న తరుణంలో ప్రభుత్వమిచ్చే "శ్రమశక్తి" అవార్డుకు అర్థం లేదని భావిస్తున్నామన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మరియు కార్మిక శాఖ పైన పేర్కొన్న సమస్యలపై దృష్టి సారించాలని కోరారు

భద్రాద్రిలో రాముని పట్టాభిషేకం

హాజరైన రాష్ట్ర గవర్నర్ తమిళి సై



నవతెలంగాణ-భద్రాచలం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలంలో శుక్రవారం శ్రీరామ పుష్కర పట్టాభిషేకం కనుల పండువగా జరిగింది. వేకువ జామునే ఆలయ తలుపులు తెరిచిన అర్చకులు.. ముందుగా సుప్రభాత సేవ నిర్వహించి, ఆరాధన అరగింపు జరిపారు. అనంతరం రాముని పాదుకులకు అభిషేకం జరిపారు. రాజ లాంఛనాలతో గోదావరి నదీ తీరం నుంచి తీర్థములు తీసుకొచ్చారు. భక్తుల కోలాటాలు, భాజా భజంత్రీల సందడి నడుమ స్వామివారిని ఊరేగింపుగా విధుల ప్రాంగణంకు తీసుకొచ్చారు. అక్కడ కల్యాణ మండపంపై స్వామివారికి విశ్వక్సేన ఆరాధన గావించారు. అనంతరం పుణ్యాహవాచనం జరిపారు. పాదుకలు, రాజదండం, రాజముద్రిక, స్వర్ణ కిరీటం, ఖడ్గం, రత్నాభరణాలు స్వామివారికి ధరింప చేశారు. శ్రీరామ పట్టాభిషేక పారాయణం గావించారు. శుక్ల, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదం, భగవత్ శాస్త్రం తదితర పారాయణం చేశారు. పుష్కర నది జలాలతో మహా కుంభ తీర్థప్రోక్షణ జరిపి మంగళహారతి ఇచ్చారు. పట్టాభిషేకం అనంతరం భక్తులపై అర్చకులు పుణ్య నది జలాలను చల్లారు. శ్రీరామ పుష్కర పట్టాభిషేకానికి రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందరరాజన్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ హాజరై స్వామివారికి పట్టు వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అనుదీప్, భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ గౌతమ్ పోట్రు, ఎస్పీ డాక్టర్ వినీత్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మరుగునపడిన కళల్ని పరిరక్షించాలి

- బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం



నవతెలంగాణ-కల్చరల్

తెలంగాణ ప్రాంతంలో ఎన్నో గ్రామీణ కళలు వున్నాయనీ, వాటిలో అనేకం కాలక్రమంలో మరుగున పడుతున్నాయని బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. అలాంటి కళలను పరిరక్షించేలా తెలుగు విశ్వవిద్యాలయం అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. తెలుగు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అక్కడి ఎన్టీఆర్ కళామందిరంలో 2020 సంవత్సరంలో వివిధ కళాత్మక రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రతిభావంతులకు పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా బుర్రా వెంకటేశం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో తెలుగు భాషా సంస్కృతిని గ్రామీణులే కాపాడుతున్నారని అన్నారు. మరుగున పడుతున్న కళల అధ్యయన కేంద్రం ఏర్పాటు చేసి, సంవత్సరం అంతా ప్రదర్శనలు నిర్వహిస్తే బీసీ సంక్షేమ శాఖ నుంచి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య కిషన్‌రావు మాట్లాడుతూ గ్రామీణ దళిత యువత లలిత కళలపై ఆసక్తి కనపరుస్తున్నదని వివరించారు. అనంతరం రూ.20,116 నగదు పురస్కారంతో పత్రికా రంగంలో డి. సాయిబాబా, నాట్యరంగంలో రామలింగశాస్త్రి, జానపద కళారంగం నుంచి బ్రహ్మయ్య, గోపాలకష్ణసాయి, అవధాన ప్రక్రియ నుంచి శివరామ కష్ణశర్మ, కథా ప్రక్రియ నుంచి విహారి, విమర్శ ప్రక్రియలో ఎల్ రామచంద్ర, కవిత ప్రక్రియలో డాక్టర్ వై.రామకష్టారావు, శిల్పం ప్రక్రియ నుంచి రమణారెడ్డి, చిత్ర లేఖనంలో సాజుద్దీన్ అమర్‌లను సత్కరించారు.

గుజరాత్‌లో ఖాళీగా 32 వేలకు పైగా టీచింగ్ పోస్టులు

- 14 జిల్లాల్లో 9, 10 తరగతులకు ప్రభుత్వ ఇంగ్లీషు మీడియం స్కూళ్లు లేవు
- అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం వెల్లడి



అహ్మదాబాద్ : మోడీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో టీచింగ్ పోస్టులు భారీ సంఖ్యలో ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ, ప్రభుత్వం సాయంతో నడిచే ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత మాధ్యమిక పాఠశాలల్లో ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయ ఉద్యోగాల ఖాళీలు మొత్తం 32 వేలకు పైగా ఉన్నట్టు బీజేపీ సర్కారే రాష్ట్ర అసెంబ్లీలో తెలిపింది. గతేడాది డిసెంబర్ నాటికి 29,122 ఉపాధ్యాయ పోస్టులు, 3,552 ప్రధానోపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి కుబెర్ దిండోర్ ఈ మేరకు సమాచారం వెల్లడించారు.

ఈ సమాచారం ప్రకారం.. గుజరాత్‌లోని 14 జిల్లాలో అయితే 9, 10 తరగతులకు ప్రభుత్వ మాధ్యమిక ఇంగ్లీషు మీడియం స్కూళ్లు లేకపోవడం గమనార్హం. అలాగే, 11, 12 తరగతులకు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇంగ్లీషు మాధ్యమిక ఉన్నత పాఠశాలలు లేవు. 31 జిల్లాల్లో గ్రాంట్ ఫండెడ్ ఇంగ్లీషు లాంగ్వేజ్ ఎలిమెంటరీ స్కూళ్లు లేవు. డిజిటల్ విద్యలోనూ గుజరాత్‌లోని పలు జిల్లాలు వెనకబడే ఉన్నాయి. జామ్‌నగర్-ద్వారక జిల్లాల్లో అనేక స్కూళ్లలో కంప్యూటర్ల ల్యాబ్‌లు లేవు. జామ్‌నగర్‌లో 490 ప్రాథమిక స్కూళ్లలో, ద్వారకలో 337 ప్రాథమిక పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు లేవు. అలాగే, జామ్‌నగర్‌లో 506 ప్రైమరీ స్కూళ్లలో, ద్వారకలో 379 ప్రైమరీ స్కూళ్లలో సైన్సు ప్రయోగశాలలు లేవు. అయితే, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, మౌలిక సదుపాయల లేమిపై రాష్ట్రంలోని ప్రతిపక్ష నాయకులు బీజేపీ సర్కారు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో రాష్ట్ర ప్రభుత్వం ఆటలాడుతున్నదని గుజరాత్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి పృథ్వీ రాజ్ కథవాడియా ఆరోపించారు.

బెంగళూరులో దారుణం

- మహిళపై దుండగుల అఘాయిత్యం
- పార్కులోంచి ఈడ్చుకెళ్లి కదులుతున్న కారులో లైంగికదాడి
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



బెంగళూరు: కర్నాటకలో బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ కరువైంది. సాక్షాత్తూ రాష్ట్ర రాజధాని బెంగళూరులోనే దారుణ ఘటన చోటు చేసుకున్నది. కొందరు దుండగులు ఓ మహిళను పార్కులో నుంచి బలవంతంగా లాక్కొచ్చి కదులుతున్న కారులో లైంగికదాడికి పాల్పడ్డారు. గతనెలలో జరిగిన ఈ ఘటన.. బాధితురాలి ఆరోగ్యం బాగాలేకపోవడంతో వెలుగులోకి వచ్చింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెంగళూరుసిటీలోని కోరమంగళ ఏరియాలోగల నేషనల్ గేమ్స్ విలేజ్ పార్కులో గత నెల (మార్చి) 25న బాధితురాలు తన స్నేహితునితో కలిసి కూర్చుని మాట్లాడుతున్నది. అప్పుడు ఒక వ్యక్తి వారి దగ్గరకు వచ్చాడు. రాత్రిపూట పార్కులో ఏం చేస్తున్నారంటూ బెదిరించాడు. దాంతో భయపడిన ఆమె స్నేహితుడు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఇదే అదనుగా భావించిన ఆ బెదిరించిన వ్యక్తి తన ముగ్గురు స్నేహితులకు ఫోన్ చేసి అక్కడికి రప్పించాడు. వాళ్లు ఆమెను బలవంతంగా పార్కులోంచి లాక్కొచ్చి ముందుగానే సిద్ధంగా ఉంచిన కారులోకి తోశారు. అనంతరం ఆ కారును వీధుల్లో తిప్పుతూ కదులుతున్న కారులోనే సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. మార్చి 26న తెల్లవారుజామున బాధితురాలిని తన ఇంటి సమీపంలో విడిచిపెట్టి వెళ్లారు.ఈ ఘటన గురించి ఎవరికైనా చెప్పినా, పోలీసులకు ఫిర్యాదు చేసినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని దుండగులు ఆమెను బెదిరించారు. కానీ, ఆమె ఆరోగ్య పరిస్థితి బాగాలేక పోవడంతో కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూనే జరిగిన విషయం కుటుంబసభ్యులకు చెప్పింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితులు నలుగురిని అదుపులోకి తీసుకున్నట్టు వెల్లడించారు. ఈ ఘటనపై మహిళా సంఘాల నేతలు, సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

జైలు నుంచి విడుదల కానున్న సిద్ధూ..

చండీగఢ్: మూడున్నర దశాబ్దాల క్రితం జరిగిన ఓ ఘర్షణ కేసులో పంజాబ్ కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ క్రికెటర్ నవ్‌జ్యోత్‌సింగ్ సిద్ధూ జైలు శిక్ష అనుభవిస్తోన్న విషయం తెలిసిందే. గతేడాది మే నుంచి జైల్లోనే ఉన్న ఆయన.. ఏప్రిల్ 1న బయటకు రానున్నారు. ఈ విషయాన్ని సిద్ధూ తరపు న్యాయవాది వెల్లడించారు. సత్ప్రవర్తన కలిగిన దోషి శిక్ష నుంచి ఉపశమనం పొందే అవకాశం ఉందని చెప్పిన ఆయన.. శిక్ష తగ్గింపునకు సంబంధించి పూర్తి వివరాలను మాత్రం వెల్లడించలేదు.మరోవైపు సిద్ధూ భార్య నవ్‌జ్యోత్ కౌర్ సిద్ధూ క్యాన్సర్ బారిన పడినట్లు ఇటీవల వెల్లడైంది. ఈ విషయాన్ని ఆమె ట్విటర్‌లో వేదికగా స్వయంగా వెల్లడించారు. అయితే, ఇటువంటి ఆపద సమయంలో భర్త కోసం ఎంతో వేచిచూస్తున్నానని అన్నారు. జైల్లో ఉన్న సిద్ధూ కంటే బయట ఉన్న తానే ఎక్కువ బాధను అనుభవిస్తున్నానంటూ నవ్‌జ్యోత్ కౌర్ ఆవేదన వ్యక్తం చేశారు.ఇదిలాఉంటే, 34 ఏళ్ల క్రితం జరిగిన ఓ ఘర్షణకు సంబంధించిన కేసులో నవ్‌జ్యోత్‌సింగ్ సిద్ధూకు ఏడాది పాటు జైలు శిక్ష పడింది. 1988 డిసెంబరు 27న పాటియాలో పార్కింగ్ విషయంలో జరిగిన ఘర్షణలో 65ఏళ్ల గుర్నామ్ సింగ్ తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయాడు. ఈ కేసులో సిద్ధూతోపాటు రూపిందర్ సింగ్‌పై దాడి చేశారనే అభియోగాలు నమోదయ్యాయి. ఈ కేసుపై పలు కోర్టుల్లో విచారణ ముగిసిన అనంతరం.. ఏడాది జైలు శిక్ష విధిస్తూ సుప్రీంకోర్టు 2022 మే నెలలో తీర్పువెలువరించింది. దీంతో మే 20న సిద్ధూ కోర్టుముందు లొంగిపోయిన ఆయన్ను పటియాలా సెంట్రల్ జైలుకు తరలించారు.

ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయండి..

- పాశిగామ గ్రామస్తుల రాస్తారోకో
- పురుగుల మందు డబ్బాలు పట్టుకుని నిరసన
- లాఠీచార్జిలో పలువురికి గాయాలు



నవతెలంగాణ-వెల్గటూర్

ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం పాశిగామ గ్రామస్తులు కరీంనగర్-రాయపట్నం రాష్ట్ర రహదారిపై రాస్తారోకో చేశారు. పరిశ్రమను రద్దు చేయకుంటే ఆత్మహత్య చేసుంటామంటూ.. పురుగుల మందు డబ్బాలు పట్టుకొని నిరసన తెలిపారు. ఇథనాల్ పరిశ్రమ పెట్టి తమ ప్రాణంతీయొద్దని మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారికి డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మద్దతు తెలిపి రాస్తారోకో పాల్గొన్నారు. గ్రామసభ పెట్టకుండా, గ్రామస్తుల అభిప్రాయాలు తెలుసుకోకుండా ఫ్యాక్టరీని ఎలా పెడతారని ప్రశ్నించారు. ఇథనాల్ ఫ్యాక్టరీ వల్ల ఈ ప్రాంత ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లితుందన్నారు. వెంటనే నేషనల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించి ప్రజలు అనుమతిస్తేనే ఫ్యాక్టరీ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో పోలీసులు వచ్చి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను అరెస్టు చేసి తీసుకెళ్తుండగా మహిళలు పోలీసు వాహనాన్ని అడ్డుకున్నారు. దీంతో లాఠీచార్జి చేయడంలో పలువురు మహిళలకు గాయాలయ్యాయి. అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను సారంగాపూర్ స్టేషన్‌కు తరలించారు.

ఎంపీ అర్వింద్ తెచ్చిన 'బోర్డు' ఇదే

నిజామాబాద్‌లో 'పచ్చని' ఫ్లెక్సీ ఏర్పాటుచేసిన రైతులు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్‌లో పసుపు 'బోర్డు' ఏర్పాటయిందంటూ ఫ్లెక్సీలు వెలిశాయి. ఎంపీ అరవింద్ రైతులకు ఇచ్చిన హామీ మేరకు కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డు ఏర్పాటు చేసిందని అనుకుంటే మీరు 'పసుపులో' కాలేసినట్టే. ఎంపీ అరవింద్ దృష్టిలో పసుపు బోర్డులు ఇవే అంటూ పచ్చని ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. నిజామాబాద్ నగరంలోని ప్రధాన కూడళ్లలో, రద్దీ ప్రాంతాల్లో గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం ఏర్పాటు చేశారు. దాంతో రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమయింది.

గత పార్లమెంట్ ఎన్నికల్లో పసుపు బోర్డు ఏర్పాటే ప్రధాన అస్త్రంగా బీజేపీ నుంచి ఎంపీ అరవింద్ పోటీపడిన విషయం తెలిసిందే. ప్రచారంలో భాగంగా తాను గెలిచిన ఐదు రోజుల్లో పసుపు బోర్డు తీసుకువస్తానని, ఒక వేళ తీసుకురాలేని పక్షంలో పదవికి రాజీనామా చేసి రైతులతో కలిసి ఉద్యమిస్తానని.. పోలింగ్‌కు రెండు రోజుల ముందు అరవింద్ బాండ్ పేపర్ రిలీజ్ చేసిన విషయం విధితమే. కాగా గెలిచిన నాటి నుంచి పసుపు బోర్డుపై రైతులు ప్రశ్నించినప్పుడల్లా దాటవేస్తూ వస్తున్నారు. దాంతో ఎంపీ అరవింద్‌ను ఎప్పటికప్పుడు రైతులు అడ్డుకుంటూ నిలదీస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో నిజామాబాద్ నగరంలో ఫ్లెక్సీలు ఏర్పాటు కావడం చర్చనీయాంశమైంది.

384 ఔషధాల ధరలు 12.12 శాతం పెంపు

భారీ పెంపు ఇదే తొలిసారి

- నేటీ నుంచి అమలకు కేంద్రం నిర్ణయం

న్యూఢిల్లీ : క్యాన్సర్, గుండె జబ్బులు, మధుమేహంతో సహా నిత్యం వాడే మందుల ధరలు భారీగా పెరగనున్నాయి. నేటీ (ఏప్రిల్ 1) నుంచి ధరలు అమలులోకి రానున్నాయి. 27 రకాల చికిత్సలకు సంబంధించిన 384 నిత్యావసర ఔషదాలు, 1,000 కంటే ఎక్కువ ఫార్ములేషన్స్ ధరలను 12.12 శాతం పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గతేడాది 10.7 శాతం ధరల పెంచారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పిపిఎ) స్థూల ధరల సూచీ పెరుగుదల ఆధారంగా అవసరమైన ఔషధాల ధరలను పెంచడానికి తయారీదారులను అనుమతించింది. జ్వరం మందులు (పారాసిటమాల్ వంటివి), యాంటి బయోటిక్స్ (అజిత్రోమైసిన్ వంటివి), అంటువ్యాధులు, గుండె సంబంధిత వ్యాధులు, రక్తపోటు (బిపి), డయాబెటిస్ (షుగర్), చర్మవ్యాధులు, ఇన్‌ఫెక్షన్లు, రక్తహీనత (ఫోలిక్ యాసిడ్ వంటి ఔషధాలు), రక్తప్రసరణ సంబంధిత జబ్బులు, క్షయ (టిబి), వివిధ రకాల క్యాన్సర్లు వంటి వాటి మందులతోపాటు మినరల్, విటమిన్ మాత్రలు, పెయిన్ కిల్లర్లు, యాంటీబయాటిక్స్, యాంటీఇన్ఫెక్టివ్స్ ధరలు పెరగనున్నాయి.

అవసరమైన మందుల జాబితాలోలేని మందులపై వార్షిక ధరలను 10 శాతం పెంచడాన్ని కమిటీ ఆమోదించింది. అయితే నిత్యావసర మందులకు 12 శాతం పెంపును అనుమతించడం ఇదే తొలిసారి. నాన్-షెడ్యూల్డ్ డ్రగ్స్‌కు అనుమతించిన దానికంటే ఎక్కువ పెంపుదల జరగడం ఇది వరుసగా రెండో సంవత్సరం. 2013లో ఔషధ ధరల నియంత్రణ చట్టం అమల్లోకి వచ్చిన తరువాత, ప్రతి సంవత్సరం మందుల ధరలను సవరిస్తూ వచ్చిన తరువాత ఇంత భారీ స్థాయిలో పెరగడం ఇదే తొలిసారి. అంతకు ముందు ప్రతి మూడేండ్లకు ఒకసారి ధర పెంపు ఉండేది. ధరల పెంపునకు ముందు, అవసరమైన మందుల జాబితాను సిద్ధం చేసే స్టాండింగ్ కమిటీ, 34 కొత్త మందులు, 26 మందులను మినహాయించి 384 మందుల జాబితాను విడుదల చేసింది. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న మందులను ఎంఆర్‌పి నమోదు చేసిన తరువాత అదే ధరకు విక్రయించాల్సి వస్తోంది. కొత్త స్టాక్ వచ్చినప్పుడు ధరలు మారుతాయి.

ఇది వినియోగదారులను దెబ్బతీసే అవకాశం ఉంది. వీరిలో చాలా మంది ఔషధాల ధరలు గతేడాది కంటే ఇప్పటికే 20 శాతం పెరిగాయని వినియోగదారులు చెబుతున్నారు. గత 12 నెలల్లో ప్రతి 10 మంది వినియోగదారుల్లో ఆరుగురు ఔషధాల ధరల్లో 20 శాతం పెరుగుదలను అనుభవించారని, మధుమేహం, రక్తపోటు, కీళ్లనొప్పులు, క్యాన్సర్‌కు సంబంధించిన ప్రత్యేక ఔషధాల ధరలు ఎక్కువగా పెరిగాయని ఒక సర్వేలో తేలింది.

కమ్యూనిటీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ లోకల్ సర్కిల్స్ నిర్వహించిన సర్వేలో 58 శాతం మంది వినియోగదారులు సాధారణంగా ఉపయోగించే మందుల ఎంఆర్‌పి కంటే పెరిగినట్టు సూచించారని తేలింది. మెజారిటీ వినియోగ దారులు కేంద్ర ప్రభుత్వం ఔషధాలపై ట్రేడ్ మార్జిన్లను 50 నుంచి 100 శాతం వరకు పరిమితం చేయాలని కోరుకుంటున్నారని స్పష్టం అయింది.



అధిక విమాన ఛార్జీలను నియంత్రించాలి

- ప్రధాని మోడీకి కేరళ సీఎం పినరయి విజయన్ లేఖ



న్యూఢిల్లీ : అధిక విమాన ఛార్జీలను నియంత్రించాలని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి పినరయి విజయన్ లేఖ రాశారు. రద్దీ సమయాల్లో అధిక ఛార్జీలను అరికట్టేందుకు విమానయాన సంస్థలతో చర్చలు జరపాలని కోరారు. గల్ఫ్ దేశాల నుంచి కేరళకు వచ్చే ఛార్జీలు రెండు నెలల్లో మూడు రెట్లు పెరిగాయని, పండుగలు, పాఠశాల సెలవులు వంటి సందర్భాల్లో పెంపులు సాధారణ ప్రయాణీకులకు చాలా భారంగా ఉంటుందని తెలిపారు. నెలల తరబడి శ్రమించి సంపాదించిన చిరు పొదుపును టిక్కెట్టుకే వెచ్చించాల్సి వస్తోందని, ఛార్జీలను సవరించాలని కేరళ ప్రభుత్వం, ప్రవాస సంస్థలు చేసిన అభ్యర్థనలను విమానయాన సంస్థలు వినలేదని పేర్కొన్నారు. గల్ఫ్ దేశాల్లోని అల్పాదాయ కార్మికులకు పండుగలు, సెలవు దినాల్లో సరసమైన ధరలకు ప్రత్యేక సేవలు అందించాలని కేరళ ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. ఏప్రిల్ రెండో వారం నుంచి కేరళ ప్రభుత్వం బుక్ చేసుకున్న కార్యకలాపాలకు త్వరితగతిన అనుమతి ఇవ్వాలని పౌర విమానయాన మంత్రిత్వ శాఖను ఆదేశించాలని లేఖలో డిమాండ్ చేశారు.

ప్రాణాలు తీసిన మస్కిటో కాయిల్

- పొగ పీల్చి ఆరుగురు మృతి
- దేశరాజధాని ఢిల్లీలో ఘటన

న్యూఢిల్లీ : దోమల బాధ నుంచి తప్పించుకోవడం కోసం ఉపయోగించే మస్కిటో కాయిల్ ఒకే కుటుంబంలోని ఆరుగురి ప్రాణాలు తీసింది. ఈ ఘటన దేశరాజధాని ఢిల్లీలో శుక్రవారం చోటు చేసుకుంది. ఢిల్లీ సీనియర్ పోలీసు అధికారి తెలిపిన వివరాల ప్రకారం.. శాస్త్రీ పార్క్ సమీపంలో నివాసం ఉండే ఓ కుటుంబం దోమలు కుట్టకుండా ఉండేందుకు రాత్రి పడుకునే ముందు ఇంట్లో మస్కిటో కాయిల్ వెలిగించారు. దాని నుంచి వచ్చిన కార్బన్ మోనాక్సైడ్ వాయువును పీల్చారు. దీంతో ఊపిరాడక నిద్రలోనే ఆ కుటుంబంలోని ఆరుగురు మృతి చెందినట్టు జోయ్ టిర్కీ వెల్లడించారు. మృతి చెందిన ఆరుగురిలో నలుగురు పురుషులు, ఒక మహిళ, ఒక చిన్నారి ఉన్నారు. మరో ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు జోయ్ టిర్కీ వెల్లడించారు.

35కు చేరిన ఇండోర్ మెట్లబావి మృతులు



ఇండోర్: మధ్యప్రదేశ్ రాజధాని ఇండోర్‌లో మెట్లబావి పైకప్పు కూలిన ఘటనలో మృతుల సంఖ్య 35కు చేరింది. పటేల్ నగర్‌లోని బలేశ్వర్ మహదేవ్ జులేలాల్ గుడిలో ఆలయంలో ఉన్న మెట్ల బావి పైకప్పు ఒక్కసారిగా కూలడంతో దాదాపు 50 మంది భక్తులు అందులోపడిపోయారు. దీంతో ఇప్పటివరకు 35 మంది చనిపోయారు. మరో 18 మంది గాయపడి చికిత్స పొందుతున్నారని నగర పోలీస్ కమిషనర్ తెలిపారు. 19 మందిని ప్రమాదం నుంచి రక్షించారు.

ఇండోర్‌లోని మహదేశ్ జులేలాల్ అయంలో గురువారం జరిగిన శ్రీరామనవమి ఉత్సవాలను చూసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయంలో స్థలం లేకపోవడంతో వేడుకలను చూసేందుకు కొందరు భక్తులు గుడిలో ఉన్న మెట్ల బావిపై కూర్చున్నారు. అయితే బరువు అధికమవడంతో పురాతనమైన ఆ బావి పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో సుమారు 50 మంది భక్తులు అందులో పడిపోయారు.

కళాక్షేత్రలో లైంగిక వేధింపులు

- విద్యార్థుల ఆరోపణలు
- అణచివేయదానికి కేంద్రం ప్రయ్నతం
- చర్యలు తీసుకుంటామని స్టాలిన్ హామీ

చెన్నై : కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ నేతృత్వంలోని కళాక్షేత్ర ఫౌండేషన్‌లో విద్యార్థులపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయనే ఆరోపణలు తమిళనాడులో కలకలం సృష్టిస్తున్నాయి. ఈ ఆరోపణలను అణిచివేయడానికి కేంద్ర ప్రయత్నిస్తుందని విమర్శలు వస్తున్నాయి. దీంతో కళాక్షేత్రలో లైంగిక వేధింపుల అంశంపై తమిళనాడు అసెంబ్లీ శుక్రవారం దద్దరిల్లింది. ఆరోపణలపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ హామీ ఇచ్చారు. 'ఈ ఆరోపణలపై మా ప్రభుత్వం దర్యాప్తు నిర్వహిస్తుంది. ఆరోపణలు నిజమని రుజువు అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం' అని అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటించారు. రాష్ట్ర పోలీసు, రెవెన్యూ శాఖకు చెందిన అధికారుల కలయికతో ఏర్పాటు చేసిన బృందం ఇప్పటికే ఈ విషయంపై దర్యాప్తు ప్రారంభించిందని చెప్పారు. కళాక్షేత్రం క్యాంపస్ సందర్శించి, విద్యార్థులు, యాజమాన్యంతో చర్చలు జరిపిందని కూడా తెలిపారు. మహిళా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నేతృత్వంలోని పోలీసు భద్రతా బృందం కళాక్షేత్రంలో మోహరించిందని కూడా వెల్లడించారు.

కేంద్రం ఆధ్వర్యంలో నడిచే కళాక్షేత్రంలో లైంగిక వేధింపుల ఆరోపణలను అణిచేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఈ సందర్భంగా అసెంబ్లీలో కొంతమంది ఎమ్మెల్యేలు ఆరోపించారు. మార్చి 29న కేళాక్షేత్రం క్యాంపస్‌లో జాతీయ మహిళా కమిషన్ చైర్ పర్సన్ రేఖాశర్మ పర్యటనను, ఇక్కడ లైంగిక వేధింపులు జరగలేదని, ఎలాంటి పోలీసు ఫిర్యాదులు లేవని కమిషన్ ప్రకటనను విసికె పార్టీ ఎమ్మెల్యే ఎస్ఎస్ బాలాజీ (తిరుపూరుర్ నియోజకవర్గం) ప్రశ్నించారు. రాష్ట్ర పోలీసులు సహాయం లేకుండానే క్యాంపస్‌లో రేఖాశర్మ పర్యటించడం అనుమానం కలిగిస్తుందని చెప్పారు. ఒకవైపు లైంగిక వేధింపులు జరుగుతున్నాయని విద్యార్థులు ఆందోళనలు చేస్తుంటే వేధింపులు లేవని రేఖాశర్మ ఎలా చెబుతారని కాంగ్రెస్ ఎమ్మెల్యే కె సెల్వపెరునాథ్‌గై (శ్రీపెరంబదూర్) ప్రశ్నించారు. ఆరోపణలు చేయకుండా విద్యార్థులను బెదిరిస్తున్నారని, కళాక్షేత్రం, హస్టల్‌ను మూసివేస్తామని కూడా భయపెడుతున్నారని సిపిఐ ఎమ్మెల్యే టి రామంద్రన్ (తళ్లై) ఆరోపించారు.

విద్యార్థుల నిరవధిక సమ్మె ప్రారంభం

కళాక్షేత్ర ఫౌండేషన్‌లో లైంగిక వేధింపులకు పాల్పడుతున్న నలుగురు సిబ్బందిని విధుల నుంచి తొలగించాలనే డిమాండ్‌లో సుమారు 250 మంది విద్యార్థులు గురువారం ఉదయం నుంచి నిరవధిక సమ్మె ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ శాస్త్రీయ కళల శిక్షణలో ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందిన ఈ సంస్థలో కొన్ని ఏళ్ల నుంచి లైంగిక వేధింపులు కొనసాగుతున్నాయని ఆరోపించారు. సంస్థ డైరెక్టర్, ఇతర అధికారులతో తమ సమస్య గురించి చెప్పుకుంటే తమనే టిసి తీసుకుని వెళ్లిపోమ్మని చెబుతారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ (నృత్యం), మరో ముగ్గురు రిపర్టరీ ఆర్టిస్టులు అనేక మంది విద్యార్థినులను లైంగిక వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. వీరిని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే క్యాంపస్, హస్టల్‌లో బాడీ షేమింగ్, మాటల వేధింపులు ఆపాలని, కౌన్సలర్‌ను కూడా మార్చాలనేవి తమ ఇతర డిమాండ్లగా విద్యార్థులు చెప్పారు.

విద్యార్థుల నిరసనతో కళాక్షేత్ర కాలేజ్‌ను శుక్రవారం నుంచి ఆరు రోజుల పాటు మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. హస్టల్ యథావిధిగా ఉంటుందని తెలిపారు.

చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

కేంద్ర మంత్రి అమిత్ షాకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం వినతి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర మంత్రి అమిత్ షాను సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య, నాయకులు కలిశారు. పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జన గణన బీసీ కులాల గణన చేపట్టాలని కోరారు. ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు, ఇతర డిమాండ్ల పరిష్కారానికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని కృష్ణయ్య తెలిపారు.

కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలని డిమాండ్ చేస్తూ కరెన్సీపై అంబేద్కర్ ఫోటో సాధన సమితి ఆధ్వర్యంలో జంతర్ మంతర్‌లో శుక్రవారం ధర్నా నిర్వహించారు. సమితి అధ్యక్షుడు జేరిపోతుల పరశురామ్ మాట్లాడుతూ కరెన్సీ నోట్లపై బిఆర్ అంబేద్కర్ ఫొటో ముద్రించే దిశలో ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ధర్నాకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య సంఘీభావం తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని కోరుతూ టీఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో జంతర్ మంతర్‌లో శుక్రవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా టీఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాయికంటే రాందాస్ మాదిగ మాట్లాడుతూ ఎస్‌సీ వర్గీకరణకు అన్ని పార్టీలు మద్దతు పలుకుతున్నందున వెంటనే పార్లమెంట్‌లో బిల్లు పెట్టి ఆమోదించాలని కోరారు. వర్గీకరణ అమలయితేనే మాదిగ ఉప కులాలకు న్యాయం జరుగుతుందన్నారు.

మనీశ్ సిసోడియాకు బెయిల్ నిరాకరణ

- సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పు



న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆమ్‌ఆద్మీ పార్టీ సీనియర్ నేత, ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు ఎదురుదెబ్బ తగిలింది. సీబీఐ కేసులో ఆయనకు బెయిల్ ఇచ్చేందుకు రౌస్ అవెన్యూ సీబీఐ ప్రత్యేక కోర్టు నిరాకరించింది. సీబీఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఎంకె నాగపాల్ ఈనెల 24న సిసోడియా బెయిల్ అభ్యర్థనపై తీర్పును మార్చి 31కి వాయిదా వేశారు. ఆ తీర్పును శుక్రవారం వెలువరించారు. సిసోడియా రెగ్యులర్ బెయిల్ అప్లికేషన్‌ను వ్యతిరేకిస్తూ సీబీఐ లిఖిత పూర్వకమైన వివరాలు కోర్టుకు తెలియజేసిందని, కాపీ ప్రతిని సిసోడియా న్యాయవాదికి ఇవ్వడం జరుగుతుందని, కేసు డెయిరీ, సాక్ష్యుల వివరాలకు సంబంధించిన కాపీని కూడా అందుబాటులో ఉంచుతామని ప్రత్యేక న్యాయమూర్తి తెలిపారు. 2021-22 ఎక్సైజ్ పాలసీ రూపకల్పన, అమలు విషయంలో అవినీతికి ఆరోపణలపై సిసోడియాను ఇంతవరకూ ఏడు రోజుల పాటు సీబీఐ ప్రశ్నించింది. ఫిబ్రవరి 26న అరెస్టు చేసింది. దీంతో తీహార్ జైలుకు వెళ్లిన ఆయనను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరైట్ మార్చి 9న అరెస్టు చేసింది. కాగా, సిసోడియా జ్యుడిషియల్ కస్టడీని ఏప్రిల్ 5 వరకూ ఢిల్లీ రౌస్ ఎవెన్యూ కోర్టు పొడిగించింది.

రూ.2,235 కోట్లతో వరంగల్-ఖమ్మం మధ్య జాతీయ రహదారుల విస్తరణ : నితీన్ గడ్కరీ

న్యూఢిల్లీ : రూ.2,235.08 కోట్లతో వరంగల్-ఖమ్మం మధ్య జాతీయ రహదారుల విస్తరణ చేపట్టనున్నట్టు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారులు మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. శుక్రవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. వరంగల్-ఖమ్మం (ఎన్‌హెచ్163జి) సెక్షన్‌లో వరంగల్ జిల్లాలోని వెంకటాపూర్ గ్రామం నుంచి మహబూబాబాద్ జిల్లాలోని తాళ్లసేనకేశ గ్రామం వరకు 39.410 కిలోమీటర్ల మేరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి ఆమోదించినట్టు తెలిపారు. "యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్ ఫీల్డ్ హైవే" కింద నాలుగు లైన్ల రహదారి నిర్మిస్తున్నామని, దీనికోసం రూ.1,111.76 కోట్ల ఆమోదించామని పేర్కొన్నారు. ఇది అదర్ ఎకనామిక్ కారిడార్ (ఎన్‌హెచ్(ఓ)) కార్యక్రమం కింద హైబ్రిడ్ యాన్యుటీ మోడ్‌లో అభివృద్ధి చేయబడుతుందని తెలిపారు.

వరంగల్-ఖమ్మం (ఎన్‌హెచ్163జి) సెక్షన్‌లో తాళ్లసేనకేశ గ్రామం నుంచి ఖమ్మం జిల్లాలోని వెంకటాయపాలెం గ్రామం వరకు 30.830 కిలోమీటర్ల మేర నాలుగు లైన్ల యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి రూ.1,123.32 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు. ఇది కూడా అదర్ ఎకనామిక్ కారిడార్ (ఎన్‌హెచ్(ఓ)) కార్యక్రమం కింద హైబ్రిడ్ యాన్యుటీ మోడ్‌లో అభివృద్ధి చేయబడుతుందని తెలిపారు. ఈ రెండు రహదారులను కలిపి మొత్తం 70 కిలోమీటర్ల రహదారిని "హైబ్రిడ్ అన్యుటీ మోడ్"లో నిర్మాణం జరుగుతోందని, మొత్తం రహదారి నిర్మాణానికి అయ్యే ఖర్చులో "భారత జాతీయ రహదారుల సంస్థ" (ఎన్‌హెచ్ఏఐ) 40 శాతం, ప్రైవేట్ సంస్థలు 60 శాతం భరించాలని తెలిపారు. "యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్ ఫీల్డ్ హైవే సెక్షన్" కింద నిర్మాణం జరిగే రహదారులన్నీ కొత్తగా భూసేకరణ చేసి, వ్యవసాయ భూముల్లో నిర్మాణం జరిగే రహదారులని, చాలా వేగంగా వాహనాలు వెళ్ళేందుకు అనువైన రహదారులుగా నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. అయితే అక్కడక్కడ 15 కిలోమీటర్లు, 20 కిలోమీటర్ల వద్ద, ఇతర రహదారుల నుంచి వాహనాల రాకపోకలకు వెసులుబాటు ఉండేలా ఈ రహదారుల నిర్మాణం జరుగుతుందని తెలిపారు.

ముగిసిన ఉపాధి 'ఆధార్' గడువు

- పొడగింపుపై కేంద్రం నుంచి రాని ప్రకటన
- అనుకూలమైన చెల్లింపు విధానాన్ని పునరుద్ధరించాలి : ఎన్‌ఆర్‌ఈజీఏ సంఘర్ష్

న్యూఢిల్లీ : 'ఉపాధి హామీ' పథకం కింద ఆధార్ ఆధారిత చెల్లింపుల కోసం లబ్దిదారుల పేరు నమోదుకు తుది గడువు శుక్రవారం (మార్చి 31)తో ముగిసింది. అయితే, గడువు పొడిగింపుపై మాత్రం కేంద్రం నుంచి ఎలాంటి ప్రకటనా వెలువడకపోవడం గమనార్హం.

దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఉపాధిని కల్పించే పథకం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్). ఈ చట్టం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ ఏడాదిలో 100 రోజుల పనిని కల్పిస్తుంది. ఈ పథకం కింద లబ్దిదారులకు ఆధార్ లేదా బ్యాంకు ఖాతా ద్వారా చెల్లింపులు జరిగేవి. అయితే, లబ్దిదారులకు చేసే చెల్లింపుల విషయంలో మోడీ సర్కారు మార్పులు తీసుకొచ్చింది. ఫిబ్రవరి 1న ఈ పథకం కింద అన్ని చెల్లింపులను ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ(ఏబీపీఎస్) ద్వారా చేసేలా తప్పనిసరి చేసింది. అంతకముందు, బ్యాంకు ఖాతా ఆధారిత చెల్లింపును ఎంచుకొనే అవకాశం ఉండేది.

మోడీ ప్రభుత్వం ఆధార్ ఆధారిత చెల్లింపులను తీసుకురావడంపై లబ్దిదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీనిపై ఉపాధి కార్మికులు ఇప్పటికే తమ వ్యతిరేకతను నిరసనల రూపంలో ప్రదర్శించారు. వీరికి సామాజిక కార్యకర్తలు, రాజకీయ నాయకులు మద్దతుగా నిలిచారు. మోడీ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఆధార్ ఆధారిత చెల్లింపులకు కేవలం 43శాతం కార్మికులు అర్హులవుతారనీ, కొత్త చెల్లింపు విధానం ఏ మాత్రమూ పని చేయదని వారు వాదించారు.

ఆధార్ చెల్లింపు నమోదు తుది గడువు విషయాన్ని కేంద్రం పరిశీలించాలని ఎన్ఆర్ఈజీఏ సంఘర్ష్ మోర్చా కేంద్రాన్ని ఇప్పటికే కోరింది. ఆధార్ ఆధారిత చెల్లింపులకు 50 శాతం కంటే తక్కువ మందే అర్హులవుతారనీ, కొత్త నిబంధన కారణంగా మొత్తం కార్యక్రమం కుప్పకూలుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. చెల్లింపు వ్యవస్థ అర్హత అవసరాలను తీర్చడానికి ఉపాధి కార్మికులకు తగిన సమయం ఉంటుందని అనుకుంటున్న కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఊహ తప్పు అని ఒక ప్రకటనలో వివరించింది. కొత్త చెల్లింపు విధానం సంక్లిష్టమైనదనీ, గతంలో తీవ్ర సమస్యలను తీసుకొచ్చిందని పేర్కొన్నది. దీనిని తప్పనిసరి చేసే కారణమేదీ లేదని వివరించింది. అకౌంట్ ఆధారిత చెల్లింపు వ్యవస్థను ఎందుకు నిలిపివేశారన్నదానిపై కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సమాధానం చెప్పలేకపోతున్నదని ఎన్ఆర్ఈజీఏ సంఘర్ష్ ఆరోపించింది.

మార్కెట్లకు కొనుగోళ్ల మద్దతు

- తుది రోజు సెన్సెక్స్ 1031 పాయింట్ల వృద్ధి

ముంబయి : ఆర్థిక సంవత్సరం తుది రోజు దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ లాభాల్లో ముగిశాయి. కొనుగోళ్ల మద్దతుతో శుక్రవారం సెషన్‌లో బిఎస్ఇ సెన్సెక్స్ 1031 పాయింట్లు పెరిగి 58,992కు చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 279 పాయింట్లు రాణించి 17,381 వద్ద ముగిసింది. బ్యాంకింగ్ రంగ సంక్షోభం వల్ల నెలకొన్న ఆందోళనలు క్రమంగా తొలగిపోవడంతో మార్కెట్లలో విశ్వాసం పెరిగింది. గత కొన్ని రోజులుగా దేశీయ సూచీల్లో అమ్మకాలు చోటు చేసుకున్నాయి. తక్కువ ధరల వద్ద సూచీలు ఉండటంతో కొనుగోళ్లకు ఆసక్తి చూపారు.

రూ.3.6 లక్షల కోట్లు ఆవిరి..

గడిచిన ఆర్థిక సంవత్సరం 2022-23 మార్కెట్లకు చేదు అనుభ వాన్ని మిగిల్చింది. 2023 మార్చి 31తో ముగిసిన ఏడాదిలో బిఎస్ఇ సెన్సెక్స్‌లోని టాప్ 30 సూచీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.3.6 లక్షల కోట్లు ఆవిరై రూ.113.58 లక్షల కోట్లకు పరిమితమైంది. ఇంతక్రితం ఏడాది ఇదే కాలానికి వీటి విలువ రూ.117.23 లక్షల కోట్లుగా ఉంది. ఐటి రంగం 21 శాతం, లోహ సూచీ 17 శాతం, టెలికం 15.91 శాతం, రియాల్టీ 14.28 శాతం చొప్పున పడిపోయాయి. అధిక ధరలు, హెచ్చు వడ్డీ రేట్లు, ప్రతికూల అంతర్జాతీయ పరిణామాలు, అదానీ గ్రూపు అక్ర మాలతో కార్పొరేట్ కంపెనీలపై ఇన్వెస్టర్లకు విశ్వాసం సన్నగిల్లింది.

ఆజ్మీర్‌లో ఓయో ఉచిత వసతి

న్యూఢిల్లీ : రంజాన్ పండుగ సందర్భంగా ఆజ్మీర్‌లో ఉచిత వసతి అందిస్తున్నట్లు ఓయో హెూటల్స్ తెలిపింది. అక్కడి హెూటల్ వైభవ్, హెూటల్ జెసి ప్యాలెస్‌లో ఉచిత సౌకర్యాలు పొందవచ్చని పేర్కొంది. ఇవి నయా బజార్ దర్గాకు అతి సమీపంలో ఉన్నాయని తెలిపింది. తమ యాప్ ద్వారా, వెబ్‌సైట్‌ను సంప్రదించి ఈ సదుపాయాన్ని ఉపయో గించుకోవచ్చని వెల్లడించింది.

ప్రపంచ బ్యాంక్ ప్రెసిడెంట్‌గా అజయ్ బంగా..

వాషింగ్టన్ : ప్రపంచ బ్యాంక్ ప్రెసిడెంట్ పదవీకి కేవలం ఒక్క నామినేషన్ మాత్రమే వచ్చింది. ఇండో అమెరికన్, వ్యాపారవేత్త అజయ్ బంగా మాత్రమే నామినేషన్ వేశారు. దీంతో ఆయన ఎన్నిక లాంఛనం కానుంది. ఈ పదవిని చేపట్టిన తొలి భారతీయ అమెరికన్‌గా బంగా నిలిచిపోనున్నారు. బంగా కు పోటీగా ఇతర ఏ దేశమూ తమ అభ్యర్థిని ప్రకటించకపోవడం విశేషం. బంగా గతంలో మాస్టర్‌కార్డ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు.

ట్రంప్‌పై నేరారోపణలు

- పోర్న్ స్టార్‌తో ఒప్పందంపై కోర్టు అభిశంసన
- వచ్చే వారం లొంగిపోనున్న ట్రంప్ ?
- వ్యాఖ్యకు తిరస్కరించిన వైట్‌హౌస్



వాషింగ్టన్ : అగ్రరాజ్యం అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అప్రతిష్టపాలయ్యారు. నేరం చేసి అది బయటకు రానివ్వకుండా చేసేందుకు ఆ నేర భాగస్వామితో రహస్యంగా ఒప్పందం కుదుర్చుకున్నారన్న ఆరోపణలు రుజువవడంతో మన్‌హటన్ గ్రాండ్ జ్యూరీ ట్రంప్‌ను అభిశంసించిది. దీంతో నేరారోపణలు ఎదుర్కొంటున్న మొదటి మాజీ అధ్యక్షుడిగా ఆయన అపఖ్యాతి మూటగట్టుకున్నారు. వచ్చే ఏడాది జరగనున్న అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేయాలన్న ట్రంప్ ప్రయత్నాలకు తాజా చర్యలతో ఎదురు దెబ్బ తగిలినట్లైంది. 2016 అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో తనతో వివాహేతర సంబంధం వుందంటూ ఆరోపణలు చేసిన పోర్న్ స్టార్ స్టార్మీ డేనియల్స్‌కి ఆ విషయం బయటకు రానివ్వకుండా డబ్బులిచ్చి నోరు మూయించారన్న ఆరోపణలు రుజువవడంతో గ్రాండ్ జ్యూరీ ఆయనపై అభియోగాలు మోపింది. ఈ నేపథ్యంలో ఆయన న్యాయస్థానంలో లొంగిపోక తప్పదని భావిస్తున్నారు. అయితే అది ఎలా జరుగుతుందనే దానిపైనే ప్రస్తుతం అందరి దృష్టి వుంది. మన్‌హటన్ జిల్లా అటార్నీ ఇప్పటికే ట్రంప్ లీగల్ బృందంతో చర్చలు జరిపారు. ఒకవేళ ట్రంప్ మన్‌హటన్ కోర్టులో లొంగిపోయినట్టైతే, ఆయనను సుప్రీంకోర్టులో హాజరుపరిచేందుకు అవకాశాలు వున్నాయి. కాగా, తానే తప్పు చేయలేదంటూ ఇప్పటివరకు పదే పదే తిరస్కరిస్తూ వచ్చిన ట్రంప్ తాజాగా తనపై వచ్చిన ఈ అభిశంసనను కూడా రాజకీయ వేధింపులుగానే అభివర్ణిస్తున్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యున్నత స్థాయిలో ఎన్నికల జోక్యంగా దీన్ని వ్యాఖ్యానించారు. అయితే ఈ కేసు విచారణ సందర్భంగా తనను అరెస్టు చేయడానికి అవకాశాలు వున్నాయంటూ ట్రంప్ ఇటీవల అనుమానాలు వ్యక్తం చేశారు. కాగా ట్రంప్ ఎలాంటి నేరం చేయలేదని, కోర్టులో దీన్ని తప్పక సవాలు చేస్తామని డిఫెన్స్ లాయర్లు చెప్పారు. కాగా ట్రంప్ అభిశంసనను మన్‌హటన్ జిల్లా అటార్నీ కార్యాలయ ప్రతినిధి ధృవీకరించారు. ట్రంప్ లొంగిపోయేలా చూసేందుకు ప్రాసిక్యూటర్లు డిఫెన్స్ బృందాన్ని సంప్రదిస్తున్నారని ఆయన తెలిపారు. బహుశా వచ్చే వారం ట్రంప్ మన్‌హటన్ జిల్లా అటార్నీ కార్యాలయంలో లొంగిపోవచ్చని భావిస్తున్నట్లు చెప్పారు. ట్రంప్ తరపు న్యాయవాది జో తకొపైనా మీడియాకు చెప్పారు. ప్రస్తుతం ట్రంప్ తన బృందంతో దీనిపై చర్చిస్తున్నారన్నారు. భద్రతా కారణాల రీత్యా ఆయన ఎలా వస్తారు, ఏర్పాట్లు ఏమిటనే విషయాలను ట్రంప్ లీగల్ బృందం చూసుకోనుంది. ఈ కేసులో ట్రంప్ దోషిగా తేలినప్పటికీ వచ్చే ఏడాది అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేయడానికి ఆయన అనర్హుడు కాబోరు. గతేడాది నవంబరులోనే ట్రంప్ తన అభ్యర్థిత్వ పత్రాలను దాఖలు చేశారు. కాగా, ట్రంప్‌పై వచ్చిన అనూహ్యమైన అభియోగాలపై వ్యాఖ్యానించడానికి వైట్‌హౌస్ తిరస్కరించింది.

మోడీపై న్యాయపరమైన చర్యలు తీసుకునే ఆలోచనలోఉన్నా.. : రేణుకా చౌదరి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నాపై మోడీ చేసిన వ్యాఖ్యలపై న్యాయపరమైన చర్యలు తీసుకునే ఆలోచనతో ఉన్నట్టు కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి వెల్లడించారు. శుక్రవారం హైదరాబాద్‌లో యువజన కాంగ్రెస్ నేత అనిల్ యాదవ్‌తో కలిసి ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ మాట్లాడేవన్నీ వాస్తవాలేనన్నారు. కాంగ్రెస్ యాక్షన్ ప్లాన్ ఏంటో త్వరలోనే తెలుస్తోందన్నారు. రాహుల్ అడిగే ప్రశ్నలకు బీజేపీ సర్కారు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నటుడు షారుఖ్‌ఖాన్ ముస్లిం కాబట్టే ఆయన కొడుకుపై డ్రగ్స్ అభాండాలు వేసి అదానీ విషయాలు పక్కతోవ పట్టిస్తున్నారని చెప్పారు. రాహుల్ అడిగిన ప్రశ్నలనే తాను అడుగుతున్నట్టు తెలిపారు.

పాక్ దేశద్రోహ చట్టాన్ని కొట్టేసిన లాహెూర్ కోర్టు

లాహెూర్ : వలసవాద కాలం నాటి దేశద్రోహ చట్టాన్ని లాహెూర్ కోర్టు కొట్టివేసింది. ఈ చట్టం రాజ్యాంగానికి అనుగుణంగా లేదని పేర్కొంది. దాంతో పాకిస్తాన్ శిక్షా స్మృతిలోని 12 4 ఎ సెక్షన్ చెల్లకుండా పోయింది. భారత్‌లో మాదిరిగానే పాకిస్తాన్‌లో కూడా ఈ చట్ట మూలాలు వలసవాద కాలం నాటివి. అందువల్లే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏమాత్రం అసమ్మతి వున్నా వెంటనే వారిని శిక్షించాలని కోరుతుంది. ఈ చట్టాన్ని పాక్‌లో నిర్లక్ష్యంగా ఉపయోగిస్తున్నారని ఆరోపిస్తూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. అసమ్మతిని అణచివేయడానికి దీన్నొక సాధనంగా ఉపయోగిస్తున్నారని ఆ పిటిషన్లు పేర్కొన్నాయి. పాకిస్తానీ రాజ్యాంగంలో 19వ అధికరణ కింద హామీ కల్పించబడిన భావ ప్రకటనా స్వేచ్ఛను కూడా అణచివేస్తున్నారని పిటిషన్లు పేర్కొన్నాయి.

జస్టిస్ షాహిద్ కరీమ్ ఈ పిటిషన్లన్నింటినీ విచారించి తీర్పు ఇచ్చారని డాన్ పత్రిక పేర్కొంది. దేశ రాజ్యాంగం కింద సంక్రమించిన అనేక ప్రాథమిక హక్కులను ఈ చట్టం అవమానిస్తోందని హరూమ్ ఫరూక్ అనే వ్యక్తి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. గత ఐదేళ్ల కాలంలో ఈ దేశద్రోహ చట్టం కింద అనేకమంది రాజకీయ నేతలు, జర్నలిస్టులు, కార్యకర్తలు అరెస్టయ్యారు.